

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

21-9-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 231 పేజీలు: 8+4 వెల: 8.00



నేలకేసి కొట్టి చిన్నారిని చంపిన తండ్రి 6

నేటి నుంచి బతుకమ్మ సంబురాలు 7


ఇకపై హెచ్1బి వీసా అప్లికేషన్ ఫీజు 100,000 డాలర్లు అంటే భారత్ కరెన్సీలో సుమారు దాదాపు 88 లక్షలు వసూలు చేయాలని ట్రంప్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటివరకు ఈ ఫీజు కేవలం రూ.1లక్ష నుంచి రూ.6 లక్షల మధ్య ఉండేది. వాషింగ్టన్ డిసి వైట్‌హౌస్ ఓవల్ ఆఫీస్‌లో శనివారం ఆయన ఈ ఉత్తర్వులపై సంతకం చేశారు.




# ట్రంప్ పేల్చిన 'వీసా' బాంబు

## హెచ్-1బి వీసాలకు ఇక ఫీజు లక్ష డాలర్లు

ఐటి, సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్ కార్పొరేట్లకు మరింత భారం

భారత్ టెక్కీల కట్టడికే ఈ నిర్ణయం

**వాషింగ్టన్‌డీసీ, సెప్టెంబరు 20:** భారత్‌తో కయ్యానికి కాలుదువ్వుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో శరాఘాతం ఆలాంటి నిర్ణయం అమలుచేస్తున్నారు. నయాన్నోభయాన్నో భారత్‌ను దారికితెచ్చుకోవాలన్న కుటిలయత్నాలు ఎక్కడా ఫలించకపోవడంతో ఇపుడు విదేశీ వీసాలపై పెన్నుపెట్టారు. హెచ్‌వన్‌బి వీసా కోసం కొత్త నిబంధనలను అమల్లోకి తెచ్చారు. ఇకపై హెచ్1బీ వీసా అప్లికేషన్ ఫీజు 100,000 డాలర్లు అంటే భారత కరెన్సీలో సుమారు దాదాపు >>2

2 మాకు గొప్ప ఉద్యోగులు కావాలి అందుకే ఈ నిర్ణయం: ట్రంప్

విదేశాలపై ఆధార పడటం వల్లే ఈ దుస్థితి - ప్రధాని మోడీ 2



# 'లాల్' 'దాదా'



ప్రముఖ మలయాళ నటుడు మోహన్‌లాల్‌కు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు.. 23న ప్రదానం

## బహుభాషా నటునిగా గుర్తింపు పొందిన 'పద్మభూషణు'డు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 20:** బహుభాషా చిత్రాల మళయాళ ప్రముఖ నటుడు మోహన్‌లాల్‌కు దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారాన్ని కేంద్రం ప్రకటించింది. అవార్డుల ఎంపిక కమిటీ మోహన్‌లాల్‌నున ఎంపికచేసినట్లు కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వశాఖప్రకటించింది. చలన చిత్రరంగంలో మోహన్‌లాల్ జీవితం భావితరాలకు స్ఫూర్తినిచ్చేదిగా ఉందని, దర్శకుడు, నిర్మాతగాను, బహుబాషా నటుడిగాను అనితరసాధ్యమైన నటనను ప్రదర్శించారని కేంద్ర ప్రభుత్వం కొనియాడింది. భారత చలనచిత్ర రంగానికి అత్యుత్తమ ప్రమాణాలను తీర్చిదిద్దిన ప్రముఖులని సమాచారశాఖ వెల్లడించింది. 71వ జాతీయ చలనచిత్రోత్స వాల్లో ఈ అవార్డును బహూకరించనున్నట్లు కేంద్రం >>2

# 'మేడారా'నికి కొత్త రూపు

23న సమ్మక్క- సారలమ్మ పూజారులతో సిఎం రేవంత్ భేటీ.. అభివృద్ధి డిజైన్ల ఆవిష్కరణ

గిరిజన సంప్రదాయం ఉట్టిపడేలా జాతర ప్రదేశం రూపకల్పన.. గద్దెలు, ఇతర నిర్మాణాల నవీకరణ

**మేడారంపై అధికారులు మంత్రులతో సమీక్ష జరిపిన ముఖ్యమంత్రి**

సిఎంతో కలిసి మేడారం వెళ్లనున్న మంత్రులు, గిరిజన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు



శనివారం మేడారంపై సమీక్షలో మాట్లాడుతున్న సిఎం రేవంత్. చిత్రంలో మంత్రులు పొంగులేటి, కొండా సురేఖ, సీతక్క తదితరులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు20:** ఈ నెల 23 న మేడారంకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెళ్లనున్నారు. అభివృద్ధిపై క్షేత్రస్థాయిలో సందర్శించి సమ్మక్క సారలమ్మ పూజారులను సంప్రదించనున్నారు. పూజారుల సూచనల మేరకు వారి ఆమోదంతో అభివృద్ధిపై డిజైన్లను విడుదల చేయనున్నారు. మేడారం జాతర పనులకు సంబంధించి టెక్నికల్ కమిటీని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. శనివారం మేడారం అభివృద్ధి ప్రణాళికపై ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సిఎం రేవంత్‌రెడ్డి సమీక్ష చేశారు. పూజారులు కోరిన విధంగా ప్రస్తుతం ఉన్న ఆలయ ఆవరణను మరింత విస్తరించాలని ప్రభుత్వం ఆశిస్తున్నది. గద్దెలను యథాతథంగా ఉంచి సంప్రదాయాలను తూచా తప్పకుండా గౌరవించాలని సిఎం ఆదేశించారు. గిరిజన సంప్రదాయం ఉట్టిపడేలా స్వాగత తోరణం డిజైన్లు ఉండాలని తెలిపారు. ఆలయం పరిసర ప్రాంతాల్లో ఆ ప్రాంత సంప్రదాయ వృక్షాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్న సిఎం సూచించారు. 23న సీఎంతో పాటు మంత్రులు, గిరిజన ఎంపీలు, ఎంఎల్సీలు, ఎమ్మెల్యేలు, సంబంధిత అధికారులు మేడారం వెళ్లనున్నారు. మేడారం జాతర పనులపై 23న మేడారంలో సిఎం సమీక్షించనున్నారు. సిఎం వద్ద జరిగిన సమీక్షలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, కొండా సురేఖ,అడ్లూరి లక్ష్మణ్,సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ బలరాం నాయక్, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇప్పటికే స్పెషల్ పార్టీ పోలీసులు, గ్రేహౌండ్స్ దళాలు దట్టమైన అటవీ ప్రాంతం జల్లెడ పడుతుండగా, జిల్లా పోలీస్ యంత్రాంగం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. ఈ నెల 16 న ముఖ్యమంత్రి మేడారంలో పర్యటించాల్సి ఉండగా >>2



# అదనంగా 1.17 లక్షల టన్నుల యూరియా

-మంత్రి తుమ్మల

**హైదరాబాద్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:** రాష్ట్రానికి ఈ నెలలో అదనంగా 1.17 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అదనంగా కేటాయించేందుకు కేంద్రం అనుమతినిచ్చిందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. ఈమేరకు శనివారం ఒక ప్రకటనలో ఇందులో 60 వేల టన్నులు రవాణాలో ఉండగా, మరో 50 వేల టన్నులు వారంలోగా రాష్ట్రానికి చేరుకునే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలోని రైతులకు ఈ నెలలో ఇప్పటివరకు 1.44 లక్షల టన్నుల యూరియా సరఫరా చేసినట్లు చెప్పారు. ముఖ్యంగా రబీ పంటల సాగు కూడా ఆరంభం అవుతున్న ఈ సమయంలో రైతులకు అవసరమైన యూరియా సరఫరాలో లోపం కలగకుండా చూస్తున్నట్లు స్పష్టం చేశారు. కాగా రాష్ట్రానికి యూరియా సరఫరా చేయడంలో రామగుండం ఫ్యాక్టరీ కీలకమైనదన్నారు. అయితే గత 90 రోజులుగా ప్లాంట్ షట్‌డౌన్ కారణంగా ఉత్పత్తి నిలిచిపోయిందని వెల్లడించారు. దీంతో కేంద్ర రసాయనాల మంత్రి, >>2

దేవుడి భూములు కబ్జాచేస్తే

# ఖబడ్దార్

పిడి చట్టం ప్రయోగిస్తాం

ఎండోమెంటు ప్లీడర్లపై మంత్రి అసంతృప్తి

ప్రతి ఆరు నెలలకు స్టేటస్ చెప్పాలని అధికారులకు మంత్రి సురేఖ ఆదేశం



**హైదరాబాద్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:** దేవుడి భూములపై లీగల్ ఫైట్ గట్టిగా చేయాలని, అసలు న్యాయ పోరాటం సరైన రీతిలో ఎందుకు జరగడం లేదని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ప్రశ్నించారు. శనివారం రాష్ట్ర సచివాలయంలోని దేవాదాయ శాఖ మంత్రి పేషీలో ఎండోమెంటు గవర్నమెంటు ప్లీడర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి సురేఖ మాట్లాడుతూ ఎండోమెంటు కేసుల విషయంలో న్యాయవాదులతో ప్రతి ఆరు నెలలకొక సారి సమావేశం నిర్వహించిస్టేటస్ చెప్పాలని మంత్రి శాఖ అధికారులను ఆదేశించారు. దేవుడి భూములు కబ్జా చేస్తే పీడీ యాక్టు పెట్టండంటూ ఆదేశాలు జారీ చేశారు. ఎండోమెంటు భూముల అన్యాక్రాంతానికి సంబంధించి కేసుల పురోగతిని మంత్రి సమీక్షించారు. ఎండోమెంటు ప్లీడర్ల పనితీరుపై మంత్రి సురేఖ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దేవుడి భూములు కాపాడటంలో ఎందుకు జాప్యం జరుగుతుందని నిలదీశారు. తన ముందు వాదించినట్టు ఇక్కడ కోర్టులో వాదించలేకపోతున్నారని మంత్రి అడిగారు.ఈ సమావేశంలో ఎండోమెంటు ప్రిన్స్‌పల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, యాదగిరిగుట్ట ఈఒ వెంకటరావు, కమిషనర్లు క్రిష్ణ ప్రసాద్, క్రిష్ణవేణి, ఎండోమెంటు శాఖ గవర్నమెంటు >>2



# 'తుమ్మిడివాట్టి'కి ప్రణాళిక

ప్రాణహిత- చేవెళ్ల పునరుద్ధరణ తథ్యం

సమ్మక్క- సారక్క ప్రాజెక్టుకు నీటికేటాయింపులు

**కొడంగల్ ప్రాజెక్టుకు త్వరలో భూ సేకరణ: మంత్రి ఉత్తమ్ కుమార్**

**హైదరాబాద్, సెప్టెంబరు 20,ప్రభాతవార్త:** ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మొదలు పెట్టిన ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టు పూర్తికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం నీటిపారుదల శాఖా ప్రధాన కార్యాలయం జలసౌధ లో జరిగిన నీటిపారుదల శాఖా సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని రాష్ట్రం లోని ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు.అందుకు అనుగుణంగా తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.150 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మాణం కోసం మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఎలాగైనా ఒప్పించాలని, అవసరమైతే ముంపునకు గురయ్యే 1,467 ఎకరాల భూముల సేకరణకు అక్కడి భూముల మార్కెట్ విలువను తెలుసుకోవాల్సి ఉంటుందని అన్నారు.. ఈ పథకానికి సంబంధించి డీపీఆర్ తయారీ కోసం కసరత్తు ప్రారంభించిందిరాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయల్సిన ప్రాజెక్టులలో సమ్మక్క సారక్క ప్రాజెక్టుకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.అందులో భాగంగా ఈ నెల 25న ఢిల్లీలో కేంద్ర జలవనరుల సంఘం సమావేశానికి హాజరై ఆ ప్రాజెక్టుకు నీటి కేటాయింపులతో పాటు టెక్నికల్ అడ్వైజరీ కమిటీ నుండి అనుమతి తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. అదే విధంగా ఛత్తీస్ ఘడ్ ప్రభుత్వంతో చర్చించి అనుమతులు తీసుకోవాలని ఆయన సూచించారు.సీతారాం సాగర్,మోడికుంట వాగు,చనాకా/కొరాట డిస్ట్రిబ్యూటరీ సిస్టంతో పాటు చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుల నిర్మణాలకు కావాల్సిన నిధులను కేంద్ర ప్రభుత్వం నుండి విడుదల చేసే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్రానికి పంపాలన్నారు.కృష్ణా జలాల వివాదాల ట్రిబ్యునల్ విషయమై సుప్రీంకోర్టులో ఈ నెల 23,25 న వాదనలు ఉన్నందున అంతకు >>2

## రేపటి నుంచి దసరా సెలవులు



**హైదరాబాద్, ప్రభాతవార్త, సెప్టెంబరు 20:** తెలంగాణ రాష్ట్రంలోని విద్యా సంస్థలకు రేపటి(సోమవారం) నుంచి దసరా సెలవులు ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు దసరా సెలవులు సోమవారం నుంచి ప్రారంభం కానున్నప్పటికీ నేడు ఆదివారం కావడంతో ఈ రోజు కూడా సెలవుగానే కొనసాగనుంది. పాఠశాల విద్య శాఖ ప్రకటించిన >>2

# జెన్-జడ్ తరహాలో ఉద్యమాలు రావొచ్చు

యువత ఆకాంక్షలను విస్మరించొద్దు

**మందిర్- మసీదు కాదు మౌలిక వసతులు ముఖ్యం**

**రాష్ట్రంలో రీకాల్, రీగ్రెట్, రివోల్ట్ నడుస్తోంది: కెటిఆర్**



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 20:** యువత ఆకాంక్షలను ప్రభుత్వాలు విస్మరిస్తే, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు వచ్చే ప్రమాదం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె. తారక రామారావు హెచ్చరించారు. దేశ యువత ఆకాంక్షలు ఆకాశాన్ని తాకుతుంటే, పాలకుల ఆలోచనలు మాత్రం పాకిస్థాన్, బంగ్లాదేశ్‌ల చుట్టూనే తిరుగుతున్నాయని విమర్శించారు. ప్రజల మౌలిక భావోద్వేగాలను రెచ్చగొడుతూ, మందిర్‌మస్జిద్, ఎవరు ఏం తింటున్నారు? ఎవరేం కట్టుకుంటున్నారన్న అంశా లపై ప్రజల దృష్టిని మళ్లించడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజయం సాధించారని ఆరోపించారు. దేశ భవిష్యత్తుకు కీలకమైన అభివృద్ధి, ఆవిష్కరణలను మోడీ గాలికొదిలేశారన్నారు.శనివారం ముంబైలో జరిగిన "ఎన్‌డిటీవీ యువ 2025- ది ముంబాయి చాప్టర్ సదస్సులో కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. చైనా, జపాన్, అమెరికా వంటి పశ్చిమ దేశాలతో పోటీపడి వారిని అధిగమించే ప్రయత్నం చేయాలే తప్ప, మనకన్నా వెనుకబడిన దేశాలతో పోల్చుకుని సంతృప్తి చెందడం సరికాదన్నారు. జెన్-జడ్ ఆలోచనలు, దేశ యువత ఆకాంక్షలు, ప్రభుత్వాల పాత్ర వంటి అంశాలపై తనదైన శైలిలో అద్భుతంగా ప్రసంగించి సభికులను ఆకట్టుకున్నారు. ప్రస్తుత తరం యువత (జెన్-జీ) కేవలం డిజిటల్ మీడియాకే పరిమితం కావద్దన్న కేటీఆర్, సమాజం పట్ల అపారమైన బాధ్యతతో పనిచేయాలన్నారు. జెన్-జడ్ శక్తిని >>2



# ఇక నేను పోటీ చేయను

నా అజెండా నియోజకవర్గ అభివృద్ధి మాత్రమే: కడియం

**హన్మకొండ బ్యూరో, ప్రభాతవార్త:** స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రాలలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి ౖ, షాదీ ముబారక్ మరి యు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపి ణి కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా >>2

# లంచావతారులను ఎసిబి వంచలేదా!




**ఎన్నో కేసుల్లో ప్రాసిక్యూషన్ కోసం యేళ్ల తరబడి ఎదురు చూపులు**

**హైదరాబాద్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:** ప్రభుత్వ విభాగాల్లో అవినీతి అధికారుల భరతం పట్టేందుకు ఏర్పాటైన ఎసిబి కోరలు లేని నాగు పాముగా బ్యాటరీ వీక్ అయిన రోబోగా మారిందనే విమర్శలు రాసాగాయి. లంచాలు తీసుకుంటూ పట్టుబడ్డ అధికారులు, అడ్డగోలు సంపాదనతో దొరికిపోయిన బడా అధికారులను ప్రాసిక్యూట్ చేసి కోర్టులో వారికి శిక్షలు పడేలా చేసేందుకు ఎసిబి అధికారులు సర్కారుకు వందాది ఆర్జిలు పెట్టుకుంటు న్నా వీటిలో పట్టుమని పదిశాతం వాటికి కూడా మోక్షం లభించడం లేదు. మెజారిటీ కేసుల్లో బడా నాయకుల ఒత్తిడి, సీనియర్ అధికారుల సిఫా ర్సుల కారణంగా కేసులు విత్‌డ్రా అవడం లేదా శాఖాపరమైన చర్యలకే పరిమితమవుతుండడం ఇందుకు ఉదాహరణలుగా నిలుస్తున్నాయి. ఓవైపు ఎ సిబిని మరింత పరిపుష్టి చేసి, అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాలా చేస్తాం...అని సర్కారు పదే పదే చెబుతుండగా క్షేత్రస్థాయిలో జరుగు తున్న ఘటనలు దీనికి భిన్నంగా వుండడం గమనార్హం.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి అప్పుడే 11 ఏళ్లు గడిచిపోయాయి. ఈ 11 ఏళ్ల వ్యవధిలో వేల కేసులను ఎసిబి నమోదు చేయగా ఇందులో 70 శాత ం రెడ్‌హ్యాండెడ్ ట్రాప్ కేసులు మిగతావి ఆదాయానికి మించి ఆస్తులు కలిగినవి. ఎసిబి ఒక అధికారిని లంచం కేసులో అరెస్టు చేస్తే లంచం తాలూకు సొమ్ము పట్టుబడితే అతన్ని వెంటనే అరెస్టు చేయడంతో పాటు వెంటనే కోర్టులో హాజరు పరిచి జైలుకు పంపుతుంది. >>2

బడా నాయకుల ఒత్తిడి, సీనియర్ల సిఫారసులతో కేసులు విత్‌డ్రా

సమర్థవంతంగా దర్యాప్తులు సాగడం లేదని విమర్శలు



గుజరాత్‌లోని భావ్‌నగర్‌లో పలు అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభోత్సవం అనంతరం ప్రధాని మోడీకి జ్ఞాపికను అందజేస్తున్న కేంద్ర మంత్రి సిఆర్ పాటిల్, సిఎం భూపేంద్ర భాయ్ పటేల్

## ‘తుమ్మిడివాట్టి’కి ప్రణాళిక

>> ముందే సుప్రీంకోర్టు న్యాయవాది సి.ఎస్.వైద్యనాథ్ తో చర్చలు జరగనున్నాయన్నారు.జాతీయ డ్యామ్ ల పరిరక్షణ సంస్థ చేసిన సూచనలకు అనుగుణంగా మెడిగడ్డ,అన్నారం,సుందిళ్ళ బ్యారేజ్ లను పునరుద్ధరణ ఉంటుందన్నారు.బ్యారేజ్ లను పునరుద్ధరించడంలో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతతో ఉందని అయితే ఎన్ డి ఎస్ ఎ సూచనాలకనుగుణంగా పనులు ముందుకు సాగుతాయని ఆయన స్పష్టం చేశారు.అయితే అదే సమయంలో ఐఐటీ వంటి సంస్థలతో నిర్మాణానికి సంబంధించిన అంశాలను పరీక్షి ంచేలా చర్యలు తీసుకోవడంతో పాటు వరదలు తగ్గిన వెంటనే పనులు మొదలు పెట్టేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించు కోవలన్నారు. కొడంగల్‌నారాయణపేట ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.అదే విదంగా డిండి,ఎస్.ఎల్.బి.సి,పెండ్లి పాకల,నక్కలగండి ప్రాజెక్టుల భూసేకరణను వేగవంతం చేయాలన్నారు. నీటిపారుదల శాఖా ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్,సహాయ కార్యదర్శి కే. శ్రీనివాస్, ఆర్ అండ్ ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు,ఇ.ఎన్.సి లు అంజద్ హుస్సేన్ సి.యి లు మధుసూదన్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,విజయ బాస్కర్ రెడ్ తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి దసరా సెలవులు

>> 2025-26 విద్యా సంవత్సరపు అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 3 వరకు దసరా సెలవులు కొనసాగుతాయి. సెప్టెంబర్ 22 సోమవారం కావడం.. సెప్టెంబర్ 21 ఆదివారం కావడంతో 21 నుంచే దసరా సెలవులు ప్రారంభం కాగా.. అక్టోబర్ 3 వరకు కొనసాగనున్నాయి. మొత్తంగా తెలంగాణలో పెద్ద పండుగగా జరుపుకునే దసరా పండుగకు పాఠశాలలకు 12 రోజుల పాటు దసరా సెలవులు రానున్నాయి. అక్టోబర్ 3 వరకు దసరా సెలవుల అనంతరం తిరిగి అక్టోబర్ 4న పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ఇక రాష్ట్రంలోని జూనియర్ కాలేజీలకు అధికారికంగా ఈ నెల 29(సోమవారం) నుంచి అక్టోబర్ 6 వరకు దసరా సెలవులు కొనసాగనున్నాయి. ఇంటర్ బోర్డు ప్రకటించిన 2025-26 విద్యా సంవత్సరపు అకడమిక్ క్యాలెండర్‌లో దసరా సెలవులను అధికారికంగా సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 6 వరకు అని ప్రకటించారు. అయితే సెప్టెంబర్ 28 ఆదివారం కావడంతో.. ఈ నెల 28 నుంచే జూనియర్ కాలేజీలకు సెలవులు ఇవ్వనున్నారు. జూనియర్ కాలేజీలకు 9 రోజులపాటు దసరా సెలవులు కొనసాగి .. తిరిగి అక్టోబర్ 7న కాలేజీలు పునః ప్రారంభం కానున్నాయి. అయితే రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీలకు దసరా సెలవులు వేర్వేరుగా ఉన్నాయి. యూనివర్సిటీల వారీగా దసరా సెలవులను ప్రకటించారు. డిగ్రీ కాలేజీలకు రేపటి(సోమవారం) నుంచే దసరా సెలువులు ప్రారంభం కానుండగా.. మరికొన్ని కాలేజీలకు ఈ నెల 29 నుంచి దసరా సెలవులను ప్రకటించారు. అక్టోబర్ 6 నుంచి కాలేజీలు తిరిగి ప్రారంభం కానున్నాయి.

## ఇక నేను పోటీ చేయను

>> హాజరయ్యారు. ఈ సందర్భంగా స్టేషన్ ఘనపూర్ మండలానికి సంబందించిన 34మంది కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు 34లక్షల 03వేల 944రూపాయల విలువగల చెక్కులను, 38మంది ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు 15లక్షల 47వేల 500 రూపాయల విలువగల చెక్కులను లబ్ధిదారులకు పంపిణి చేశారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ... కొంత మంది రాజకీయంగా మాట్లాడకుండా వ్యక్తి గత విమర్శలు చేస్తూ అత్యంత నీచ స్థాయికి దిగజారి మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇలాంటి వారి వల్ల ప్రస్తుత రాజకీయాలు భ్రష్టు పడుతున్నాయని అన్నారు. నేను తప్పుడు పనులు చేయనని ఎవరి దగ్గరతల వంచనని స్పష్టం చేశారు. మళ్ళీ ఎమ్మెల్యే గా పోటీ చేసేది లేదని నాకున్న ఏకైక ఎజెండా నియోజకవర్గ అభివృద్ధి మాత్రమేనని అన్నారు. రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి కలిసిరావాలని కోరారు. నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి, నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నానని వెల్లడించారు.

## ఉద్యమాలు రావొచ్చు

>> తక్కువ అంచనా వేయద్దని పాలకులను హెచ్చరించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 400 ఎకరాల అటవీ భూమిని అమ్మాలని ప్రయత్నిస్తే, సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు అద్భుతంగా పోరాడి ప్రభుత్వ మెడలు వంచిన విషయాన్ని గుర్తుచేశారు. చివరికి సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని ఆ భూముల విక్రయాన్ని నిలిపివేసిందన్నారు. ఇదే జెన్-జీ పవర్ అన్నారు. సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే యువత, రాజకీయాల్లోకి కూడా రావాలన్నారు. ‘రాజకీయాలు మీ భవిష్యత్తును నిర్ణయిస్తున్నప్పుడు, మీరే ఎందుకు రాజకీయాలను నిర్ణయించలేరు?’ అని కేటీఆర్ యువతకు పిలుపునిచ్చారు. ప్రపంచం అంతా ముసలితనంలో ఉంటే భారతదేశం మాత్రం యవరక్తంతో ఉరకలెత్తుతోందన్నారు.. ఈ యువశక్తిని దేశ నిర్మాణానికి వాడుకోవడంలో పాలకులు విఫలమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 1985లో చైనా, భారత ఆర్థిక వ్యవస్థలు దాదాపు సమానంగా ఉండేవన్నారు. అప్పుడు చైనా తలసరి ఆదాయం 300 డాలర్లు అయితే మనది 500 డాలర్లు. కానీ 40 ఏళ్ల తర్వాత చూస్తే, ఇండియా ఆర్థిక వ్యవస్థ 4 ట్రిలియన్ డాలర్లకే పరిమితం అయితే, చైనా 20 ట్రిలియన్ డాలర్లకు ఎదిగింది. ఇవాళ చైనా తలసరి ఆదాయం 13,000 డాలర్లు అయితే మనది కేవలం 2,700 డాలర్లే అన్నారు. చైనా మనల్ని ఎలా దాటిపోయిందో ప్రతి ఒక్కరూ ఆలోచించాలన్నారు. అమెరికా, యూరప్‌లతో చైనా పోటీపడితే, మనం మాత్రం పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లతో పోల్చుకుని మురిసిపోతున్నాం’ అన్నారు. అణుబాంబు దాడితో సర్వనాశనమైన జపాన్, కేవలం 23 ఏళ్లలోనే విధ్వంసం నుంచి వికాసం వైపు పయనించిందని కేటీఆర్ గుర్తుచేశారు. 1945లో హీరోషిమా, నాగసాకిలపై అణుదాడి జరిగి లక్షలాది మంది చనిపోయినా జపాన్ కుంగిపోలేదన్నారు. ఎన్నో భౌగోళిక అననుకూలతలు ఉన్నా, ప్రకృతి వైపరీత్యాలు ముంచెత్తినా వాటన్నింటిని తట్టుకుని అద్భుత ఆవిష్కరణలు, పారిశ్రామికీకరణతో నేడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా జపాన్ ఎదిగిందన్నారు. జపాన్ సాధించినప్పుడు భారతదేశం ఎందుకు సాధించలేకపోయిందో ప్రతీ ఒక్కరు ఆలోచించాలన్నారు.

## హెచ్1బి వీసా సమస్యను వెంటనే పరిష్కరించాలి: సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు20:** హెచ్1 బి వీసాపై ట్రంప్ ఆదేశాలు దిగ్భ్రాంతికి గురి చేశాయని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. చారిత్రక ఇండో-అమెరికన్ సత్సంబంధాల్లో ఇది ఏ మాత్రం ఆమోదయోగ్యమైన నిర్ణయం కాదన్నారు. దీని వల్ల తెలుగు టెకీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని ప్రధాని మోడీ, విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌ను కోరుతూ సిఎం రేవంత్ ట్వీట్ చేశారు.

## లాల్ ‘దాదా’

>> ప్రకటించింది. ఈ అవార్డుల ప్రధానోత్సవం ఈనెల 23వ తేదీ జరుగుతుంది. గత ఏడాది ప్రముఖ నటుడు మిథున్ చక్రవర్తికి దాదాసాహెబ్ పాల్కే పురస్కారం లభించింది. 1978లో తిరణోత్తమ్‌తో చిత్రరంగ ప్రవేశం చేశారు మోహన్‌లాల్. నాలుగు దశాబ్దాలకు పైగా సినిమా ఇండస్ట్రీలో కొనసాగుతున్న మోహన్ లాల్ మలయాళం, తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో 350కిపైగా చిత్రాల్లో నటించారు. గతంలో ప్రముఖ నటులు డా.అక్కినేని నాగేశ్వరరావు, ఎల్వీప్రసాద్, డా.రామానాయుడు, బిఎన్‌రెడ్డి వంటి ప్రముఖులు ఈ అవార్డును పొందినవారిలో ఉన్నారు.

**మోహన్‌లాల్ బహుముఖ ప్రజ్ఞావంతుడు: ప్రధాని** మోదీ దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుకు ఎంపికైన మోహన్ లాల్‌కు ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. మలయాళ సినిమాకు మోహన్‌లాల్ ఒక జ్యోతి వంటి వారని ప్రశంసించారు. మోహన్‌లాల్ సాధించిన విజయాలు రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకంగా ఉండాలని కోరుకుంటున్నాను. మోహన్‌లాల్ ప్రముఖ ప్రజ్ఞాశాలి. దశాబ్దాలుగా చేసిన గొప్ప కృషితో ఆయన మలయాళ సినిమా, నాటక రంగానికి ఒక వెలుగులా నిలుస్తున్నారు. కేరళ సంస్కృతి పట్ల ఆయన చాల మక్కువతో ఉంటా ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు. మలయాళ సూపర్‌స్టార్ అయిన మోహన్‌లాల్ చిత్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందిన, విమర్శకుల ప్రశంసలు పొందిన ఎన్నో చిత్రాలు ఉన్నాయి. వాటిలో తన్మాత్ర, దృశ్యం, వానప్రస్థం, ముంథిరివల్లికల్ తలిర్కుకుంబోల్, పులిమురుగన్ మొదలైనవి ఉన్నాయి. మోహన్‌లాల్‌ప్రేక్షకుల, అభిమానుల మన్నలనే కాదు అనేక అవార్డులను కూడా పొందారు. ఆయన జాతీయ ఉత్తమ నటుడు అవార్డును రెండు సార్లు అందుకున్నారు. అలాగే తొమ్మిది కేరళ రాష్ట్ర అవార్డులు సహా అంతర్జాతీయ పురస్కారాలు ఎన్నో పొందారు. అంతేకాదు కళల అభివృద్ధికి చేసిన కృషికి గాను మోహన్‌లాల్‌కు 2001లో పద్మశ్రీ, 2019లో పద్మభూషణ్ పురస్కారాలు లభించాయి.

## వారం - వర్జ్యం

21-09-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం
●అమావాస్య రా.1.25
పూర్వఫల్గుణి ఉ.9.33
వర్జ్యం : సా.5.19-7.02
దు.సా.4.25-5.14
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం :** అధిక శ్రమ చేయకుండానే లక్ష్యసాధనను సాధనను సాధిస్తారు. ప్రయాణాలు.

**వృషభం:** బంధువులను సోదరులను కలిసి ఆనందంగా గడుపుతారు. వస్తులాభం.

**మిథునం:** కుటుంబ సభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది. ఓర్పుతో ఎంతటి కార్యాన్నైనా సాధిస్తారు.

**కర్కాటకం :**కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు.

**సింహం:**కీలక నిర్ణయాలలో స్వతంత్ర ఆలోచనా శ్రేయస్కరం. వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**కన్య :** పారిశ్రామిక రాజకీయ రంగాలలోని వారికి విదేశీ పర్యటనలు వుంటాయి.

**తుల :** ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. గృహ నిర్మాణ ఆలోచనలు చేస్తారు.

**వృశ్చికం:** వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధిని సాధిస్తారు. నూతన పెట్టుబడులలో నిదానం అవసరం.

**ధనుస్సు:** అనుకోని అవకాశాలు లభిస్తాయి. నూతన విద్యలయందు ఆసక్తిని చూపుతారు.

**మకరం:** చిన్ననాటి మిత్రలను కలిసి సంతోషంగా గడుపుతారు. వాహనసౌఖ్యం.

**కుంభం:**కుటుంబంలో నూతన బాధ్యతలు చేపడతారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది

**మీనం :** సంతానం పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. ఇంటా బయట అనుకూలం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ట్రంప్ పేల్చిన ‘వీసా’ బాంబు

>> 88 లక్షలు వసూలు చేయాలని ట్రంప్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటివరకు ఈ ఫీజు కేవలం రూ.1లక్ష నుంచి రూ.6 లక్షల మధ్య ఉండేది. వాషింగ్టన్ డీసీ వైట్ హౌస్‌లో ఓవల్ ఆఫీస్‌లో శనివారం ఆయన ఈ ఉత్తర్వులపై సంతకం చేశారు. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం లక్షలాది మంది విదేశీ నిపుణులను, ముఖ్యంగా అమెరికా హెచ్1బి వీసాపై ఎక్కువగా ఆధారపడిన భారతీయ ఐటీ, టెక్నాలజీ రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. హెచ్‌వన్‌బీ వీసా 1990లో ప్రారంభమైంది. అమెరికాలో కొరత ఉన్న రంగాల్లో ఉన్నత విద్యావంతులు, నిపుణులైన విదేశీ నిపుణులను నియమించుకోవడానికి దీనిని ప్రవేశపెట్టారు. అయితే కంపెనీలు దీనిని దుర్వినియోగం చేస్తున్నాయని ట్రంప్ సహా ఆయన ప్రభుత్వంలోని పలువురు ధ్వజమెత్తుతున్నారు. ఈ నిర్ణయంతో హెచ్1బి వీసా ప్రోగ్రామ్ దుర్వినియోగాన్ని ఆపడంతో పాటు ఇకపై అమెరికా కంపెనీలు అత్యున్నత నైపుణ్యం కలిగిన విదేశీ ఉద్యోగులను మాత్రమే నియమించుకుంటాయని ట్రంప్ ప్రభుత్వం భావిస్తోంది. ఈ చర్య అమెరికా ఉద్యోగాలను కాపాడడమే కాకుండా కొత్త అవకాశాలను సృష్టిస్తుందని నమ్ముతోంది. ట్రంప్ సంతకం చేసిన ఉత్తర్వుల్లోని నిర్ణయాలపై వైట్‌హౌస్ స్టాఫ్ సెక్రటరీ విల్ షార్ఫ్ వివరాలు వెల్లడించారు. హెచ్1బి వ్యవస్థలో జరుగుతున్న దుర్వినియోగాన్ని అరికట్టడానికే ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. నిజానికి హెచ్1బీ వీసా వ్యవస్థ అత్యధికంగా దుర్వినియోగం అవుతున్న వలస విధానాల్లో ఒకటి. ఈ ప్రోగ్రామ్ అసలు ఉద్దేశం అమెరికన్లు పని చేయలేని రంగాల్లో అత్యంత నైపుణ్యం కలిగిన విదేశీయులను మాత్రమే తీసుకురావడం లక్ష్యంగా జారీ అయ్యేవి. ఇప్పుడు కంపెనీలు ఒకరిని స్పాన్సర్ చేయాలంటే 100,000 డాలర్లు చెల్లించాలి. దీంతో వారు తీసుకురాబోయే వ్యక్తులు నిజంగానే అత్యున్నత ప్రతిభావంతులు అయి ఉండాలి. వారిని అమెరికన్ ఉద్యోగులతో భర్తీ చేయలేనివారిగా నిరూపించాల్సి ఉంటుందని వైట్ హౌస్ స్టాఫ్ సెక్రటరీ విల్ షార్ఫ్ తెలిపారు. అమెరికా వాణిజ్య కార్యదర్శి హోవార్డ్ లుట్నిక్ కూడా హెచ్1బి వ్యవస్థపై తీవ్ర విమర్శలు చేశారు. ఇకపై పెద్ద టెక్ కంపెనీలు చౌకగా విదేశీయులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇవ్వలేరు. ముందుగా వారు ప్రభుత్వానికి 100,000 డాలర్లు చెల్లించాలి, తర్వాత ఉద్యోగికి జీతం ఇవ్వాలి. ఇది ఆర్థికపరంగా లాభదాయకం కానందున ఇప్పుడు అమెరికన్ విశ్వవిద్యాలయాల నుంచి పట్టభద్రులైన యువతకు శిక్షణ ఇవ్వాలి. విదేశీయులను తీసుకురావడం తగ్గించాలి. ఇదే మా పాలసీ అని లుట్నిక్ పేర్కొన్నారు. 2015 నుంచి మంజూరైన హెచ్1బి వీసాలలో 70శాతం కంటే ఎక్కువ భారతీయులకే దక్కుతున్నాయి. ఈ ఫీజు పెంపు నేరుగా భారతీయ ఐటీ ప్రొఫెషనల్స్‌పై ప్రభావం చూపనుంది. ఇన్ఫోసిస్, టీసీఎస్, విప్రో, కాగ్నిజెంట్, హెచ్‌సీఎల్ వంటి కంపెనీలు ప్రతి సంవత్సరం వేలాది ఉద్యోగులను అమెరికాకు పంపుతున్నాయి. ఇప్పుడు ఒక్కో ఉద్యోగి కోసం దాదాపు కోటి రూపాయలు ఖర్చు చేయడం ఆర్థికపరంగా భారంగా మారనుంది. ఫలితంగా, భారతీయ ఇంజినీర్లకు అమెరికా అవకాశాలు తగ్గే అవకాశముంది. బదులుగా యూరప్, కెనడా, ఆస్ట్రేలియా, మధ్యప్రాచ్య దేశాల వైపు ఈ టాలెంట్ వెళ్ళే పరిస్థితి అలుముకుంటున్నది. హెచ్1బి వీసాపై ఎక్కువగా ఆధారపడే ఐటీ, సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, ఇతర రంగాలు ఈ కొత్త నిర్ణయంతో తీవ్రంగా ప్రభావితం కానున్నాయి. అమెరికా టెక్ కంపెనీలు పెద్ద ఎత్తున విదేశీ ప్రతిభను వినియోగించుకుంటున్నాయి. ఈ పెంపు కారణంగా వారి వ్యయాలు పెరిగి, నియామకాల్లో పెద్ద మార్పులు జరగవచ్చు. నిజానికి,హెచ్1బి వీసాను ఒక వ్యక్తి స్వయంగా పొందలేరు. ఈ వీసా పొందాలంటే ఒక అమెరికన్ కంపెనీ అవసరం. ఆ కంపెనీ అమెరికా ప్రభుత్వానికి దరఖాస్తు పంపి, తమకు ఉద్యోగి అవసరమని చెబుతుంది. కంపెనీయే అన్ని పత్రాలను పూరించి, ప్రభుత్వానికి ఫీజు చెల్లిస్తుంది. ఇప్పటివరకు ఈ ఫీజు చాలా తక్కువగా రూ.6లక్షల లోపే ఉండేది. అందుకే అనేక పెద్ద ఐటీ కంపెనీలు, కన్సల్టెన్సీ సంస్థలు వేలాది దరఖాస్తులను సమర్పించేవి. దీనివల్ల అమెరికాలోని ఎంట్రీ లెవల్ ఉద్యోగాలన్నీకూడా విదేశీ ఇంజినీర్లతో నిండిపోయాయి. ట్రంప్ ఇప్పుడు ప్రతి దరఖాస్తుకు కంపెనీలు 100,000 డాలర్లు (దాదాపు రూ.88 లక్షలు) చెల్లించాలని నిర్ణయించారు. ఇది చాలా పెద్ద మొత్తం. కాబట్టి ఇప్పుడు కంపెనీలు అత్యవసరమైన నైపుణ్యాలు ఉన్నవారికి మాత్రమే హెచ్ 1బీ విసాను ఆఫర్ చేస్తాయి. చిన్న వ్యాపారాలు, స్టార్టప్‌లు ఇంత డబ్బు ఖర్చు చేయలేవు, విదేశీ ఉద్యోగులకు స్పాన్సర్ చేయడం ఇకపై విధిగా తగ్గించడంవల్ల నిపుణులైన ఉద్యోగులంతా మరింత బెటర్ ఆఫర్స్‌కోసం యూరోప్ దేశాలవైపు మొగ్గుచూపించే అవకాశం ఉంది.

## లంచావతారులను ఎసిబి వంచలేదా!

>> దీని తరువాత సదరు అ ధికారి ఏడాది వరకు ఉద్యోగంలో చేరే వీలుండదు. కొన్నిసార్లు ఈ గడువు పెరుగుతుంది. ఇదే సమయంలో ఎసిబి సదరు అధికారిపై కోర్టులో ఛార్జి షీట్ దాఖలు చేసి నేరం రుజువయ్యేలా చూడడంతో పాటు శిక్ష పడేలా చేయాలి. అయితే ఇక్కడే వుంది ట్విస్ట్. ఎసిబి కేసుల్లో అరెస్టయిన వారిని ప్రాసిక్యూట్ చేసేందుకు సర్కారు మెజారిటీ కేసుల్లో అనుమతి ఇవ్వడం లేదు. కొన్నిసార్లు లక్షలాది రూపాయలు లంచాలు తీసుకున్న అధికారుల వి షయంలోనూ ఇలాగే జరుగుతుండడం విశేషం. మెజారిటీ కేసుల్లో లంచావతారుల విషయంలో శాఖపరమైన చర్యలు తీసుకుంటే చాలని, ప్రాసి క్యూట్ అవసరం లేదని ఎసిబికి సర్కారు చెబుతోంది. ఇలా చెప్పడం వెనుక బడా నేతలు కొందరి ప్రమేయం వుందని విమర్శలు వున్నాయి.కొందరు అధికారులు ఒకటికి రెండుసార్లు అరెస్టవుతున్నా మళ్లీ ఫోకల్ పోస్టింగ్ పొందుతూ ఎసిబి చర్యలను అపహాస్యం చేస్తున్నారు. లంచావతారులను ప్రా సిక్యూట్ చేసే విషయంలో భారీ జాబితా సచివాలయంలో ఆయా శాఖల వద్ద పెండింగ్‌లో వుండడం గమనార్హం. ఇందులో పోలీసు, రెవెన్యూ, ము న్సి పల్ పరిపాలన, అటవీ, వైద్య శాఖల వద్ద పెండింగ్ జాబితా ఎక్కువగా వుందని సమాచారం. కొన్నిసార్లు పెండింగ్ కేసుల గురించి ఎసిబి అధి కారులు ఆయా శాఖల ఉన్నతాధికారులను కలుస్తుండగా ఇందులో అనేక కేసుల ను సర్కారు విత్ డ్రా చేయమన్నదని, ఇంకొన్నింటిలో శాఖాపరమై న చర్యలుచాలని అంటుందని సమాధానం వస్తోంది. గడచిన పదేళ్ల కాలంలో ఎసిబికి పట్టుబడి ఉద్యోగాలు పోగొట్టుకున్న వారు వేళ్ల మీద లెక్కించ దగ్గ సంఖ్యలోనే వున్నారంటే అతిశయోక్తి కాదు. మరికొన్నిసార్లు కొందరు ఉన్నతాధికారులు కింది స్థాయి అధికారులు తమను దిక్కరించారనే కోపం తో వారిని ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన కేసులో రెండేసిసార్లు అరెస్టు చేయించి ఆరేడు నెలల పాటు జైళ్లలో వుంచడం, వారిని కలిసేందుకు వచ్చిన వారిని కూడా ఇబ్బందులకు గురిచేసిన సందర్భాలూ వున్నాయి. ఇలాంటి కేసుల్లో అనేక మంది అమాయకులు కూడా నెలల తరబడి జైళ్లలో మగ్గిన ఘటనలు వున్నాయి. సైబరాబాద్‌లో గతంలో ఎసిపిగా పనిచేసిన ఓ పోలీసు అధికారి ఇందుకు ఉదాహరణ. అకారణంగా ఆయనను ఆదా యానికి మించి ఆస్తులు కలిగిన కేసులో అరెస్టు చేసినట్లు అభియోగాలు రాగా ఈ ఘటన జరిగిన 13 ఏళ్లు గడుస్తున్నా సదరు అధికారి ఇప్పటికీ కోర్టుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నాడు. ఆయనతో పాటు మరో ఆరుగురు పోలీసులు, వారి కుటుంబీకులు కూడా ఈ కేసులో అరెస్టయ్యారు.

ఇక ప్రాసిక్యూషన్ కోసం ఎసిబి సర్కారుకు పంపిన లాంచావతారుల చిట్టా పెద్దదిగా వున్నా ఇందులో ముఖ్యమైన వాటిలో ఒకటి రంగారెడ్డి జి ల్లాలో గతంలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేసి ఐదు లక్షల రూపాయల లం చం కేసులో 2010లో అరెస్టయిన అధికారిని ప్రాసిక్యూషన్‌కు అనుమతిరా లేదు. ఈ అధికారిపై కేసు విత్ డ్రా చేస్తూ సర్కారు నిర్ణయించింది. ఇదే కేసులో ఆయన సహాయకుడిపై చర్యలు తీసుకోమని ఆదేశించినా ఇప్పటి వ రకు ఏమీ కాలేదు. దీని తరువాత సికింద్రాబాద్‌లో పౌర సరఫరాల విభాగంలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేసిన ఓ అధికారి రెండు లక్షల రూపాయల లంచంతో దొరికిపోగా ఆయనను ప్రాసిక్యూట్ చేయడానికి ఎసిబి రాసిన లేఖ సర్కారు వద్ద 14 ఏళ్లుగా పెండింగ్‌లో వుంది. ఇలాంటివి గ్రేటర్ పరి ధిలోనే వందల సంఖ్యలో వున్నాయి. ఇందులో అనేక మంది పదవీ విరమణ చేసి అన్ని బెనిఫిట్స్ కూడా పొందారు.




యుపిలోని మీరట్‌లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని శనివారం ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

## దేవుడి భూములు కబ్జాచేస్తే ఖబడ్దార్

>> ప్లీడర్(జిపి) బిఎం నాయక్, ఏజిపి శైలజ, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు. దేవుడి భూములు కాపాడటంలో లీగల్ టీం పాత్ర చాలా కీలకమైందని మంత్రి సురేఖ పేర్కొన్నారు. తాను దేవాదాయ శాఖ మంత్రి అయి రెండు సంవత్సరాలు అయిందని ఇప్పటికీ కేసులు ఏం గెలిచామో తెలియడం లేదని మంత్రి స్పష్టం చేశారు. అయితే, ఇప్పటివరకు ఎన్ని కేసులు గెలిచామో వివరించాలని చెప్పారు. అసలు కేసుల విషయంలో అప్‌డేట్ కోసం అడిగితే డిపార్టుమెంటులో ఎవరు చెప్ప లేకపోవడం న్యాయ విభాగం అప్‌డేట్ చేయకపోవడం ఏంటని మంత్రి ప్రశ్నించారు. మన దేవుడి భూములు మనం దక్కించుకోవాలన్నారు. దూరదృష్టితో కేసులు పరిష్కరించుకోవాలన్నారు. ఏ కేసుల మీద న్యాయ పోరాటం చేశారో వాటిని పరిష్కరించడంలో ఎటువంటి ఇబ్బందులు ఎదురయ్యాయో మంత్రి సురేఖ న్యాయ వాదులను అడిగారు. అయితే, మంత్రి ప్రశ్నకు సమాధానంగా 2002 నుంచి 2025 వరకు 1,500 కేసులు పెండింగులో ఉన్నాయని తెలిపారు. ఈ కాల వ్యవధిలో 543 కోర్టు కేసులను డిస్పోజ్ చేసినట్టు ప్రభుత్వ ప్లీడర్లు వివరించారు. కేసుల్లో పురోగతికి సంబంధించిన అంశాలు, జడ్జిమెంట్ కాపీ ఎండోమెంటు శాఖ సెక్రటరీకి అందజేయాలని సూచించారు. ఎండోమెంటు డిపార్టుమెంటుకు సంబంధించిన కేసుల్లో రీట్ పడిన దగ్గరి నుంచి కేసు పూర్తయ్యేవరకు ఎలా ముందుకు వెళుతున్నది వివరించాలని చెప్పారు. ఎండోమెంటు భూములు కాపాడటంలో వారిదే కీలక పాత్ర గుర్తు చేశారు. ఎండోమెంటు ట్రిబ్యూనల్ అపాయింట్ చేయాల్సి న అవసరం ఉందన్నారు. ట్రస్టీలకు సంబంధించిన కేసుల్లో గట్టిగా వాదించాలని మంత్రి నొక్కి చెప్పారు. ఆర్కియాలజీ డిపార్టుమెంటు దగ్గర వివరాలు సేకరించాలని, ఆ సమాచారం సాక్ష్యంగా తీసుకుని వెళ్లాలని, అందుకోసం ఒక నిపుణుల కమిటిని నియమించాలని చెప్పారు. దైవ చింతన కల్గిన వ్యక్తులు ఈ పనిలో నిమగ్నమైతే మంచిదని గుర్తు చేశారు. ఇంట్రిమ్ ఆర్డర్స్‌లో పురోగతి విషయంలోనూ మంత్రి, అధికారులు న్యాయ నిపుణులను అడిగారు. ఇట్రిమ్ ఆర్డర్స్ విషయంలో తమ డిపార్టుమెంటును అలర్ట్ చేయకపోతే ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఎండోమెంటు ఉన్నతాధికారులు లేవనెత్తడంతో వాటిని ఎప్పటికప్పుడు ఎదుర్కొవడానికి ఒక మెకానిజం ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ విషయంలో న్యాయ విభాగ టీం, వారి కింద వ్యవస్థ సరైన టైంలో ఎండోమెంటు ఉన్నతాధికారులను అలర్ట్ చేస్తే ఎటువంటి ఇబ్బందులు ఉండవని చెప్పారు. భూములకు సంబంధించిన అంశాలు, టెంపుల్ ఎంప్లాయీస్ సర్వీసు వ్యవహారాలు కూడా పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అప్పుడే మన డిపార్టుమెంటుకు అనుకూలంగా వస్తాయని తెలిపారు. అయితే, వచ్చిన ఆర్డర్స్‌ను అమలు పరిచేందుకు కూడా ఒక వ్యవస్థ ఉండాలని మంత్రి అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని మంత్రికి చెప్పగా అందుకు కావాల్సి న పనులు చేయాలన్నారు. సివిల్ సప్లయ్ డిపార్టుమెంటులో ఉన్న మాదిరిగా ఉండాలన్నారు. కౌంటర్లు వేయడంలో కూడా ఏమాత్రం నిర్లక్ష్యం వహించొద్దన్నారు. కింది స్థాయి ఈఓలు కూడా అందుకు సహకరించాలన్నారు. ఎవరైనా సహకరించకపోతే ఎండోమెంటు సెక్రటరీ దృష్టికి తీసుకురావాలన్నారు. దేవుడి భూముల జోలికిస్తే పిడి యాక్టులు పెట్టేందుకు వెనకాడొద్దని అధికారులకు చెప్పారు. ఎండోమెంటు చట్టం మీద అధికారులకు ట్రైనింగు క్లాసులు నిర్వహించాలని మంత్రి చెప్పారు. జిల్లాకో లీగల్ ఆఫీసుర్‌ను నియమించాలని అన్నారు. హైకోర్టుకు కూడా లైజన్ ఆఫీసర్‌ను నియమించాలని ఈఓల నుంచి ఒకరు ఉండాలని న్యాయ విభాగ టీం సూచించగా మంత్రి అనుమతించారు. వెంటనే అందుకు సంబంధించిన ప్రతిపాదనలను తనకి పంపించాలని పేర్కొన్నారు.

## విదేశాలపై ఆధార పడటం వల్లే ఈ దుస్థితి: ప్రధాని మోడీ

**భావ్‌నగర్, సెప్టెంబరు 20:** అమెరికాకు వెళ్లే హెచ్‌వన్‌బీ వీసా దరఖాస్తురుసుం లక్షడాలర్లకు పెంచుతూ ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై ప్రధానిమోడీ వెంటనే స్పందించారు. భారత్ విశ్వబంధు స్ఫూర్తితో ముందుకు వెళుతోందని, ప్రపంచంలో మనకు ప్రధాన శత్రువులు అంటూ ఎవరూ లేరని, మన అతిపెద్ద శత్రువు ఇతర దేశాలపై ఆధారపడటమేనని, అందుకే మనం తక్షణమే ఓడించాలని, విదేశాలపై ఎక్కువ ఆధారపడితే భారత అభివృద్ధి విఫలం అవుతుందని ప్రధాని అన్నారు. భావ్‌నగర్‌లో 34వేల కోట్లకుపైగా ప్రాజెక్టులు ప్రారంభించిన ప్రధానిమోడీ ఈసందర్భంగాజరిగిన సభలో మాట్లాడుతూ ప్రపంచ శాంతి స్థిరత్వం, శ్రేయస్సుకోసం అత్యధిక జనాభాకలిగిన దేశం భారత్ అని అందువల్లనే మనం ఆత్మనిర్భర్‌భారత్‌గా శరవేగంగా మారాలని పేర్కొన్నారు. ఇతరులపై ఆధారపడినంతకాలం మన ఆత్మగౌరవం దెబ్బతింటుందని భారత్ దేశ అభివృద్ధిని భావితరాలకు పణంగా పెట్టలేమని అన్నారు. దేశం నష్టాలను భరించే రంగాల్లో షిప్పింగ్ ఒకటని, 50 ఏళ్లక్రితం మనదేశంలో తయారుచేసిననౌకలనే వినియోగించేవారమని, కాంగ్రెస్ హయాంలో పూర్తిగా నాశనం అయిందన్నారు. స్వదేశంలో నౌకల తయారీపై దృష్టిపెట్టకుండా విదేశీ నౌకలకు అద్దెలు చెల్లించేందుకే ప్రాధాన్యం ఇచ్చారని విమర్శించారు. అందువల్లనే మన వాణిజ్యంలో ఇప్పటికీ 90% విదేశీ నౌకలపైనే ఆధారపడుతున్నామని గుర్తుచేసారు. కేవలం లీజుమొత్తాలకే మనం ఏటా ఆరులక్షలకోట్లు చెల్లిస్తున్నామని, దేశ రక్షణరంగ బడ్జెట్‌కంటే ఎక్కువన్నారు.

## మాకు గొప్ప ఉద్యోగులు కావాలి అందుకే ఈ నిర్ణయం: ట్రంప్

**వాషింగ్టన్, సెప్టెంబరు 20:** అమెరికాలో ఉద్యోగం చేద్దామని కలలు కంటున్న భారతీయుల నెత్తిన డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం మరో పిడుగు వేసింది. హెచ్-1బి వీసాల దరఖాస్తు రుసుమును లక్ష డాలర్లకు పెంచిన సంగతి తెలిసిందే. దీనిపై అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. అత్యంత నైపుణ్యం కలిగిన వ్యక్తులే తమ దేశానికి రావాలని కోరుకుంటున్నట్లు వ్యాఖ్యానించారు. దేశ భద్రతను దృష్టిలో పెట్టుకొనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ చర్యను టెక్ పరిశ్రమ వ్యతిరేకించబోదని చెప్పారు.

హెచ్-1బి వీసా దరఖాస్తులపై వార్షిక రుసుమును లక్ష డాలర్లుగా నిర్ణయిస్తూ కార్యనిర్వాహక ఉత్తర్వుపై ట్రంప్ సంతకం చేశారు. కొత్త హెచ్-1బి వీసా విధానం భారత్‌తోపాటు, చైనాపైనా తీవ్ర ప్రభావం చూపనుంది. ఈ నిర్ణయం సెప్టెంబరు 21 నుంచి అమల్లోకి వస్తుంది.

1990లో అత్యంత నైపుణ్యం కలిగిన విదేశీ నిపుణుల కోసం హెచ్-1బి వీసాను తీసుకొచ్చారు. యుఎస్‌లోని టెక్నాలజీ కంపెనీలు విదేశీ నిపుణుల కోసం ఇవి జారీ చేస్తాయి. హెచ్-1బి వీసాదారుల్లో ఇండియా 71 శాతం వాటా కలిగిఉండగా, చైనా 11.7 శాతం వాటా కలిగి ఉంది. వీటిని మూడు నుంచి ఆరేళ్ల మధ్య కాలానికి మంజూరు చేస్తారు. తాజాగా విధించిన ఫీజుతో తీవ్ర స్థాయిలో ఆర్థికభారం పడనుంది. తక్షణమే దీని ప్రభావం 60 వేల మంది భారతీయులపై పడనుంది. దాంతో వార్షిక భారం ఆరు బిలియన్ల డాలర్లు (రూ. 53 వేల కోట్లు)గా ఉండనుంది. అది పూర్తిస్థాయిలో చూసుకుంటే ఆ మొత్తం రూ. 1.8 లక్షల కోట్లకు చేరనుంది.

ఇక వ్యక్తిగతంగా చూసుకుంటే.. ఆ భారం మోయలేనంతగా ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అమెరికాలో ఒక మధ్యస్థాయి ఇంజినీర్ సంవత్సరానికి 1,20,000 డాలర్లు సంపాదిస్తే.. అందులో లక్ష డాలర్లు వీసా ఫీజు అంటే.. 80 శాతం అక్కడే పోతుంది. దీనివల్ల అత్యధిక స్థాయిలో వేతనం పొందేవారు మినహా మిగిలిన వారు యుఎస్ వలస వెళ్లడం పెనుభారమే అవుతుంది.

## 1.17 లక్షల టన్నుల యూరియా

>> కార్యదర్శిని కలుసుకుని రామగుండం యూనిట్‌ను త్వరితగతిన పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశామన్నారు. ఎరువుల కొరత లేకుండా, సాగుకు ఎలాంటి అంతరాయం లేకుండా ఉండేందుకు అవసరమైన చర్యను తీసుకుంటున్నామని వివరించారు.

## ‘మేడారా’నికి కొత్త రూపు

>> అనివార్య కారణాలవల్ల సీఎం పర్యటన వాయిదా వేశారు. జాతర సమయం సమీపిస్తుండడంతో దాదాపు రూ.150 కోట్లతో చేపట్టనున్న పనులను 100 రోజులలో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు త్వరితగతిన పనులు చేపట్టిన పక్షంలో పనులు నాణ్యతతో పూర్తయ్యే అవకాశం ఉందని భావించి ముఖ్యమంత్రి పర్యటన ఖరారు చేసినట్లు సమాచారం. ఈ మేరకు ఆయన 23న సిఎంతో పాటు మంత్రులు, ఎంపీలు,ఎమ్మెల్యేలు,అధికారులు మేడారం వెళ్లి క్షేత్ర స్థాయిలోనే సమీక్ష చేసి అక్కడికక్కడే నిర్ణయాలు తీసుకోనున్నారు.

# ఉల్లి రైతులకు శుభవార్త

## హెక్టారుకు రూ. 50 వేలు ఇవ్వాలని ఎపి సిఎం చంద్రబాబు నిర్ణయం



**విజయవాడ సెప్టెంబరు 20, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఉల్లి ధరలు పతనం కావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని గ్రహించిన సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శుక్రవారం సీఎం క్యాంప్ ఆఫీస్ వద్ద మీడియా తో మాట్లాడుతూ ఉల్లి పంట పండించిన రైతులకు హెక్టారుకు రూ.50,000 ఆర్థిక సాయం అందజేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ నిర్ణయంతో ప్రభుత్వంపై సుమారు రూ.100 కోట్లు అదనపు భారం పడనుందని అన్నారు. కర్నూలు ఖరీఫ్ సీజన్ లో 45,278 ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేసారని, 24, 218 మంది రైతులు లబ్ధిపొందుతున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ చర్యకు రాష్ట్రవ్యాప్తంగా రైతులు స్వాగతం పలుకుతున్నారని పేర్కొన్నారు. పంటకు ధర పలికినప్పుడే ఉల్లిని విక్రయించాలని రైతులకు మంత్రి సూచించారు. మార్కెట్లో సమయానుసారం ధరలు లభించే వరకు రైతులు సహనంతో ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ఆర్థిక సాయం రైతులకి తక్షణ ఉపశమనం లభిస్తుందన్నారు. 2016లో ఉల్లి ధరలు పడిపోతే 7723 మంది రైతులనుండి 2.77 లక్షల క్వింటాళ్ళు కొనుగోలు చేసి 7 కోట్ల రూపాయలు రైతులకు చెల్లించామని, 2018లో మరొక సారి 9740 మంది రైతుల నుండి 3.48 లక్షల క్వింటాళ్ళ ఉల్లి కొనుగోలు చేసి 6.45 కోట్లు చెల్లించామని తెలిపారు.

# కంగారూల చేతిలో చిత్తయిన ఉమన్ ఇండియా

### 43 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా మహిళల జట్టు విక్టరీ

### 2-1 తేడాతో సిరీస్ కైవసం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 20:** భారత్‌లోజరగనున్న మహిళా వరల్డ్ కప్ ముందు వుమన్ ఇండియా జట్టు వన్డే సిరీస్ కోల్పోయింది. భారీ స్కోర్ల మ్యాచ్‌లో ఓపెనర్ స్మృతి మంధాన (125) విధ్వంసక సెంచరీతో చెలరేగినా ఆస్ట్రేలియా బౌలర్ల విజృంభణతో టీమిండియా ఓడిపోయింది. 43 పరుగుల తేడాతో గెలుపొందిన ఆసీస్ 2-1తో సిరీస్ కైవసం చేసుకుంది. వరల్డ్ కప్ సన్నద్ధతలో ఉన్న భారత జట్టుకు ఆస్ట్రేలియా షాకిచ్చింది. సిరీస్ విజేతను నిర్ణయించే మూడో వన్డేలో భారీ స్కోర్ చేసిన ఆసీస్ బౌలింగ్‌లోనూ రాణించి టీమిండియాకు చెక్ పెట్టింది. కొండంత ఛేదనలో ఓపెనర్ స్మృతి మంధాన(125), దీప్తి శర్మ(72)లు చెలరేగి ఆడినా వరుసగా వికెట్లు కోల్పోవడంతో ఓటమి తప్పలేదు. ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన కంగారూ జట్టు సిరీస్‌ను 21తో తన్నుకుపోయింది. ఆస్ట్రేలియా నిర్దేశించిన భారీ ఛేదనను భారత్ దూకుడుగా ప్రారంభించింది. ఓపెనర్ ప్రతీకా రావల్ (10) తొలి ఓవర్లో రెండు ఫోర్లతో చెలరేగింది. ఆ తర్వాత స్మృతి మంధాన(125) తన మార్క్ షాట్లతో అలరిస్తూ స్కోర్ బోర్డును పరుగులు పెట్టించింది. మేగన్ షట్ వేసిన మూడో ఓవర్లలో హ్యాట్రిక్ ఫోర్లు బాదిన మంధాన కంగారూలకు కంగారెత్తించింది. తర్వాత వచ్చిన కిమ్ గార్త్ బౌలింగ్‌లో ప్రతీకా వెనుదిరిగింది. అటుపై వచ్చిన హర్లీన్ డియోల్(11)తో మంధాన కీలక భాగస్వామ్యం నెలకొల్పింది. టీమిండియాకు రెండో షాకిస్తూ డియోల్‌ను వెనక్కి పంపింది మేగన్ స్వల్ప వ్యవధిలో రెండు వికెట్లు పడిన వేళ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (52), మంధాన కీలక భాగస్వామ్యం నిర్మించారు. 10 ఓవర్లకు టీమిండియా 96/2తో పోటీలో ఉంది. వరుస ఓవర్లలో కౌర్, మంధాన, రీచా ఘోష్ ఔట్ కావడంతో స్కోర్ వేగం తగ్గింది. కీలక వికెట్లు పడినా దీప్తి శర్మ(72), రాధా యాదవ్(18)లు ఇన్నింగ్స్ నిర్మించారు. రాధ ఔటయ్యాక స్నేహ్ రానా(35)తో కలిసి ఎనిమిదో వికెట్‌కు 65 పరుగులు జోడించింది దీప్తి. మెక్‌గ్రాత్ ఓవర్లో పెద్ద షాట్ ఆడిన దీప్తి వెనుదిరిగింది. ఆతర్వాత టెయిలెండర్లతో రానా పోరాడినా ఫలితం లేకపోయింది. రేణుకా సింగ్ పదో వికెట్‌గా వెనుదిరగడంతో కంగారూ టీమ్ 43 పరుగుల తేడాతో గెలుపొందింది.

# కొత్త జిల్లాల్లో కోర్టు భవనాలు, సిబ్బంది నియామకంపై చర్చ

### హైకోర్టు సిజె అపరేష్‌కుమార్‌సింగ్‌తో సిఎం రేవంత్‌రెడ్డి భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, సెప్టెంబరు 20:** రాష్ట్రంలో న్యాయవ్యవస్థకు సంబంధించి మౌలిక వసతుల కల్పన, సిబ్బంది నియామకం అంశాలపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డితో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్‌సింగ్ చర్చ చేశారు. శనివారం ఎంసీహెచ్ ఆర్‌డిలో తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్‌తో రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి శేషాద్రి, లా సెక్రటరీ పాపిరెడ్డి, జస్టిస్ పి. సామ్ కోశి, జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. కొత్త జిల్లాల్లో అవసరమైన చోట కోర్టు భవనాలు, మౌలిక వసతులను కల్పించడంతో పాటు సిబ్బంది నియామకం చేపట్టాలని ప్రభుత్వానికి హైకోర్టు సీజే సూచించారు. ఇందుకు సంబంధించి పలు ప్రతిపాదనలను ముఖ్యమంత్రి దృష్టికి హైకోర్టు సీజే తీసుకొచ్చారు. ప్రాధాన్యత వారీగా రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు కొత్త జిల్లాలలో కోర్టులకు మౌలిక వసతుల కల్పన, సిబ్బంది నియామకం చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి తెలిపారు.

# కారు డ్రైవర్ రాష్‌డ్రైవింగ్

### ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

**హైదరాబాద్ (గచ్చిబౌలి), సెప్టెంబరు 20, ప్రభాతవార్త :** ఓ కారుడ్రైవర్ రాష్ డ్రైవింగ్ ఇద్దరి యువకుల ప్రాణాలను బలితీసుకుంది. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి చోటుచేసుకున్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. రాయదుర్గం పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని టోలీచౌకీలో నివాసించే మహ్మద్ అబ్దుల్ నజీర్‌ఫహద్(22) పాన్‌షాపులో పని చేస్తుంటాడు. తన స్నేహితుడు మహ్మద్ అబ్దుల్ ఆహదుద్దీన్‌ఖాన్(25)తో కలిసి శుక్రవారం అర్ధరాత్రి దాటాక స్కూటీపై గచ్చిబౌలివైపు బయలుదేరారు. అర్ధరాత్రి 1.15 గంటలకు రాయదుర్గంలోని హనుమాన్ టెంపుల్ సమీపంలో వెనక నుంచి అతివేగంగా, నిర్లక్ష్యంగా వచ్చిన టయోటా కరోలా అల్టీస్ కారు వీరి వాహనాన్ని ఢీ కొట్టగా ఇద్దరు గాల్లో ఎగిరి రోడ్డుపై పడ్డారు. తలకు తీవ్ర గాయాలు కావడంతో నజీర్ ఫహాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలపాలైన అబ్దుల్ అహదుద్దీన్ ఖాన్‌ను సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న రాయ దుర్గం పోలీసులు ఇద్దరు యువకుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కార్తీక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# 17 మంది ఇంజినీర్లపై సిఎంకు ఎసిబి నివేదిక

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, సెప్టెంబరు 20:** టిజిఎస్‌పిడిసిఎల్ ఇంజనీర్ల అక్రమాలపై ఏసీబీ ఫోకస్ పెట్టింది. ఇటీవల ఏడీఈ అంబేడ్కర్ వద్ద రూ.వందల కోట్లు పట్టుబడిన విషయం తెలిసిందే. తాజాగా మరో 17 మంది ఇంజనీర్ల అవినీతిపై సిఎం రేవంత్‌ను ఏసీబి నివేదిక ఇచ్చింది. హైదరాబాద్‌లోని ఇబ్రహీంబాగ్, గచ్చిబౌలి, మేడ్చల్, రాజేంద్రనగర్, కందుకూరులో ఏడీఈ,సీఈ స్థాయుల్లో పనిచేసిన వీరు ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారని పేర్కొంది. బదిలీ విధానంలో ఇంజనీర్లకు ఆప్షన్లు ఇచ్చి అడ్డగోలుగా పోస్టింగ్స్ ఇచ్చిన తీరును ప్రస్తావించింది.

# జలమండలి కార్యాలయంలో అగ్నిప్రమాదం

**హైదరాబాద్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:** ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో అగ్నిప్రమాదం సంభవించింది. కార్యాలయం వెనుకభాగంలో చెత్తాచెదారం ఉండడంతో అక్కడ ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకు నిప్పును అంటించినట్లు తెలిసింది. దీంతో పరిసర ప్రాంతాలన్ని పొగమయం అయ్యాయి. అప్రమత్తమైన అధికారులు ఫైర్ ఇంజన్లు పిలిపించి మంటలను ఆర్పారు. ఈ సంఘటనలో ఎలాంటి ఆస్తినష్టం, ప్రాణనష్టం జరగలేదు.


**సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ T.G లిమిటెడ్**
ఆపరేషన్ : సూర్యాపేట సర్కిల్
బహిరంగ టెండర్ ప్రకటన నం.02/2025-26

సూర్యాపేట సర్కిల్‌లో వివిధ సివిల్ పనుల కొరకు అర్హులైన విక్రేతల నుండి టెండర్లు కోరబడుతున్నవి. స్పెసిఫికేషన్ నం: 01/25-26 మరియు 02/25-26 ఆఫ్ టెండర్ నోటీస్ 0-02/2025-26 ఆఫ్ SE/OP సూర్యాపేట. షెడ్యూల్ తేదీలు ఓపెన్ టెండర్‌కు: 1) బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభం: 21.09.2025 మ.15.00 గం. వద్ద. 2) DDs మరియు BGsతోసహా బిడ్ హార్డ్ కాపీల దాఖలుకు చివరి తేదీ, సమయం: 09.10.2025 మ.15.00 గం. వరకు. 3) బిడ్ తెరచు తేదీ మరియు సమయం: 09.10.2025 సా.16.00 గం. వద్ద. వివరాలు www.tgsouthernpower.com వద్ద అందుబాటులో ఉన్నాయి. ఫోన్ నం: 8712472748. సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్ సర్కిల్, సూర్యాపేట
DIPR.No.8356-PP/CL/Advt/1/2025-26, తేది: 20.09.2025



**తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఒక క్రొత్త రాజకీయ పార్టీగా రిజిస్ట్రేషన్ కావడానికి జారీచేయబడిన నోటీసు**
(తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము ఆదేశములతో ప్రచురించబడినది)
తేది: 20.09.2025

రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్ మరియు గుర్తుల కేటాయింపు ఉత్తర్వు, 2018 యొక్క నిబంధనలకు లోబడి గోండ్వానా దండకారణ్య పార్టీ అధ్యక్షులు శ్రీమతి వట్టం హిమబిందు గారు తమ పార్టీని 'రిజర్వు గుర్తు లేని రాజకీయ పార్టీగా' తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద నమోదు చేసుకొనుటకై అభిలషిస్తున్నట్లు సాధారణ ప్రజానీకానికి తెలియజేసేందుకు ఈ నోటీసు ఇవ్వడమైనది. ఈ పార్టీలో (1) శ్రీమతి వట్టం హిమబిందు; అధ్యక్షులు (2) శ్రీ సోడే రవికుమార్; జనరల్ సెక్రటరీ (3) శ్రీ శెట్టిపల్లి శ్రీను; కోశాధికారి గారు ప్రధాన కార్యవర్గ సభ్యులు; మరియు పార్టీ యొక్క ప్రధాన కార్యాలయము ఇం.నెం. 12-20, నవ్యగిరి కాలనీ, సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో, నారపల్లి, ఘట్కేసర్ మండలం, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, తెలంగాణ రాష్ట్రం-500088; సదరు పార్టీ రిజిస్ట్రేషనుపై ఎవరికైనా ఏదేమైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే, అట్టి అభ్యంతరాలను కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము, మొదటి అంతస్తు, DTCP భవనము, A.C. గార్డ్స్, హైదరాబాద్-500 004 గారికి ఈ ప్రకటన ప్రచురితమైన పదిహేను రోజుల్లోగా పంపవలెను. నిర్ణీత గడువులోగా అభ్యంతరాలు రానియెడల, తెలంగాణ రాష్ట్రములో పార్టీల పరంగా జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసేందుకు గోండ్వానా దండకారణ్య పార్టీను ఒక రాజకీయ పార్టీగా నమోదు చేయు ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం చేపడుతుంది.

సం/-. శ్రీమతి వట్టం హిమబిందు, అధ్యక్షులు
గోండ్వానా దండకారణ్య పార్టీ.


# కృష్ణాజలాల్లో ఆంధ్రప్రదేశ్ రైతుల నీటి హక్కులను కాపాడాలి

### కెఆర్‌ఎంబి ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి త్వరగా మార్చాలి

### సంస్థ చైర్మన్ బిపి పాండేకు ఎపి సాగునీటి వినియోగదారుల ప్రతినిధుల వినతి

**హైదరాబాద్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రానికి కృష్ణా నది జలాలు 904 టి.ఎం.సి.లు కేటాయించాలని కోరటం చాలా దారుణమని నీటి కేటాయింపుల్లో ఎలాంటి మార్పులు చేపట్టకుండా యథాతదంగా అమలు చేయాలని కృష్ణానదీ యాజమాన్య బోర్డు చైర్మన్ బి.పి. పాండేను ఆంధ్రప్రదేశ్ సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రతినిధులు కలిసి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ లోని పులిచింతల ప్రాజెక్టును శనివారం ఉదయం కృష్ణానదీ యాజమాన్య బోర్డు చైర్మన్ బి.పి. పాండే సందర్శించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ నుంచి సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు, నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కోట వీరబాబు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు చిట్టూరి సుభాష్, దేవినేని సత్యనారాయణ తదితరులు బి.పి.పాండే ను కలిసి ఆంధ్రప్రదేశ్ రైతులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పూర్తి వివరాలతో వినతి పత్రం సమర్పించారు. ఆంధ్రప్రదేశ్ లోని అన్ని రకాల అనుమతులు ఉన్న శ్రీశైలం దిగువన ఎస్.ఆర్.బి.సి. 2 లక్షల ఎకరాలు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు కింద 15 లక్షల ఎకరాలు, ప్రకాశం బ్యారేజ్ కింద 13 లక్షల ఎకరాలు కలిపి మొత్తం 30 లక్షల ఎకరాలకు సాగునీరు రాక బీడుబారిపోతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణాజలాల్లో ఆంధ్రప్రదేశ్ కు 66 శాతం, తెలంగాణకు 34 శాతం వాటా యదాతథంగా కొనసాగించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014 ప్రకారం ప్రస్తుత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాల ఉమ్మడి నిర్ణయం మేరకు కృష్ణానదీ యాజమాన్య బోర్డు ప్రధాన కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్ లోని అమరావతిలో ఏర్పాటు చేయటానికి త్వరగా చర్యలు తీసుకోవాలని కోరారు.నాగార్జునసాగర్ ఎడమ కాలువ 3వ జోన్ కు సాగర్ డ్యామ్ వరద జలాలను త్రాగునీటి చెరువులు నింపుకోవటానికి ప్రస్తుతం నీటి సరఫరా సంతృప్తికరంగా జరుగుతోందని, ఈ నీటి విడుదల గడువును వచ్చే నెల 20 వరకు పెంచటానికి చర్యలు తీసుకోవాలని కె.ఆర్.ఎం.బి. చైర్మన్ కోరారు. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు కేటాయించిన 811 టి.ఎం.సి.ల కేటాయించారు.ప్రస్తుతం కృష్ణాజలాల్లో విభజిత ఆంధ్రప్రదేశ్ కు 512 టి.ఎం.సి.లు, తెలంగాణకు 299 టి.ఎం.సి.లు ఒప్పందం చేసుకుని బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తుది తీర్పు వచ్చేవరకు ఆంధ్రప్రదేశ్ కు 66 శాతం, తెలంగాణకు 34 శాతం ప్రస్తుతం వాడుకుంటున్నామని తెలిపారు. బ్రిజేష్ ట్రిబ్యునల్ వాదనల సందర్భంగా పైన ఉన్న తెలంగాణ ప్రభుత్వం క్యాచ్మెంట్ ప్రకారం కేటాయింపులు కోరడం తగదని నీటి కేటాయింపులు ప్రస్తుతం ఉన్న ప్రాజెక్టుల వారిగానే కేటాయింపులు జరుపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.ఆర్.ఎం.బి. మెంబర్ కమలకుమార్ జనగిద్ధి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి. శ్రీనివాసరావు, పులిచింతల ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె.గుణకర రావు తదితరులు పాల్గొన్నారు. మొట్టమొదటిసారి పులిచింతల డ్యామ్ కు విచ్చేసిన నూతన కె.ఆర్.ఎం.బి. చైర్మన్ బి.పి.పాండేను సాగునీటి సంఘాల ప్రతినిధులు దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు.




రాష్ట్రంలో బిసి రిజర్వేషన్లపై స్పష్టత వచ్చిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే సంకేతాలు ఉండటంతో అధికార యంత్రాంగం ముందస్తుగా అన్ని ఏర్పాట్లు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఓటర్ల జాబితాను గ్రామాలు, వార్డుల వారీగా సిద్ధం చేశారు. పోలింగ్ సిబ్బంది డాటాను సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఇటీవల కలెక్టర్లను ఆదేశించింది. జిల్లా, రెవిన్యూ డివిజన్, మండలం, పంచాయతీ, వార్డుల సంఖ్య ఆధారంగా వివరాలు ఉండాలని తెలపడంతో అందుకు సంబంధించిన వివరాలను కూడా అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం 566 ఎంపిపిలు, జడ్పీటీసీలు, 5773 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయని, వాటికి ఎన్నికలు జరుగుతాయని




ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో కంటే ఈసారి ఎంపీటీసీ స్థానాలు తగ్గాయి. రాష్ట్రంలో 71 గ్రామ అలాగే రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీలు, వార్డుల సంఖ్యను ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. మొత్తం గ్రామ పంచాయతీల సంఖ్య 12,778, వార్డుల సంఖ్య 1,12,694గా లెక్క తేల్చింది. గత ఎన్నికల నాటికి గ్రామ పంచాయతీలు 12,848 ఉన్నాయి. కొన్ని గ్రామ పంచాయతీలు, మండలాలు పుర పాలక, నగర పాలక సంస్థల్లో విలీనం కావడం వల్ల పంచాయతీల సంఖ్య తగ్గిందని అధికారులు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక ఇప్పటివరకు ఒక్కసారి మాత్రమే పంచాయతీ ఎన్నికలు 2019లో జరిగిన సంగతి తెలిసిందే.

# మురిగిపోతున్న కేంద్ర నిధులు..ఆగిపోతున్న గ్రామాల అభివృద్ధి

**అమరవాది సంపత్ కుమార్**

స్థానిక ఎన్నికల్లో ఇప్పట్లో జరిగేలా కనిపించడం లేదు. స్థానిక ఎన్నికలకు సంబంధించి బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరుతూ ఇందుకు సంబంధించి బిల్లును గవర్నర్ వద్దకు పంపినా ఇంత వరకు గవర్నర్ ఆమోదం తెలుపకపోవడంతో స్థానిక సంస్థల ఎన్నికలు మరింత జాప్యం జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మందుగా జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలు నిర్వహించాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. పంచాయతీలు జీహెచ్ఎంసీ, నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీల్లో కలవడంతో ఎంపీటీసీ స్థానాలు తగ్గాయి. గత లెక్కల ప్రకారం ప్రస్తుతం 5,817 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, 570ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలున్నాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల డైరెక్టర్ సృజన ఎంపీటీసీ డీలిమిటేషన్ షెడ్యూల్‌కు ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల సన్నద్ధతలో భాగంగా అవసరమయ్యే నోడల్ అధికారులను ఎంపికచేశారు. ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారనేది ఇంకా స్పష్టతరాకున్నా ఉన్నతాధికారుల ఆదేశం మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. రెండు విడతల ఎన్నికల నిర్వహణ కోసం సరిపడా ఉద్యోగులు, ఇతర అన్నిరకాల పనులను ఇదివరకే పూర్తిచేశారు. తాజాగా ఏ అధికారికి ఎలాంటి నిర్వహణ అప్పగించాలనేది నిర్ణయానికి వచ్చారు. ఎన్నికల సమయంలో వీరికి వివిధ రకాల బాధ్యతలు అప్పగించనున్నారు. ఒక్కొక్కరు ఒక్కోరకమైన పనులను పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఈ మేరకు జాబితాకు కలెక్టర్ ఆమోదముద్ర వేశారు. జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)మోడల్ కోడ్అమలు. ఎన్నికల ఖర్చును పర్యవేక్షిస్తారు. జడ్పీ సీఈఓ జిల్లా అదనపు ఎన్నికల అధికారిగా వ్యవహరించనున్నారు. సామగ్రి పంపిణీ వ్యవహారం చూస్తారు. డీపీవో సరిపడా ఎన్నికల సిబ్బంది (మ్యాన్పవర్) కేటాయించేలా వ్యవహరిస్తారు. డీఎల్పీఓ బ్యాలెట్ బాక్సుల నిర్వహణ పరిశీలిస్తారు. జిల్లా రవాణా అధికారి ఎన్నికల సామగ్రి తరలించే వాహనాలను సమకూర్చుతారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇప్పిస్తారు. సహకార అధికారి ఎన్నికల ఖర్చుల వివరాలను పరిశీలిస్తారు. యువజన, క్రీడల అధికారి పరిశీలకుల బాధ్యతలు చూస్తారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బ్యాలెట్ పత్రాలు, పోస్టల్‌ఓట్ల వ్యవహారం పర్యవేక్షిస్తారు. పౌరసంబంధాల అధికారి మీడియా వ్యవహారాలు చూస్తారు. సంక్షేమాధికారి హెల్ప్ లైన్లో వచ్చే ఫిర్యాదులు, ఓటర్ల సమాచారం అందిస్తారు. ఇడిస్ట్రిక్ మేనేజర్, పంచాయతీ కార్యాలయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వెబ్ కాస్టింగ్, ఇతర వ్యవహారాల నిర్వహణ చూస్తారు. గవర్నర్




ఆమోదం పొందని 42శాతం బిసి రిజర్వేషన్లుస్థానిక ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పటి నుంచి ప్రభుత్వానికి అనేక సమస్యలు ఎదురువుతున్నాయి. స్థానిక ఎన్నికల్లో బిసిరిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూఅసెంబ్లీ సమావేశంలో తీర్మానం చేసి ఇందుకు సంబంధించిన బిల్లును గవర్నర్‌కు కూడా పంపింది. అయితే గవర్నర్ ఆ బిల్లుకు ఇంత వరకు ఆమోదం తెలుపలేదు. పెండింగ్ బిల్లులు చెల్లించకుండా ఎన్నికలు నిర్వహిస్తే అడ్డుకుంటామనే హెచ్చరికలు ఒక వైపు మరో అక్టోబర్ 30లోగా ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు మరోవైపు ఉన్న నేపథ్యంలో ఎటూపాలుపోని సందిగ్ధంలో ప్రభుత్వం ఉంది. ఈనేపథ్యంలో స్థానిక ఎన్నికల నిర్వహణకు మరింత గడువు ఇవ్వాలని హైకోర్టును కోరేయోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. ఒకవేళ గడువు ఇచ్చినాస్థానిక ఎన్నికలను ఎంత వరకు సజావుగా నిర్వహించగలమే ఆందోళనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. పోతే అడ్డుకుంటామన్న మాజీ సర్పంచ్‌ల హెచ్చరికలు మరో వైపు స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం కల్పించాలనే డిమాండ్ వస్తుండగా అక్టోబర్ 30లో స్థానిక ఎన్నికల నిర్వహించాలని వీటికి సంబంధించి ఏర్పాట్లకు నెలరోజులు సమయం ఇస్తున్నామన్న గడువు కూడా తీరడంతో ఏమిచేయాలో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. వీటిని పరిష్కరించపుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు రిజర్వేషన్ల పెంపు కోసం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్‌పై ఇప్పటికే అడ్వకేట్ జనరల్‌తోపాటు పలువురు సీనియర్ న్యాయవాదులతో గవర్నర్ చర్చించినా కూడా ఇందుకు సంబంధించి తన సమ్మతిని తెలియచేయలేదు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు సెప్టెంబర్ 30లోగా గ్రామీణ స్థానికసంస్థల ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. మొదటి నెలరోజుల్లో రిజర్వేషన్లను ఖరారు చేయాలని, ఆ తర్వాతి 2 నెలల్లో ఎన్నికలు నిర్వహించాలని ఉన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. రిజర్వేషన్లు నెల రోజుల్లో ఖరారు చేయాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి తెలిపింది. అంటే శుక్రవారం(జులై 25)లోగా రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేయాల్సి ఉన్నది. కానీ ఇప్పటివరకు స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లపై స్పష్టత రాలేదు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం ఈనెల 10న జరిగిన రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. దీనికి చట్టబద్ధత కల్పనకు పంచాయతీరాజ్ చట్టానికి సవరణలతో ఆర్డినెన్స్ తీసుకువచ్చి గవర్నర్‌కు పంపించగా, తాజాగా గవర్నర్‌ను ఆర్డినెన్స్ ముసాయిదాపై న్యాయసలహా కోసం కేంద్రానికి పంపించారు. అయితే ఆర్డినెన్స్ ఇప్పటివరకు గవర్నర్ ఆమోదం కానీ, కేంద్ర ప్రభుత్వ ఆమోదం కానీ లభించలేదు. ఇదిలా ఉండగా ఉన్న తలనొప్పులు చాలవన్నట్లుగా మహారాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి ఆదిలాబాద్‌లోని 14 కరమెరి మండలంలోని ముకద్దంగూడ, కోట, అంతాపూర్, పరందోలి, గౌరీ, బోలాపటార్, లెండిగూడ, ఏసాపూర్, ఇంద్రానగర్, పద్మావతి, పాల్సగూడ, నారాయణగూడ, మహారాజ్ గూడ, శంకర్‌లోధి అనే 14గ్రామాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉండేవి. తెలంగాణ ఆవిర్భావం అనంతరం ఉమ్మడి ఆదిలాబాద్‌కిందకు వచ్చాయి. వాటిని మా రాష్ట్రంలో చేసుకుంటామని ప్రకటిచ డంతో ఆయా గ్రామాల్లో స్థానిక ఎన్నికలు జరుగుతాయా లేదా అనే సందిగ్ధం నెలకొంది. స్థానిక ఎన్నికల నిర్వహణపై హై కోర్టును మరింత గడువు కోరడం తప్ప మరో గత్యంతరం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. పంచాయతీరాజ్ చట్టం 2018 లోని సెక్షన్ 285 క్లాజ్ ఎ సవరించాలని ఇటీవల రాష్ట్ర కేబినెట్ నిర్ణ యం తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే 285 క్లాజ్ ఎ సెక్షన్‌లో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా అమలవుతాయని ఉంది. అందులో 50శాతానికి మించకుండా అనే వాక్యాన్ని తొలగిస్తూ చట్టాన్ని సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. ఈ ఆర్డినెన్స్ ముసాయిదాపై న్యాయసలహా కోసం తాజా గవర్నర్ కేంద్రానికి పంపిం చారు. అయితే గతంలో సుప్రీంకోర్టు సైతం 50శాతానికి మించి రిజర్వేషన్లు ఉండ కూడదంటూ ఇచ్చిన తీర్పును ఈ ఆర్డినెన్స్ ఉల్లంఘించినట్లు అవుతుందా? లేదా? అంటూ గవర్నర్ అనుమానం వ్యక్తం చేశారు. అందులో భాగంగా న్యాయ సలహా కోసం కేంద్ర హోంమంత్రిత్వ శాఖకు ఈ ఆర్డినెన్స్ పంపగా ఇంతవరకు అటు నుంచి కూడా ఎటు వంటి సమాచారం రాష్ట్రప్రత్వానికి అందలేదు. వాస్తవానికి గ్రామాల అభివృద్ధికి కేంద్రం ప్రభుత్వం వాటా కింద నెలకు రూ.339 కోట్లను, రాష్ట్ర ప్రభుత్వం తనవాటా కింద రూ.270 కోట్లను విడుదల చేయాల్సి ఉంది. అయితే సుమారు రెండుసంవత్సరాలుగా రాష్ట్రప్రభుత్వం స్థానిక ఎన్నికలు నిర్వహించక పోవడంతో ఈ రెండు సంవత్సరాలకు గాను కేంద్రం నుంచి రావాల్సిన మొత్తం రూ.8136కోట్లు ఆగిపోయాయి. ఒకవేళ ఎన్నికలు నిర్వహించిన ఆ మొత్తాన్ని తిరిగి విడుదల చేసే అవకాశం లేదని అవి మురిగిపోయినట్లే అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అదేవిధంగా రాష్ట్రప్రభుత్వం గత రెండు సంవత్సరాలుగా నెలకు రూ.270 కోట్లు (రూ.6480 కోట్లు)విడుదల చేయకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి ఎక్కడిక్కడే నిలిచిపోయింది. సర్పంచ్ కార్యాలయాల్లో చెత్తను ఎత్తిపోసే ట్రాక్టర్ల డీజిల్‌ఖర్చే కాకుండా ప్రస్తుత వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్‌పౌడర్‌ను కొనుగోలు చేసేందుకు కూడా నిధులులేని పరిస్థితి ఏర్పడింది. ●

# శాంతించినట్లేనా!

మణిపూర్

**ఎ.వి.వి ప్రసాద్**

కొన్ని గాయాలను కాలమే మాన్పుతుందంటారు. ఒక్కొక్కసారి అదే గాయం మరింత పెద్దది కావొచ్చు కూడా. మణిపూర్ గాయం మానినట్లే కనిపిస్తూ అప్పుడప్పుడు మళ్లీనొప్పి పెరుగుతోంది. అటువంటి పరిస్థితిలో ప్రధాని మోడీ గతవారం ( 13, సెప్టెంబరు) జరిపిన పర్యటన నిజంగా కొత్త శాంతి రేఖలు పరిచినట్లుగానే కనిపిస్తోంది. తెగల మధ్య ఘర్షణలతో దాదాపు రెడున్నరేళ్లుగా మణిపూర్ రగులుతోంది. కొండ ప్రాంతాల్లోని కుకీలు, లోయప్రాంతం లోని మెయితీల మధ్య రాజుకొన్న ఘర్షణలు రోజు రోజుకు రాష్ట్రాన్ని తీవ్ర ఉద్రిక్త పరిస్థితిలోకి నెట్టివేయడంతో అక్కడ సాధారణ ప్రజలు నిలువనీడను సైతంకోల్పోయి వలసబాట పట్టవలసి వచ్చింది. ఈశాన్య రాష్ట్రాలైన అసోం, మిజోరం, మణిపూర్ మూడింటిలోను తరచుగా ఆందోళనకర పరిస్థితులేర్పడుతున్నా, మణిపూర్‌లో అది జాతుల సమస్య కావడంతో రాజకీయ అస్థిరత పెరిగిపోయి చివరికి గవర్నర్ పాలన దాకా వెళ్లింది. హింసాకాండలో మణించినవారు 300 పైనే. దాదాపు 70వేల మంది నిరాశ్రయులైనట్లు సమాచారం. మెయితీలకు రిజర్వేషన్లు కల్పించాలనే ప్రతిపాదనలకు, పలు కొండ ప్రాంతాలను రిజర్వుడు ఫారెస్టులుగా ప్రకటించడానికి వ్యతిరేకంగా 2023మే నెలలో కుకీలు ఆందోళనలు మొదలు పెట్టారు. అది తర్వాత ఉధృతమై హింసాకాండ తీవ్రస్థాయికి చేరింది. కొన్ని వేలమంది పునరావాస శిబిరాల్లో మగ్గవలసి వచ్చింది. గత శనివారం ప్రధాని ఆ శిబిరాల్లో కొన్నిసందర్శించి నిర్వాసితులకు ఏడువేల ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పడంతో పాటు రాష్ట్రానికి రూ.3వేలకోట్ల ప్యాకేజీ ఇస్తున్నట్లు కూడా ప్రకటించారు. అంతేగాక మరో ఏడువేల కోట్ల రూపాయల అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు కూడా చేశారు. ఇది కూడా ఆ ప్రాంత వాసులకు పెద్ద ఉపశమనమే. మణిపూర్ సమస్యను కేంద్రం పట్టించుకోవడం లేదని విపక్షాలు తీవ్రవిమర్శలు చేస్తున్న సమయంలో ప్రధాని ఈపర్యటన జరిపి కొన్ని ఉపశమన చర్యలు తీసుకోవడం ఒక శుభ పరిణామమనే చెప్పాలి. ఇంఫాల్, చుర్‌చాంద్ పూర్ తదితర ప్రాంతాల్లో ప్రధాని పర్యటిస్తుండగా కుంభవృష్టి కురియడంతో చాలా అంతరాయం ఏర్పడినా, విశ్రమించకుండా ఆయన పునరావాస శిబిరాలకు వెళ్లడం ప్రజలకు ఎంతో ఊరట కలిగించింది. ప్రధాని రావాలనీ, తమకు దారి చూపాలనీ ఎన్నో నెలలనుంచి అక్కడి ప్రజలు నిరీక్షిస్తున్నారు. మెయితీల ఇంఫాల్‌లోను, కుకీల చుర్ చాంద్‌పూర్ లోను పర్యటించి ఉభయులను శాంతింపచేయడానికి ప్రధాని యధాశక్తి ప్రయత్నించారు. నిరాశ్రయులు, చిన్నారులు, కుటుంబాలను కోల్పోయిన బాధితులందరిని వరుసగా పరామర్శిస్తూ హోరు వానలో ఆయన జరిపిన పర్యటన విమర్శలు చేస్తున్న విపక్షాలకు కూడా ఆశ్చర్యం కలిగించింది.



ప్రధాని మోడీ

అయితే ప్రధాని పర్యటన తర్వాత అక్కడ పూర్తిగా శాంతియుత పరిస్థితులు ఏర్పడ్డాయా?అనే ప్రశ్నకు భిన్నమైన సమాధానాలే వినిపిస్తున్నాయి. కుకీల ఆగ్రహానికి, మెయితీలు జరిపిన దాడులకు అసలు కారణం అభివృద్ధి కార్యక్రమాలు కాదు. ఇంఫాల్ వ్యాలీలోని మెయితీలు, పర్వతప్రాంతాలలోని కుకీ, నాగ జాతీయుల మధ్య వనరులపై ఆధిపత్య పోరాటం గత రెండున్నరేళ్లుగానే కాదు, చాలా సంవత్సరాల నుండే సాగుతోంది. మెయితీలు రాష్ట్రంలో 53 శాతం ఉన్నావారికి ఎస్టీహోదా లేదు. అందువల్ల ఆ హోదా కోసంవారు సుదీర్ఘంగానే పోరాడుతున్నారు. ఇప్పటికే ఆహోదా ఉన్న కుకీలు, నాగాలు దానిని వ్యతిరేకిస్తున్నారు. మెయితీలకు ఎస్టీహోదా కల్పిస్తే భూమి హక్కులు, రిజర్వేషన్లు, ఉపాధి అవకాశాల్లో పోటీ పెరుగుతుందని వారి భయం. 202223 మధ్య మణిపూర్ ప్రభుత్వం' అక్రమ వలసలు, ఓపియం సాగు' అంశంపై కుకీ గ్రామాలను తొలగించే చర్యలు ఆరంభించడంతో పెద్ద ఎత్తున ఆందోళనలు చెలరేగాయి. తర్వాత 2023 మార్చిలో మణిపూర్ హైకోర్టు మెయితీ వర్గానికి ఎస్టీహోదా ఇవ్వాలని సిఫారసుచేయడం నిప్పును మరింత రగిలించింది. దానికి వ్యతిరేకంగా ఆ సంవత్సరం మే 3వ తేదీన 'ట్రైబల్ సాలిడారిటీ మార్చ్' పేరుతో కుకీలుభారీగా చేసిన ఆందోళనలు హింసాత్మకం కావడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఇళ్లు, చర్చిలు, ఆలయాలు కూడా ధ్వంసమయ్యాయి. అప్పటి బీరేన్ సింగ్ ప్రభుత్వం ఒకవర్గానికే మద్దతు ఇస్తున్నదనే ఆరోపణలు రావడం కూడా హింసాకాండ పెరగడానికి దారితీసింది. తెగల ఘర్షణలు అదుపు తప్పడం, రాష్ట్రప్రభుత్వంపై పక్షపాతం ఆరోపణలు, పరిపాలనా వ్యవస్థ స్తంభించడం, కేంద్ర భద్రతా బలగాలను ఎక్కడచూసినా మొహరించడం, రాజకీయంగా ప్రభుత్వం ప్రజలవిశ్వాసాన్ని కోల్పోవడంతో 2025ఫిబ్రవరి 13నుంచి రాష్ట్రపతి పాలనకూడా విధించవలసి వచ్చింది. అప్పటినుంచి హింసాకాండ చాలావరకు తగ్గినా ఇంకా అసలు సమస్యలు అలాగే ఉన్నాయి. కుకీలు, మెయితీలు ఆగ్రహంతో ఊగిపోతూనే ఉన్నారు. తమ ప్రాంతాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించి 'ప్రత్యేక పాలనా యంత్రాంగం' ఏర్పాటు చేయాలని కుకీ జో కౌన్సిల్‌ప్రధానంగా డిమాండ్ చేస్తోంది. మెయితీల ఎస్టీడిమాండ్ ఉండనే ఉంది. కొన్నివనరుల వాటాల డిమాండ్లు కూడా ఆ వర్గాలు చేస్తున్నాయి. తొలుత ఈ అంశాలకు వివాద రహితమైన పరిష్కారాలు లభించవలసి ఉంది. ఒక దశలో కుకీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లడానికి కూడా భయపడ్డారంటే రాష్ట్రంలోఎలాంటి ఆందోళనకర వాతావరణం ఉన్నదో అర్థమవుతుంది. కుకీలు, మెయితీలు మళ్లీ కలిసిమెలిసి జీవించే పరిస్థితులు తొలుత ఏర్పడాలి. గతంలో అలాగే ఉండేవారు. కానీ రాజకీయ జోక్యం పెరిగి వర్గ విభేదాలు అధికమయ్యాయి. ఆ గాయం పూర్తిగా మానాలంటే మళ్లీ రాజకీయంగానే తగిన మందు వేయాలి. ప్రధాని ఈఅంశానికి ప్రాధాన్యత ఇచ్చి పరిష్కారం కనుగొంటే మణిపూర్‌లో తిరిగి పూర్తి శాంతి నెలకొని ఆయన అన్నట్లుగా భారత మాత కిరీటంలో నిజంగానే ఒక రత్నమవుతుంది. ●

# ఒంటరి అవుతున్న ఇజ్రాయెల్

ఇజ్రాయెల్

**గన్ని మోహన్**

పాలస్తీనాపై ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న యుద్ధకాండ సుమారు రెండేళ్లు కావస్తున్నప్పటికీ ప్రపంచ దేశాల్లో మాత్రం ఒంటరి అవుతున్నట్లు కనిపిస్తోంది. పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించేందుకు అగ్ర రాజ్యాలు సైతం ముందుకువస్తున్న తరుణంలో అమెరికా మిత్రదేశంగా ఉన్న ఇజ్రాయెల్ ఇప్పుడు ఒంటరి కాబోతోందన్నది స్పష్టంఅవుతోంది. ఎందుకంటే ఐక్యరాజ్యసమితి పరిధిలో ఉన్న195 దేశాల్లో దాదాపు 140కి పైగా దేశాలు పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించేందుకు సిద్ధంగా ఉన్నాయి. దౌత్యపరంగానే ఇప్పుడు ఇజ్రాయెల్‌పై ఒత్తిడి పెంచాలని, గతంలో దక్షిణాఫ్రికాపై విధించిన ఆంక్షలు, ఒత్తిళ్ల తరహాలోనే ఇజ్రాయెల్‌పై ఒత్తిడిని పెంచాలని ప్రపంచదేశాలు చూస్తున్నాయి. స్వదేశంలోనే రాజకీయ వేత్తలు ప్రధాని బెంజమిన్ నెతన్యాహు వైఖరిని ఎండగడుతున్నారు. అంతర్జాతీయంగా బహిష్కరణకు గురయ్యే విధంగా దేశాన్ని నడిపిస్తున్నారన్న ఆందోళనలు పెరిగాయి. ఇప్పుడు నెతన్యాహుపై అంతర్జాతీయ కోర్టు వారంటు కూడా పెండింగ్‌లో ఉంది. అయితే ఆయన నిర్భయంగా సంచరించే దేశాల సంఖ్య కూడా తగ్గుతూ వస్తోంది. ఇందుకు కారణం పాలస్తీనలో పెరిగిన ఆకలి చావులు, గడచిన రెండేళ్లలో 60వేలమందికిపైగా మరణాలు, లక్షలాది మంది నిరాశ్రయులు, మానవతా శిబిరాలపైనా ఇజ్రాయెల్ వంటి దాడులతో నెతన్యాహు పాలనపై విశ్వవ్యాప్తంగా నిరసన పెరుగుతోంది. ఐక్యరాజ్యసమితిలో బ్రిటన్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, బెల్జియం, కెనడా, స్పెయిన్ ఇతర యూరోపియన్ దేశాలతోపాటు మరికొన్ని దేశాలు పాలస్తీనాను ఒక స్వతంత్ర దేశంగా గుర్తించాలని భావిస్తున్నాయి. ప్రత్యేకించి ఖతారన్‌లో హమాస్ నేతలపై ఇజ్రాయెల్ దాడులపట్ల గల్ఫ్‌దేశాలు కూడా ఆగ్రహంతో ఉన్నాయి. ఇజ్రాయెల్‌తో ఉన్న సంబంధాలను పునఃసమీక్షించాలని నిర్ణయించాయి. ఆకలి మంటలతో అల్లాడిపోతున్న గాజాస్ట్రిప్, వెస్ట్‌బ్యాంక్ వంటి ప్రాంతాలపై ఇప్పటికీ ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తుండటాన్ని ప్రపంచ దేశాలు ససేమిరా అంగీకరించడంలేదు. ఇజ్రాయెల్‌ను దౌత్యపరంగా లొంగదీయాలన్న వ్యూహంతో బెల్జియం, ఫ్రాన్స్, స్పెయిన్ దేశాలు ఇప్పటికే ఆంక్షలు ప్రకటించాయి. ఆయుధ నిషేధాన్ని చట్టంగా మార్చేసాయి. గాజా యుద్ధ నేరాలతో లింకులున్నవారికి తమ దేశంలోప్రవేశం లేదని ప్రకటించాయి. అలాగే ఇజ్రాయెల్‌కు ఆయుధాలు తరలించుకువెళ్లే నౌకలు, విమానాలకు తమ ప్రాదేశిక ప్రాంతంపై నుంచి వెళ్లేందుకు బ్యాన్ విధించాయి. అలాగే నార్వే కూడా రెండు లక్షల కోట్లడాలర్ల సావరిన్ వెల్త్‌ఫండ్‌ను ఉపసంహరిస్తోంది. 23 కంపెనీల నుంచి ఆనిధులు వెనక్కితీసుకుంది. మరోపక్క ఐరోపాయూనియన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండర్‌లేయన్‌కూడా గాజాలో జరిగిన సంఘటనలు కలచివేస్తున్నాయని, మనస్సాక్షి ఆమోదయోగ్యం కావని వెల్లడించారు. ఈయూ విదేశీ విధాన కర్త కయాక్లాస్‌కు లేఖలు కూడా రాసారు.



బెంజమిన్ నెతన్యాహు

ఇజ్రాయెల్‌తో ఉన్న సంబంధాలన్నింటినీ పూర్తిగా నిలిపివేసి కఠినచర్యలకు ఉపక్రమించాలని కోరారు. ఒకప్పుడు దక్షిణాఫ్రికాపై విధించిన ఆంక్షలు తరహాలోనే ఇజ్రాయెల్‌పై అమలుచేస్తే తప్ప దారికి రాదన్న వాదన ఐరోపా కూటమిలో బలంగా వినిపిస్తోంది. వర్ణ వివక్షను రూపుమాపేందుకు ఆనాడు దక్షిణాఫ్రికాలో ఆర్థిక, వాణిజ్య దౌత్యసంబంధాలతోపాటు సాంస్కృతిక క్రీడా పోటీలు కూడా బహిష్కరించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు యూరోవిజన్ పాటలపోటీపై ఈ ఆంక్షలు విధించాలని చూస్తోంది. ఇజ్రాయెల్‌ను అనుమతిస్తే పోటీనుంచి వైదొలుగుతామని ఐర్లాండ్, స్పెయిన్, నెదర్లాండ్స్, స్లోవేనియాలు కూడా సూచించాయి. దీనితో ఇజ్రాయెల్‌కు సాంస్కృతిపరమైన బంధాలు కూడా దూరం కానున్నాయి. మరోవైపు హాలివుడ్‌లో కూడా ఇజ్రాయెల్ పట్ల వ్యతిరేకత పెరుగుతోంది. మారణహోమం, వర్ణవివక్ష దిశగా నడుస్తోందని ఇజ్రాయెల్ చిత్రాలు బహిష్కరించాలన్న ఉద్యమం బయలుదేరింది. క్రీడల్లో కూడా ఇజ్రాయెల్ పాల్గొంటే తాము వెనక్కి తప్పుకుంటామన్న బలమైన డిమాండ్లు వస్తున్నాయి. పుల్టాడి ఎస్పానా సైక్లింగ్ రేసును నిరసనకారులు అడ్డుకున్నారు. దీనితో రద్దు చేసుకుని ఇజ్రాయెల్‌టీమ్ వెనక్కిపోయింది. ప్రస్తుతం ఇజ్రాయెల్ పరిస్థితిని చూస్తుంటే అమెరికా వత్తాసుతో యుద్ధం కొనసాగిస్తున్నా అస్తిత్వముప్పును ఎదుర్కొంటున్నదనే చెప్పాలి. గతంలో ఇజ్రాయెల్‌కు రాయబారులుగా పనిచేసినవారు కూడా ఇప్పుడు తమదేశం దౌత్యపరంగా బలహీనపడుతోందని అంగీకరించారు. కొందరైతే ఇజ్రాయెల్ ఆక్రమణలను సమర్థించలేమంటూ దౌత్యవిధుల నుంచి కూడా తప్పుకున్నారు. ప్రపంచంలో మెజార్టీ దేశాలు ఇజ్రాయెల్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ అమెరికా మాత్రం పూర్తి అండదండలిస్తోంది. అయితే తమదేశంపై కఠిన చర్యలు అమలుకు సంఖ్యాపరంగా దేశాలు ముందుకుస్తున్నా ఆచరణలో తక్కువేనని శాంతి సంధానకర్త డేనియల్‌లెవీ అన్నారు. అయితే ఇజ్రాయెల్ ఒంటరికానున్నదన్న భావననుమాత్రం మార్చలేమని నెతన్యాహు దారితప్పుతున్నారని లెవీ వంటి శాంతికాముకులు చేసిన వ్యాఖ్యల్లో వాస్తవం లేకపోలేదు. అందుకు గాజాలో ఇప్పటికీ కొనసాగిస్తున్న మారణహోమమే. కేవలం 50 లక్షల జనాభాకు మించిలేని చిన్నదేశంపై ఇలాంటి మూకుమ్మడి దాడి చేసి అమాయక పౌరులను బలితీసుకుంటున్నదన్న భావనమెజార్టీ దేశాల్లో పాతుకుపోయింది. ఇప్పుడు ఇజ్రాయెల్ ప్రధాని ఈ భావన నుంచి ఎలా బయటపడగలరన్నదే అంతుబట్టని వ్యూహంగా ఉంది. సమితి భద్రతా మండలిలో అమెరికా వీటోచేయగలిగినా సంఖ్యాపరంగా సర్వప్రతినిధుల సభలో నెతన్యాహుకు నిరసన తప్పదు. ప్రత్యేకించి అమాయక పౌరులు బలవుతుండటాన్నే ఈ దేశాలు జీర్ణించుకోలేకుండా ఉన్నాయి. మెజార్టీ దేశాలు తీసుకున్న పాలస్తీనాకు స్వతంత్ర గుర్తింపును బెంజమిన్ నెతన్యాహు ఎలా అడ్డుకోగరన్నదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. ●

# వంటగది నుంచి మూలధన మార్కెట్ల వరకు జిఎస్టీ 2.0



నవనీత్ సెహ్‌గల్

మోడీ ప్రభుత్వంలోని విస్తృతమైన పరోక్ష పన్నుల సంస్కరణ ప్రజల పట్ల బాధ్యతతో పాటు సమగ్ర అభివృద్ధిపై ఆదాయపు పన్నులో గణనీయమైన ఉపశమనాన్ని అందించిన తరువాత, మోడీ ప్రభుత్వం ఇప్పుడు జిఎస్టీ 2.0రూపంలో మరో ధైర్యవంతమైన ముందడుగు వేసింది. ఇది పరోక్ష పన్ను వ్యవస్థ ప్రారంభమైన తర్వాత జరిగిన అత్యంత సమగ్రమైన సంస్కరణగా నిలిచింది. ఏ ప్రజాస్వామ్య ప్రభుత్వంలోనైనా పన్నుల తగ్గింపు ప్రభుత్వ ఆదాయంపై ప్రత్యక్ష ప్రభావం చూపిస్తుంది. కాబట్టి రాజకీయ పరంగా, ఆర్థికపరంగా ప్రమాదంతో కూడుకున్న చర్యే అవుతుంది. అయితే, మొదట ప్రత్యక్ష పన్నుల్లో, తర్వాత పరోక్ష పన్నుల్లో రెండు ప్రధాన సంస్కరణలను స్వల్ప కాలంలో అమలు చేయడం ద్వారా, ప్రజల ప్రయోజనాలే తమ పరిపాలన విధానానికి ప్రధానమని ప్రభుత్వం స్పష్టంగా చాటింది. ఊహించినట్లుగానే, జిఎస్టీ 2.0 అనేది కేవలం రేట్ల మార్పిడి మాత్రమేనని, వినియోగదారుల ఖర్చులపై అసలైన ప్రభావం లేదని ఆరోపించేందుకు ప్రతిపక్ష నాయకులు ఈసంస్కరణను తక్కువచేసి చూపే ప్రయత్నంచేశారు. కానీ, మార్కెట్ ధోరణులు మాత్రంవేరుగా ఉన్నాయి. ఔషధ కంపెనీలు ఇప్పటికే ధరలు తగ్గిస్తున్నట్లు ప్రకటించాయి. బీమా సంస్థలు ప్రీమియం పాలసీలను తగ్గించి అందిస్తున్నాయి. అలాగే ఎఫ్ఎమ్‌సిజి బ్రాండ్లు కూడా ఎమ్ఆర్‌పిలను తగ్గించడం ప్రారంభించాయి. ప్రతిపక్షాల ఆరోపణలకు విరుద్ధంగా తాజా సంస్కరణ ప్రజల రోజువారీ జీవితాన్ని సులభతరం చేస్తుందనేందుకు రూపొందించిందని స్పష్టంగా వెల్లడవుతోంది. అలాగే, ఆదాయ లోటు ఉంటే, దానిని డిమాండ్ పెంపు, అభివృద్ధి రంగాల విస్తరణ ద్వారా భర్తీచేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇంటి బడ్జెట్లపై జీఎస్టీ 2.0 ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటివరకు 12-18 శాతం పన్ను విభాగంలో ఉన్న వస్తువులు ఇప్పుడు 5నుంచి0 శాతం పన్ను పరిధిలోకి వచ్చాయి. వంట గది నుంచి మెడికల్ షాపుల వరకు ఈ ఊరట స్పష్టంగా కనిపిస్తోంది. కేన్సర్, గుండె జబ్బులకు సంబంధించిన ప్రాణ రక్షకమందులు పూర్తిగా పన్ను మినహాయింపులోకి వచ్చాయి. ఆరోగ్య బీమా ప్రీమియంలపై ఇకపై పన్ను విధించడం ఉండదు. టెలివిజన్లు, ఎయిర్ కండిషనర్లు వంటి గృహోపకరణ వస్తువులు కూడా 28 శాతం పన్ను పరిధి నుంచి 18శాతానికి తగ్గించబడ్డాయి. ఈ చర్యలు ప్రజల జేబులో డబ్బు ఆదాచేయడం ద్వారా ఆర్థిక వృద్ధిని పెంచాలనే విశాల దృష్టిని చూపిస్తున్నాయి. ఆర్థిక నిపుణుల అభిప్రాయం ప్రకారం, పన్నులు తగ్గితే డిమాండ్ తప్పనిసరిగా పెరుగుతుంది. ఈ సంస్కరణ ఇప్పటికే మార్కెట్ వాతావరణాన్నిపునరుద్ధరిస్తోంది. వ్యాపారులు, తయారీదారులు కార్యకలాపాలు పెరుగుతు న్నాయని చెబుతున్నారు. రాబోయే పండుగ సీజన్ ముందు నుంచే వినియోగదారుల నమ్మకం తిరిగి పెరుగుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. అంటే జీఎస్టీ 2.0క్షేత్రస్థాయి నుంచి ఆర్థికవృద్ధిని ప్రోత్సహించడం అనే తన లక్ష్యాన్ని చేరుకుంటుందనే సూచన ఇది. జీఎస్టీ 2.0 కేవలం పన్ను రేట్ల గురించేకాదు, భారత యువతకు శక్తినిచ్చే నిర్మాణా త్మక సంస్కరణ. సులభమైన వర్తింపు, బీమా వంటి కీలక సేవలపై మినహాయింపులు, విద్యా సామగ్రిపై సున్నా పన్ను, యువ విద్యార్థులు, ప్రొఫెషనల్స్‌కు కొనుగోలు శక్తినిపెంచి, అడ్డంకులను తగ్గిస్తాయి. డిజిటల్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్‌ను నడిపే తరం కోసం, ఈ సంస్కరణ ఆర్థిక ఉపశమనం, అవకాశాలను అందిస్తుంది. స్టార్టప్‌లు, ఎంఎస్ఎమ్ఈ (ఎమ్ఎస్ఎమ్ఇఎస్) జీఎస్టీ 2.0 సంస్కరణల వల్ల గణనీయంగా లాభపడను న్నాయి. తగ్గిన పన్ను భారం, సరళ మైన నిబంధనలు, సులభమైన రుణ ప్రవాహంతో చిన్నసంస్థలు నిబంధనలపై కాకుండా ఆవిష్కరణలపై దృష్టి పెట్టగలవు. ఈసంస్కరణ వ్యాపార అభివృద్ధికి అనుకూల




మైన వాతావరణాన్ని సృష్టిస్తుంది. యువ ఆవిష్కర్తలు తమ ఆలోచనలను వ్యాపారంగా మలచడాన్ని ప్రోత్సహిస్తుంది. మెరుగైన ఆర్థిక, ఆరోగ్య భద్రతను అందిస్తుంది. తాజా జీఎస్టీ సంస్కరణలు గృహావసరాలు, చిన్న వ్యాపారాలకు మాత్రమే కాదు, పెద్ద పరిశ్రమలు, పెట్టుబడిదారులకూ ఉపయోగపడుతుంది. సంక్లిష్టమైన వర్గీకరణ విధానాలు, ఇన్వాయిస్ మ్యాచింగ్‌ను సరళీకరించడంతో వ్యాపార వాతావరణం మరింత తేలికగా మారింది. దాంతో ప్రపంచ పెట్టుబడిదారులు ఈసంస్కరణ ను భారత ఆర్థిక స్థిరత్వా నికి బలమైన సంకేతంగా చూస్తు న్నారు. అనుకూలమైన పన్ను విధానంతో, భారత్ ఇప్పుడు కొత్త పెట్టుబడి, ఉద్యోగ సృష్టికి ఒక గ్లోబల్ నమూనాగా మారేందుకు సిద్ధమవుతోంది. ఏ ప్రభుత్వానికి అయినా ద్రవ్యోల్బణం ఒక ప్రధాన సవాలు. అవసరమైన వస్తువుల ను తక్కువ ధరలకు అందించడం ద్వారా జీఎస్టీ 2.0 నేరు గా ఇంటి బడ్జెట్‌పై ఒత్తిడి తగ్గిస్తోంది, పరోక్షంగా ద్రవ్యోల్బణాన్ని కూడా తగ్గిస్తుంది. ఈ సంస్కరణ ద్రవ్యోల్బణాన్ని 0.5 నుండి 1 శాతం వరకు తగ్గించగలదని అంతర్జాతీయ విశ్లేషకుల అంచనా. దీని ద్వారా స్థిరమైన అభివృద్ధికి బలమై పునాదులు పడతాయి. ఆర్థికనిపుణుల అంచనాప్రకారం జీఎస్టీ 2.0వల్ల రానున్న ఆర్థిక ఏడాదిలో భారత జీడీపీవృద్ధిలో 0.5నుంచి 1.2శాతం పాయింట్లు పెరుగుతుం దని అంచనా వేస్తున్నారు. వినియోగం ఆధారిత ప్రోత్సాహం ముఖ్యంగా ఆటోమొబైళ్లు, ఎఫ్ఎంసీజీ, ఎలక్ట్రానిక్స్ రంగాలకు లాభదాయకం అవుతుంది. జీఎస్టీసంస్కరణ ప్రకటన చేసిన వెంటనే సెన్సెక్స్ 300 పాయింట్లు పైకి పెరిగింది, నిఫ్టీ0.5శాతం లాభపడింది. ఆటోమొబైల్, వినియోగ వస్తువుల సంస్థల షేర్లు 4నుంచి 6శాతంవరకు పెరిగాయి. ఇది పెట్టుబడిదారుల బలమైన విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుంది. పన్ను తగ్గింపు కార ణంగా ప్రభుత్వ ఖజానాపై 48,000 కోట్లు భారం పడు తుందని ప్రభుత్వం అంగీకరించింది. అయితే, విధానకర్తలు, నిపుణులు.. ఈ లోటు రెండేళ్లలో పెరిగే వేగవంతమైన వినియోగం, ఆర్థిక కార్యకలాపాల కారణంగా సమం అవుతుందని భావిస్తున్నారు. ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ 56వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో చెప్పినట్లు ప్రజల ప్రయోజనార్థం తక్షణ నష్టాలను మేము భరించాల్సిన అవసరం ఉంటే, ఈ పెట్టుబడి భవిష్యత్తు ఆర్థికవ్యవస్థను మరింత బలపరుస్తుంది. జీఎస్టీ 2.0నాలుగు పన్నువర్గాలను రెండు ప్రధాన వర్గాలుగా సమీకరిస్తుంది. అవసరమైన వస్తువులకు 5శాతం (లేదా పన్నురహితం), సాధారణ వస్తు వులకు 18శాతం పన్నుఉంటాయి. అయితే విలాసవం తమైనవి, హానికరమైన ఉత్పత్తులకు 40 శాతం డిమెరిట్ పన్ను విధించనున్నారు. ఈ నిర్మాణాత్మక స్పష్టత పారదర్శ కతను బలోపేతం చేస్తుంది. వర్తింపును సులభతరం చేస్తుంది. ఆత్మనిర్భర్ దార్శనికతకు అనుగుణంగా ఉంటుంది. సాంకేతిక విషయాలకతీతంగా, జీఎస్టీ 2.0 ఒక స్పష్టమైన రాజకీయ సందేశాన్ని ఇస్తోంది. ఈ ప్రభుత్వం ప్రజలకు బాధ్య తాయుతంగా ఉంటుంది. చాలాదేశాలు పన్నులుపెంచుతున్న సమయంలో, భారత్‌మాత్రం వాటిని తగ్గించుకుంటూ ప్రజల సుసంపన్నతే జాతీయ అభివృద్ధిని నిజంగా నడిపేశక్తి అనే సంకేతం పంపుతోంది. జీఎస్టీ 2.0కేవలం పన్నురేట్ల పున ర్వ్యవస్థీకరణ మాత్రమే కాదు ఇది భారత ఆర్థిక చరిత్రలో ఒక మైలురాయి. గృహావసరాల ఖర్చులుతగ్గించడం, వ్యాపార చర్యలను సరళీక రించడం, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచడం ద్వారా దీర్ఘకాలిక, సమగ్ర అభివృద్ధికి పునాది వేసింది. విమర్శకులు దీనిని పైపై మార్పుగా భావించవచ్చు, కానీ, వాస్తవాలు మరింతలోతైన సత్యాన్ని సూచిస్తున్నాయి. ఈ సంస్కరణ రోజువారీ జీవితాన్ని సులభతరంచేసి, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. అలాగే పన్నువిధానం సామా జిక ప్రగతికి ఒక సాధనమని నిరూపిస్తుంది. జిఎస్టీ 2.0 కేవలం ఆర్థిక సంస్కరణగానే కాదు, పౌరుల పట్ల ప్రభుత్వ బాధ్యత, బలమైన, సమగ్ర భారత నిర్మాణానికి ఇచ్చిన అంకిత భావానికి ప్రతీకగా కూడా గుర్తుండిపోతుంది. ●

**(రచయిత: ప్రసార భారతి ఛైర్మన్)**

# అమెరికా ఒత్తిడికి తలొగ్గిన ఐరోపా కూటమి

## రష్యాపై ఆంక్షలు విధించేందుకు సిద్ధమే

### యూరోపియన్ కమిషన్ చీఫ్ ఉర్సులా వాండర్‌లేయన్



**బ్రస్సెల్స్, సెప్టెంబరు 20:** అమెరికా నుంచి వచ్చిన తీవ్ర ఒత్తిడి నేపథ్యంలో రష్యాపై యూరోపియన్ యూనియన్ మరోసారి కఠిన చర్యలకు సిద్ధమైంది. రష్యా ఆర్థిక వ్యవస్థను లక్ష్యంగా చేసుకుని 19వ ఆంక్షల ప్యాకేజీని యూరోపియన్ కమిషన్ ప్రతిపాదించింది. వారం రోజుల ఆలస్యం తర్వాత ఈ ప్రతిపాదనలను సభ్య దేశాల ఆమోదం కోసం పంపినట్లు కమిషన్ ప్రధాన ప్రతినిధి పౌలా పిన్హో శుక్రవారం బ్రస్సెల్స్‌లో ధ్రువీకరించారు. ఈ కొత్త ఆంక్షలు ప్రధానంగా రష్యా బ్యాంకులు, క్రిప్టో ఆస్తులు, ఇంధన దిగుమతులను లక్ష్యంగా చేసుకున్నట్లు యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్ తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడిన అనంతరం ఆమె సోషల్ మీడియా వేదికగా ఈ విషయాన్ని ప్రకటించారు. వాస్తవానికి గత శుక్రవారమే ఈ ప్యాకేజీని ప్రవేశపెట్టాల్సి ఉన్నప్పటికీ, అమెరికాతో సంప్రదింపుల కారణంగా వారం పాటు వాయిదా పడింది. రష్యా నుంచి ఇంధన దిగుమతులను పూర్తిగా నిలిపివేసే ప్రక్రియను వేగవంతం చేయాలని కూడా ఈయూ భావిస్తోంది. ప్రస్తుతం 2028 జనవరి 1 నాటికి రష్యా శిలాజ ఇంధనాల దిగుమతులను పూర్తిగా ఆపేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే, దీన్ని మరింత ముందుకు జరపాలని యోచిస్తున్నారు. రష్యా ఆర్థిక మూలాలను దెబ్బతీయాలంటే యూరప్ దేశాలు రష్యా నుంచి ఇంధన కొనుగోళ్లను తక్షణమే నిలిపివేయాలని ట్రంప్ ఇటీవల పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం యూరప్ గ్యాస్ అవసరాల్లో దాదాపు 19 శాతం టర్క్‌స్ట్రీమ్ పైప్‌లైన్, ఎల్ఎన్‌జీ దిగుమతుల ద్వారా రష్యా నుంచే వస్తోంది. కొత్త ఆంక్షలను దశలవారీగా అమలు చేసి, తమ దేశాల్లో ఇంధన ధరలు పెరగకుండా, కొరత ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకుంటామని ఈయూ అధికారులు చెబుతున్నారు. హంగేరి, స్లోవేకియా వంటి దేశాలు ఇప్పటికీ రష్యా ఇంధనంపై అధికంగా ఆధారపడి ఉండటం ఈయూకి సవాలుగా మారింది. మరోవైపు, ఈయూ ప్రతిపాదించిన ఆంక్షలపై రష్యా తీవ్రంగా స్పందించింది. బ్రస్సెల్స్, వాషింగ్టన్ నుంచి వచ్చే బెదిరింపులు తమపై ఎలాంటి ప్రభావం చూపవని రష్యా విదేశాంగ శాఖ ప్రతినిధి మరియా జఖరోవా అన్నారు. రష్యా ఇంధనాన్ని వదులుకోవాలన్న ఈయూ నిర్ణయాన్ని ఆత్మహత్యాసదృశ్యమైన విధ్వంసంగా ఆమె అభివర్ణించారు. కాగా, ఈ 19వ ప్యాకేజీని త్వరగా ఆమోదించి, మరింత కఠినతరం చేయాలని ఉక్రెయిన్ విదేశాంగ తమంత్రి ఆండ్రీ సిబిహా కోరారు.

# హెచ్‌వన్ బి వీసాల్లో అమెజాన్‌కే అధికం




**వాషింగ్టన్, సెప్టెంబరు 20:** అమెరికాలో ఉద్యోగాలు ఆశిస్తున్న భారత ఐటీ నిపుణులకు, కంపెనీలకు ట్రంప్ ప్రభుత్వం భారీ షాక్ ఇచ్చింది. హెచ్1బీ వీసాలపై ఏకంగా లక్ష డాలర్ల (సుమారు రూ. 83 లక్షలు) వార్షిక ఫీజు విధిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం ఈఉత్తర్వులపై సంతకం చేశారు. ఈ కొత్త నిబంధన ఆదివారంనుంచే అమల్లోకి రానుందని, ఏడాది పాటు కొనసాగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. హెచ్1బీ వీసా ప్రోగ్రామ్‌ను కొన్ని కంపెనీలు వ్యవస్థాగతంగా దుర్వినియోగం చేస్తున్నాయని, దీనివల్ల అమెరికన్ ఉద్యోగులు తీవ్రంగా నష్టపో తున్నారని ట్రంప్ ప్రభుత్వం ఆరోపించింది. ఈ దుర్వినియోగాన్ని అరికట్టేందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు 'రెస్ట్రిక్షన్ ఆన్ ఎంట్రీ ఆఫ్ సెర్టెన్ నాన్‌ఇమిగ్రెంట్ వర్కర్స్' పేరిట జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఐటీ కంపెనీలు వేల సంఖ్యలో విదేశీ ఉద్యోగులను నియమిం చుకుంటూ, అదే సమయంలో అమెరికన్లను ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నాయని ప్రభుత్వం తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ నిర్ణయం వెలువడిన కొద్ది రోజుల ముందే, 2025 సంవత్సరానికి గాను హెచ్1బీ వీసాలు పొందిన కంపెనీల జాబితాను యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) విడుదల చేసింది. ఈ జాబితా ప్రకారం, అమెజాన్ 10,044 వీసాలతో అగ్రస్థానంలో నిలవగా, భారత ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) 5,505 వీసాలతో రెండో అతిపెద్ద లబ్ధిదారుగా నిలిచింది. హెచ్1బీ ఉద్యోగుల వల్ల కంపెనీలకు 36 శాతం వరకు ఖర్చు ఆదా అవుతుందని ఒక అధ్యయనాన్ని ఉటంకిస్తూ ప్రభుత్వం తెలిపింది. కొన్ని కంపెనీలు వేలల్లో వీసాలు పొందుతూ, అదే సమయంలో పదివేల మందికి పైగా స్థానిక ఉద్యోగులను తొలగించాయని తన ఉత్తర్వుల్లో తీవ్రంగా విమర్శించింది. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్ (స్టెమ్) రంగాల్లో ప్రత్యేక నైపుణ్యం కలిగిన విదేశీ నిపుణులను నియమించుకోవడానికి అమెరికన్ కంపెనీలకు హెచ్ 1బీ వీసా వీలు కల్పిస్తున్న విషయం తెలిసిందే. తాజా నిర్ణయంతో ఈ ప్రక్రియ అత్యంత ఖరీదైనదిగా మారనుంది.

## రోడ్‌షోలో బాలుడికి ప్రధాని మోడీ ప్రతినమస్కారం

### ఉత్సాహంగా కేరింతలు కొట్టిన బాలుడు



**భావ్‌నగర్, సెప్టెంబరు 20:** ప్రధాని నరేంద్ర మోడీ తనకు నమస్కారం చేసిన ఒక చిన్నారికి ప్రతినమస్కారం చేసి తన సంస్కారాన్ని చాటుకున్నారు. గుజరాత్ రాష్ట్రంలోని భావ్‌నగర్‌లో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రధాని నరేంద్రమోదీ శనివారం గుజరాత్‌లోని భావ్‌నగర్‌లో రోడ్ షో నిర్వహించారు. ఈ రోడ్‌షోకు జనం భారీ సంఖ్యలో హాజరయ్యారు. రోడ్డు పొడవునా జనం చేతులు ఊపుతూ ప్రధానికి స్వాగతం పలికారు. ప్రధాని వారికి అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. ఈ సందర్భంగా ఒక ఆసక్తికరమైన ఘటన చోటుచేసుకుంది. ప్రధాని వాహనం తనను సమీపించగానే రోడ్డుపక్కన జనాల్లో ఉన్న ఓ బాలుడు ఆయనకు హుషారుగా నవ్వుతూ నమస్కారం చేశాడు. అది గమనించిన ప్రధాని మోదీ నవ్వుతూ ఆ బుడ్డోడికి తిరిగి నమస్కారం చేశారు. ప్రధాని వాహనం ముందుకు కదులుతుంటే ప్రధాని తలవెనుకకు తిప్పి మరీ ఆ చిన్నోడికి నమస్కరించడం కనిపించింది. ప్రధాని తిరిగి నమస్కరించడంతో ఆ బాలుడుకూడా ఉబ్బితబ్బిబ్బయ్యాడు. తనకు ప్రధాని మోదీ ప్రతినమస్కారం చేసిన విషయాన్ని ఆ బుడ్డోడు పట్టరాని సంతోషంతో తన తల్లికి చెప్పే ప్రయత్నం చేయడం వీడియోలో కనిపిస్తోంది. కానీ అతడి తల్లి మాత్రం అతడి సంతోషాన్ని గమనించలేకపోయింది. ఎందుకంటే ఆమె కూడా అప్పటికే సంతోషంగా ఎడమచేయి ఊపుతూ ప్రధానికి స్వాగతం పలుకుతోంది. కుడిచేత్తో మొబైల్ పట్టుకుని పట్టుకుని ప్రధానిని వీడియో తీస్తోంది. కింది వీడియోలో ఆ దృశ్యాలను మీరు కూడా చూడవచ్చు.

## మనకు ఒక బలహీనమైన ప్రధాని ఉన్నారు..

### హెచ్‌వన్‌బి వీసా ఫీజుల పెంపుపై రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 20:** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ ప్రధాని నరేంద్ర మోదీ పై మరోసారి విమర్శలు గుప్పించారు. దేశం ఒక బలహీనమైన ప్రధానిని కలిగి ఉన్నదని విమర్శించారు. ఈ మేరకు తన సోషల్ మీడియా అకౌంట్ లో ఒక పోస్టు పెట్టారు.'ఐ రిపీట్, ఇండియా హాజ్ ఎ వీక్ పీఎం' అని ఆ పోస్టులో పేర్కొన్నారు. 2017లో కూడా హెచ్1బీ వీసా అంశాన్ని అప్పటి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందు ప్రధాని ప్రస్తావించకపోవడాన్ని రాహుల్ తప్పుపట్టారు. 'ఇండియా హాజ్ ఎ వీక్ పీఎం' అని అప్పట్లో పోస్టు పెట్టారు. తాజాగా హెచ్1బీ వీసాలకు ఒక లక్ష డాలర్‌ల (సుమారుగా రూ.88.80 లక్షలు) ఫీజు విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. దీనిపై కూడా ప్రధాని మోదీ మౌనంగా ఉంటున్నారని రాహుల్‌గాంధీ విమర్శించారు. అంతేగాక 'ఐ రిపీట్, ఇండియా హాజ్ ఎ వీక్ పీఎం' అని పోస్టు పెట్టి, 2017లో 'ఇండియా హాజ్ ఎ వీక పీఎం' అని తాను పెట్టిన పోస్టును గుర్తుచేశారు. రాహుల్‌గాంధీతోపాటు ప్రతిపక్ష కాంగ్రెస్ నేతలు మనీశ్ తివారీ, పవన్ ఖేరా తదితరులు కూడా ట్రంప్ హెచ్1బీ వీసాల జారీకి లక్ష అమెరికన్ డాలర్ల ఫీజు విధించడంపై విమర్శలు గుప్పిస్తున్నారు. ట్రంప్ నిర్ణయంతో కోట్ల మంది భారత యువతకు నష్టం వాటిల్లనుందని చెప్పారు. అమెరికా ఒక క్రమపద్ధతిలో ఇండియాకు ఉచ్చు బిగిస్తోందని విమర్శించారు. పాకిస్థాన్‌తో కాల్పుల విమరణకు ఒప్పించామని చెప్పడం, భారత ఎగుమతులపై సుంకాలను 50 శాతానికి పెంచడం, ఇప్పుడు వీసాలపై రుసుములు విధించడం లాంటివన్నీ అమెరికా ప్లాన్డ్‌గా చేస్తోందని, దీనిపై భారత్ చడీచప్పుడు లేకుండా ఉంటోందని మండిపడ్డారు.

## ఢిల్లీ రోహిణిలో ఎన్‌కౌంటర్: ఇద్దరు హతం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 20:** ఢిల్లీ పోలీసులకు, నోటోరియస్ గోగి గ్యాంగ్‌సభ్యులకు మధ్య శనివారంనాడు రోహిణిలోని బుద్ధ విహార్ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. ముగ్గురు ముఠా సభ్యులను పోలీసులను అదుపులోకి తీసుకున్నారు. ముఠా సభ్యులు కారులో ఆయుధాలతో వెళ్తుండగా వారిని అడ్డుకోవడంతో పోలీసు వాహనాన్ని ఢీకొట్టి పారిపోయేందుకు ప్రయత్నించారు. కారును అక్కడే వదిలేసి పోలీసులపై కాల్పులు జరపడంతో పోలీస్ టీమ్ ఎదురుకాల్పులకు దిగింది. ఈ కాల్పుల్లో ఇద్దరు ముఠా సభ్యులు గాయపడ్డారు. పట్టుబడిన గోగి గ్యాంగ్ సభ్యులను లల్లూ, ఇర్ఫాన్‌గా గుర్తించారు. ప్రస్తుతం వీరిద్దరూ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, నితీష్ అనే మరో సభ్యుడు కూడా పట్టుబడ్డాడు. ఇద్దరు ముఠా సభ్యులు సమీప ప్రాంతంలోకి పారిపోగా ప్రస్తుతం వారి కోసం గాలిస్తున్నారు. పట్టుబడిన వారి నుంచి అధునాతన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.

## 2027లో బుల్లెట్ రైలు పరుగులు


### సూరత్-బిలిమొర సెక్షన్‌లో ప్రారంభం

### రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి

**తముంబై, సెప్టెంబరు 20:** రైల్వే ప్రయాణికులకు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ శుభవార్త చెప్పారు. భారత్‌లో బుల్లెట్ రైలు 2027లో పరుగులు పెడుతుందని, తొలి దశలో సూరత్ -బిలిమొర సెక్షన్‌లో నడుపుతామని రైల్వే మంత్రి వెల్లడించారు. 2028నాటికి థాణె, 2029కి బాంద్రా కుర్లా సెక్షన్‌కు విస్తరిస్తామని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ముంబై -అహ్మదాబాద్ బుల్లెట్ ట్రెయిన్ ప్రాజెక్టు పనులను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ శనివారం పరిశీలించారు. ఇందులో భాగంగా షిల్‌పట- ఘన్‌సోలి మధ్య 4.8 కి.మీ టన్నెల్ పనులను రైల్వే ఉన్నతాధికారులతో కలిసి కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ పరిశీలించారు. ముంబై సమీపంలోని ఘన్‌సోలి వద్ద మంత్రి మీడియాతో మాట్లాడుతూ భారతీయుల బుల్లెట్ రైలు కల త్వరలో తీరబోతున్నదన్నారు. మధ్యతరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకుని బుల్లెట్ రైళ్ల ప్రవేశపెడుతున్నట్లు అశ్వినీ వైష్ణవ్ వివరించారు. చార్జీలు సాధారణంగానే ఉంటా యని పేర్కొన్నారు. ప్రస్తుతం ముంబై- అహ్మ దాబాద్ మధ్య రైలు ప్రయాణం 9 గంటలు పడుతుండగా, బుల్లెట్ రైలు అందుబాటులోకి వస్తే 2.07 గం.లలో గమ్యస్థానం చేరుకోవచ్చని రైల్వే మంత్రి తెలిపారు. ముంబై- అహ్మదాబాద్ బుల్లెట్ ప్రాజెక్టు పనులు ముమ్మరంగా సాగు తున్నాయని, 2027నాటికి సూరత్- బిలిమొర సెక్షన్ల మధ్య తొలివిడతలో బుల్లెట్ రైలు నడుపుతామన్నారు. ఆ తర్వాత దశల వారీగా బుల్లెట్ రైలు ప్రాజెక్టును విస్తరిస్తామని అశ్వినీ వైష్ణవ్ వివరించారు. ఈ రైలుకు సంబంధించిన ప్రయాణికులకు రైలులోనే టికెట్ తీసుకునే సదుపాయం కల్పిస్తున్నామని రైల్వే మంత్రి చెప్పారు.

## రెండోప్రపంచ యుద్ధం కాలంనాటి బాంబు..

# రెండురోజుల కృషితో నిర్వీర్యం



**హాంగ్‌కాంగ్ సిటీ, సెప్టెంబరు 20:** హాంగ్‌కాంగ్‌లో రెండో ప్రపంచ యుద్ధం నాటి బాంబును గుర్తించారు. ఆ బాంబు సుమారు 450 కేజీల బరువు ఉన్నది. క్వారీ బేలో నిర్మాణ కార్మికులకు ఆ బాంబు దొరికింది. అయితే దాన్ని నిర్వీర్యం చేసేందుకు వేల మందిని అక్కడి నుంచి తరలించారు. రెండో ప్రపంచ యుద్ధానికి చెందిన ఆ బాంబును అమెరికా తయారు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఆ బాంబు సుమారు 1.5 మీటర్ల ఎత్తు ఉంటుంది. దాదాపు వెయ్యి పౌండ్ల బరువు అంటే సుమారు 450 కేజీల బరువు ఉందన్నమాట. అది రెండో ప్రపంచ యుద్ధం కాలం నాటి బాంబు అని నిర్ధారణ జరిగినట్లు పోలీసు ఆఫీసర్ ఆండీ చాన్ టిన్ చూ తెలిపారు. బాంబును నిర్వీర్యం చేయడంలో హై రిస్క్ ఉన్నందున వేల మందిని మరో ప్రాంతానికి తరలించినట్లు ఆయన చెప్పారు. సుమారు 1900 ఇండ్ల నుంచి ఆరు వేల మందిని తరలించారు. శుక్రవారం రాత్రి బాంబు డియాక్టివేషన్ మొదలైంది. శనివారం ఉదయం 11.30 నిమిషాలవరకు కొనసాగింది. ఈ ఆపరేషన్‌లో ఎవరూ గాయపడలేదు. హాంగ్‌కాంగ్‌లో రెండో ప్రపంచ యుద్ధం కాలం నాటి బాంబులు తరుచూ బయటపడుతూనే ఉన్నాయి. సెకండ్ వరల్డ్ వార్ సమయంలో హాంగ్ కాంగ్ సిటీని జపనీస్ దళాలు ఆక్రమించాయి. జపనీస్ మిలిటరీ, షిప్పింగ్ కోసం బేస్‌గా వాడుకున్నారు. జపనీస్ సైన్యాన్ని దెబ్బతీయాలన్న ఉద్దేశంతో అమెరికా, వాటి మిత్రదేశాలు హాంగ్‌కాంగ్‌పై బాంబులు జార విడిచాయి.

## యూరప్ దేశాల విమానాశ్రయాలపై సైబర్ దాడులు

### విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం



**హైదరాబాద్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:** యూరోపియన్ యూనియన్‌లోని పలు దేశాలలో విమానాశ్రయాలపై సైబర్ నేరగాళ్లు విమానయాన సేవ లపై దాడులు చేయడంతో ఆయా దేశాల్లో విమానాల రాక పోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇదే సమయంలో అనేక దేశాల్లో విమానాల రాక పోకలను రద్దు చేశారు. స్థానిక కాలమానం ప్రకారం శుక్రవారం రాత్రి (భారత కాలమానం ప్రకారం శనివారం ఉదయం) ఈ దాడులు జరిగినట్లు యూరోపి యన్ యూనియన్ దేశాల విమానయాన సంస్థలు చెబుతున్నాయి. ఈ దాడుల కారణంగా విమానాశ్రయాలలో చెక్ ఇన్, బోర్డింగ్ పాస్ సర్వీస్ ప్రొవైడర్లకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో విమానాశ్రయాలలో కీలక విభాగాల్లో కీలక కంప్యూటర్లు మొరాయించాయి. విమానాశ్రయాలకు వచ్చిన ప్రయాణీకులు చెక్ ఇన్ ప్రాంతంలో గంటల తరబడి వేచి వుండాల్సిన పరిస్థితి ఏర్పడింది. సైబర్ దాడుల కారణంగా లండన్‌లోని హీత్రో విమానాశ్రయంతో పాటు బ్రస్సెల్స్ విమానాశ్రయం, బెర్లిన్‌లోని బ్రాండెన్‌బర్గ్ విమానాశ్రయం సహా పలు అంతర్జాతీయ విమానాశ్రయాలలో విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సైబర్ దాడుల కారణంగా విమానాశ్రయాలలో మాన్యువల్ పద్ధతిలో చెక్ ఇన్ చేయాల్సిన పరిస్థి తులు ఏర్పడ్డాయి. ఈ కారణంగా ప్రయాణీకులు గంటల తరబడి విమానాశ్రయాలలో వేచి వుండాల్సి వచ్చింది. దీంతో పాటు విమానాల రాకపోకల వివరాలను విమానాశ్రయంలోనే అడిగి తెలుసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రయాణీకులను రెండు నుంచి నాలుగు గంటల ముందుగానే వి మానాశ్రయాలకు రావాలని అధికారులు ఆదేశించారు. దీంతో పాటు లండన్, బెర్లిన్ సహా పలు నగరాలలోని విమానాశ్రయాలలో అనేక విమానాల ను రద్దు చేశారు. కాగా ప్రపంచ వ్యాప్తంగా అనేక అనేక విమానయాన సంస్థలకు చెక్ ఇన్, బోర్డింగ్ పాస్ సర్వీస్ సేవలను అందించే కాలిన్స్ ఏరో స్పెస్ సంస్థ సైబర్ దాడుల విషయాన్ని ధృవీకరించింది. దీనివల్ల తమ సంస్థకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపింది. సైబర్ దాడుల వల్ల ఆగిపోయిన సేవలను కొంతమేర పునరుద్ధరించినా చాలా సేవలను పూర్తిస్థాయిలో తిరిగి అందించేందుకు ఒక రోజు సమయం పడుతుందని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు.

# సంక్షిప్తంగా..

## 60 రోజుల్లోగా సిరియన్లు వెళ్లాలి:అమెరికా



**వాషింగ్టన్, సెప్టెంబరు 20:** అక్రమ వలసదారులపై కఠినంగా వ్యవహరిస్తున్న అమెరికా సిరియన్లకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. సిరియా వలసదారులుకు కల్పిస్తున్న తాత్కాలిక రక్షణ హోదాను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. దీనికింద రక్షణ పొందుతున్న వారంతా 60 రోజుల్లోగా దేశం విడిచి వెళ్లిపోవాలని ఆదేశించింది. లేదంటే అరెస్టులు చేస్తామని హెచ్చరించింది. తాత్కాలిక రక్షణ హోదా (టిపిఎస్) కింద వేలాది సిరియన్లు అమెరికాలో నివసిస్తున్నారు. 2012 నుంచి దాదాపు 6 వేలకుపైగా సిరియా వలసదారులు ఈ రక్షణ పొందుతున్నట్లు అంచనా. ఈ క్రమంలో వారి బహిష్కరణపై అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. అక్కడ నెలకొన్న పరిస్థితులు వారిని తిరిగి స్వదేశానికి వెళ్లకుండా నిరోధించలేవని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ అధికార ప్రతినిధి ట్రిసియా మెక్లాఫ్లిన్ స్పష్టం చేశారు.

## జెకె ఎన్‌కౌంటర్..నలుగురిని గుర్తించిన బిఎస్ఎఫ్



**శ్రీనగర్, సెప్టెంబరు 20:** జమ్ముకశ్మీర్‌లో ఎదురు కాల్పులు కొనసాగుతున్నాయి. ఉధంపూర్‌లో జరుగుతోన్న ఎన్‌కౌంటర్‌లో నలుగురు ఉగ్రవాదులను భద్రతా బలగాలు చుట్టుముట్టినట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతంలో ఉగ్రవాదుల కదలికలు ఉన్నట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం రావడంతో ఆర్మీ, స్పెషల్ ఆపరేషన్ గ్రూప్, జమ్మూకశ్మీర్ పోలీసులు సంయుక్త ఆపరేషన్ చేపట్టాయి. ఉదంపూర్‌లోని దుడు బసంత్‌గఢ్ పర్వత ప్రాంతాల్లో భద్రతా బలగాలు గాలింపు చర్యలు చేపట్టగా అక్కడ ముగ్గురు, నలుగురు ఉగ్రవాదులు ఉన్నట్లు గుర్తించారు. వారిని చుట్టుముట్టి ఆపరేషన్ కొనసాగిస్తున్నారు. భద్రతా బలగాలను చూసిన ఉగ్రవాదులు కాల్పులు జరపగా ఓ ఆర్మీ జవాన్ గాయపడ్డారు. ఆయనను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ఉదంపూర్‌లో చిక్కిన ఉగ్రవాదులను జైషే మహ్మద్ ముఠాకు చెందినవారిగా భావిస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఆపరేషన్ కొనసాగుతోంది.

## ఉద్యోగుల పిఎఫ్ బదలీ మరింత సులువు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 20:** ఎంప్లాయి ప్రావిడెంట్‌ఫండ్‌కు సంబంధించి ఇపిఎఫ్ఒ నిబంధనల్ని సులభతరం చేస్తోంది. తాజాగా పీఎఫ్ బదిలీ ప్రక్రియను కూడా సులభతరంచేసింది. కొత్త మార్పులతో ఇప్పుడు పీఎఫ్ బదిలీపై ఉద్యోగులకు మరింత నియంత్రణ, పూర్తి పారదర్శకత లభిస్తుందని చెప్పొచ్చు. పీఎఫ్ ట్రాన్స్‌ఫర్‌కు అనెక్చర్ కె అత్యంత ముఖ్యమైన డాక్యుమెంట్. ఇప్పటి వరకు ఈ డాక్యుమెంట్ కోసం పీఎఫ్ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. అదే కొత్త ఆఫీసుకు పంపించాల్సి వచ్చేది. ఉద్యోగులకు పెద్దగా దీని గురించి సమాచారం కూడా ఉండేది కాదు. అప్పుడు పీఎఫ్ బదిలీ ప్రక్రియలో ఆలస్యమైనా ఏమైనా సమస్యలు వచ్చినా తెలుసుకోవడం కూడా కష్టంగా మారేది. ఇప్పుడు ఇక్కడ భారీ ఊరట లభించింది. ఈ అనెక్జర్ అనే డాక్యుమెంట్ డిజిటల్ కాపీని ఉద్యోగుల పీఎఫ్ పోర్టల్‌లో డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. దీంతో ఉద్యోగులు తమ పీఎఫ్ ట్రాన్స్‌ఫర్ స్టేటస్‌ను కూడా ఎప్పుడైనా ఎక్కడినుంచైనా ట్రాక్ చేసుకోవచ్చు. ఇక్కడ పూర్తి పారదర్శకత ఉంటుందని తెలుసుకోవచ్చు. అప్పుడు ప్రాసెస్‌లో ఎక్కడ ఆలస్యం అవుతుందో తెలుసుకోవచ్చు. మీరు డౌన్‌లోడ్ చేసుకున్న డాక్యుమెంట్‌లో పీఎఫ్ బ్యాలెన్స్, ఉద్యోగ కాలం, ఇతర ఉద్యోగ వివరాలు అన్నీ సరిగ్గా ఉన్నాయో లేదో చెక్ చేసుకోవచ్చు. ఈ పత్రాన్ని డిజిటల్ రూపంలో శాశ్వతంగా భద్రపర్చుకోవచ్చు. భవిష్యత్తులో మీకు ఈపీఎస్ బెనిఫిట్స్ లెక్కించేందుకు కూడా ఉపయోగపడుతుంది. తరచుగా ఉద్యోగాలు మారేవారికి ఈ మార్పు మేలు చేస్తుంది. పీఎఫ్ ట్రాన్స్‌ఫర్‌లో ఆలస్యం నేపథ్యంలో చాలా అకౌంట్లు ఇనాక్టివ్‌గా మారేవి. అప్పుడు డబ్బులు విత్‌డ్రా చేసుకోవడం కూడా కష్టంగా ఉండేది. ఇప్పుడు ఈ సమస్యలు అన్నింటికీ పరిష్కారం లభించిందని చెప్పొచ్చు.

## సిఎం అభ్యర్థిని ప్రకటించకుంటే ఎన్నికల బరిలోకి రాలేం

### ఆర్జేడి చీఫ్ తేజస్వి యాదవ్


**పాట్నా, సెప్టెంబరు 20:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ, ఇండియా కూటమిలో ముఖ్యమంత్రి అభ్యర్థిపై చర్చ మొదలైంది. సీఎం అభ్యర్థిని ప్రకటించకుండా ఎన్నికల బరిలోకి దిగే ప్రసక్తే లేదని ఆర్జేడీ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ముఖం లేకుండా కూటమి ఎన్నికల్లో ఎలా పోటీ చేస్తుంది మేమేమైనా ముఖాలు లేని బీజేపీ వాళ్లమా అని తేజస్వి ప్రశ్నించారు. ఒక స్పష్టమైన నాయకత్వం లేకుండా ప్రజల ముందుకు వెళ్లలేమని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేపట్టిన ఓటర్ అధికార్ యాత్రను రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కొనసాగిస్తున్నారు.

## లాటరీ సొమ్ము రూ.కోటి వేదికపైనే విరాళం ఇచ్చిన మహిళ

**వర్జీనియా, సెప్టెంబరు 20:** అమెరికాలోని వర్జీనియాకు చెందిన ఓ మహిళను అదృష్టం వరించింది. లాటరీలో 1.5లక్షల డాలర్లు (రూ.1.3 కోట్లకు పైనే) గెలుచుకుంది. ఆ సొమ్ము అందుకున్న తర్వాత అదే వేదికపై ఆ మహిళ చేసిన పనికి అక్కడ ఉన్నవారంతా జేజేలు కొట్టారు. ఆమె దాతృత్వాన్ని మెచ్చుకున్నారు. లాటరీలో గెలుచుకున్న మొత్తాన్ని అక్కడికక్కడే విరాళంగా ఇచ్చేసింది. వివరాల్లోకి వెళితే వర్జీనియాకు చెందిన క్యారీ ఎడ్వర్డ్స్ కు ఇటీవల పవర్ బాల్ ప్రైజ్ తగిలింది. లక్షన్నర డాలర్లు గెలుచుకున్న ఎడ్వర్డ్స్ ఎంతో సంతోషించింది. అయితే, కేవలం అదృష్టం కలిసి వచ్చి చేతికందిన సొమ్మును తన స్వార్థం కోసం ఉపయోగించుకోవడం సబబు కాదని భావించింది. తను గెలుచుకున్న డబ్బు నలుగురికీ ఉపయోగపడాలని భావించినట్లు క్యారీ ఎడ్వర్డ్స్ తెలిపింది. దీంతో లాటరీ సొమ్ము మొత్తాన్ని మూడు ఎన్జీవోలకు సమానంగా పంచేసింది.


## గల్ఫ్‌నాటోలో ఇతర అరబ్‌దేశాలు కూడా వస్తాయ్..

### పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 20 :** పాకిస్థాన్, సౌదీ అరేబియా మధ్య కుదిరిన పరస్పర రక్షణ ఒప్పందంలో ఇతర అరబ్ దేశాలు కూడా చేరే అవకాశం లేకపోలేదని పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ తెలిపారు. ఒక దేశంపై దాడి జరిగితే రెండు దేశాల మధ్య జరిగిన దాడిగా పరిగణించే పరస్పర రక్షణ ఒప్పందాన్ని పాకిస్థాన్, సౌదీ అరేబియాల మధ్య జరిగింది. ఒకరోజు పర్యటన నిమిత్తం బుధవారం సౌదీ అరేబియాను సందర్శించిన పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, సౌదీ యువరాజు మొహమ్మద్ బీన్ సల్మాన్ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఖతార్‌లో హమాస్ నాయకులపై ఇజ్రాయెల్ సైనిక దాడులు జరిపిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. పరస్పర రక్షణ ఒప్పందంలో మరిన్ని అరబ్ దేశాలు భాగస్వాములయ్యే అవకాశం ఉందని కచ్చితంగా చెప్పగలనని ఆసిఫ్ చెప్పారు. పాకిస్థాన్‌కు ముప్పు ఎక్కువగా ఉన్న కారణంగా ఇస్లామిక్ దేశాల మధ్య నాటో తరహా ఏర్పాటు ఉండాలని తాను మొదటినుంచి వాదిస్తున్నట్లు ఆసిఫ్ చెప్పారు. తమ ప్రాంతాన్ని, దేశాలను సమైక్యంగా పరిరక్షించుకోవలసిన ప్రాథమిక హక్కు ముస్లిం దేశాలకు, ముఖ్యంగా ముస్లిం ప్రజలకు ఉందని ఆయన తెలిపారు. ఇతర దేశాల ప్రవేశాన్ని అడ్డుకోవడం లేక మరే ఇతర దేశంతో పాకిస్థాన్ ఈ తరహా ఒప్పందం కుదుర్చుకోరాదన్న నిబంధన ఏదీ రెండు దేశాలు చేసుకున్న ఒప్పందంలో లేదని ఆయన స్పష్టం చేశారు. ఒప్పందం కింద పాకిస్థాన్ అణ్వస్త్రాలు కూడా సౌదీకి ఉపయోగపడతాయా అన్న ప్రశ్నకు తమకు ఉన్న సమస్త ఆయుధ సంపత్తి ఒప్పందం కింద సౌదీకి కూడా కచ్చితంగా అందుబాటులో ఉంటుందని ఆసిఫ్ వెల్లడించారు. తమ అణు స్థావరాలను తనిఖీ చేసుకోవచ్చని పాక్ మొదటి నుంచి ఆహ్వానిస్తోందని, తమ దేశం ఎన్నడూ ఏ తప్పు చేయలేదని ఆయన చెప్పారు. మీ రెండు దేశాలలో ఒక దేశంపై దాడి జరిగితే మరో దేశం స్పందిస్తుందా అన్న ప్రశ్నకు అందులో ఎటువంటి అనుమానం ఉండదని, తమలో ఎవరిపైన దాడి జరిగినా మరో దేశం స్పందిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## దసరా సందర్భంగా మధ్యప్రదేశ్‌లో శూర్పణఖ దహనం




**ఇండోర్, సెప్టెంబరు 20:** దసరా పండుగను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా రావణ దహనాలు నిర్వహించే సాంప్రదాయం అనుసరిస్తుంటే మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన ఓ పురుష హక్కుల సంస్థ ఈసారి శూర్పణ దహన కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించింది. భర్తలను పొట్టనపెట్టుకున్న భార్యల తీరుకు నిరసనగా ఈ కార్యక్రమం ఏర్పాటుకు నిశ్చయించినట్టు పౌరుష్ అనే సంస్థ ప్రకటించింది. ఇటీవల హనీమూన్‌లో భర్తను హత్య చేసిన యువతి సోనమ్ రఘువంశీ, భర్తను చంపి డ్రమ్ములో పాతిపెట్టిన మీరట్ యువతి ముస్కాన్‌తో పాటు పలు మహిళా నిందితుల ఫొటోలను దిష్టిబొమ్మపై పెట్టి దహనం చేస్తామని సంస్థ అధ్యక్షుడు అశోక్ దశోరా పేర్కొన్నారు. దిష్టిబొమ్మ మధ్యలో సోనమ్ సూర్యవంశీ ఫొటో పెడతాం. ఆమె ఇండోర్‌కు చెడ్డ పేరు తెచ్చింది. ఆమెతోపాటు భర్తను పొట్టన పెట్టుకున్న ముస్కాన్, నికితా సింఘానియా వంటి మొత్తం 10 మంది మహిళల ఫొటోలు బొమ్మపై ఏర్పాటు చేస్తాం. ఈ సిగ్గుమాలిన చర్యలకు సంకేతాత్మక నిరసనగా దిష్టి బొమ్మ దహనానికి ప్లాన్ చేశామని ఆయన తెలిపారు.

## బేస్‌క్యాంప్‌లు మార్చివేస్తున్న పాక్ ఉగ్రసంస్థలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 20:** పాకిస్థాన్ ప్రేరేపిత జేషై మహమ్మద్, హిజ్‌బుల్ ముజాహిద్దిన్ ఉగ్రసంస్థలు తమ స్థావరాలను మార్చుకుంటున్నాయి. ఇన్నాళ్లూ పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉన్న ఆ సంస్థలు ఇప్పుడు తమ పర్మనెంట్ అడ్డాను ఖైబర్ ఫక్తున్‌క్వాకు మార్చుకుంటున్నట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సింధూర్ అనంతరం ఈ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని భారతీయ రక్షణశాఖ వర్గాలు అనుమానిస్తున్నాయి. చాలా వ్యూహాత్మక రీతిలో ఈ ఉగ్రసంస్థలు తమ స్థావరాలను మార్చుకుంటున్నట్లు తెలుస్తోంది. భారతీయ దాడులకు పీవోకే అనువుగా ఉండడంతో ఆ సంస్థలు తమ స్థావరాలను మరో చోటుకు మారుస్తున్నాయి. ఖైబర్ ఫక్తునక్వా ప్రాంతం ఆఫ్ఘన్ బోర్డర్ సమీపంలో ఉన్న నేపథ్యంలో ఆ ప్రాంతాన్ని సురక్షితంగా భావిస్తున్నాయి.



# విజృంభిస్తోన్న జీవనశైలి వ్యాధులు

## గ్రామాల్లోనూ పెరుగుతున్న బిపి, షుగర్, కిడ్నీ, గుండెజబ్బులు, కేన్సర్లు

## మారిన పరిస్థితులకు అనుగుణంగా వైద్య వ్యవస్థ మారాలి

### వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

**హైదరాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** మారిన ఆహారపు అలవాట్లు, ఒత్తిడితో కూడిన సెడెంటరి లైఫ్ స్టైల్ మూలంగా ప్రస్తుతం జీవనశైలి వ్యాధుల సమస్య ఎక్కువైందని.. అందుకు అనుగుణంగా వైద్య వ్యవస్థలో కూడా మార్పులు రావాల్సిన అవసరం ఉందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. రాష్ట్రంలో కొత్త డయాలసిస్ సెంటర్ల ఏర్పాటుపై వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో శనివారం ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఆఫీస్‌లో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో హెల్త్ సెక్రెటరి క్రిస్టినా జడ్ చొంగ్తు, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవో ఉదయ్ కుమార్, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ ఫణీంద్రరెడ్డి, టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ పాల్గొన్నారు. సమీక్ష సందర్భంగా రాష్ట్రంలో కిడ్నీ జబ్బులు, డయాలసిస్ పేషెంట్ల సంఖ్య పెరుగుతున్న తీరును అధికారులు మంత్రికి వివరించారు. 2009లో డయాలసిస్ సేవలు ప్రారంభించినప్పుడు 1230 మంది డయాలసిస్ పేషెంట్లు ఉంటే ఇప్పుడు ఆ సంఖ్య 12 వేలు దాటిందని అధికారులు మంత్రికి తెలిపారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముందన్నారు. ఇదే అంశంపై మంత్రి మాట్లాడుతూ.. కిడ్నీ, కేన్సర్ జబ్బులు పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో, రాష్ట్రంలో ఒకప్పుడు అంటు వ్యాధుల సమస్య ఉండే దని ఆ వ్యాధుల నియంత్రణకు అనుగుణంగానే మన వైద్య రంగం తయారు చేయబడిందన్నారు. కానీ ఇప్పుడు మారిన పరిస్థితుల నేపథ్యంలో అంటువ్యాధులు తగ్గిపోయి, నాన్ కమ్యునికెబుల్ డిసీజ్‌లు పెరిగిపోయాయన్నారు. ఆహారపు అలవాట్లు, ఒత్తిడితో కూడిన సెడెంటరీ లైఫ్ స్టైల్ వంటి అనేక కారణాల వల్ల గ్రామాల్లో కూడా బీపీ, షుగర్, కిడ్నీ, గుండె జబ్బులు, కేన్సర్లు పెరుగుతున్నాయన్నారు. ఇప్పుడు మారిన పరిస్థితులకు అనుగుణంగా వైద్య వ్యవస్థ మారాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశంపై స్టడీ చేయాలని, ఇతర దేశాల్లో అవలంభిస్తున్న పద్ధతులను పరిశీలించాలని అధికారులకు సూచించారు.
నాన్ కమ్యునికెబుల్ డిసీజ్‌ల నివారణ, నియంత్రణ, చికిత్స అంశాలపై ఎక్కువగా ఫోకస్ చేయాలన్నారు. నాన్ కమ్యునికెబుల్ డిసీజ్‌లు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, ఆరోగ్యకరమైన జీవన విధానంపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. బీపీ, షుగర్లు వస్తే పోయేవి కాదు అని, కిడ్నీ జబ్బులు, కేన్సర్ల చికిత్స ఒక్క రోజుతోనో, ఒక నెలతోనో పూర్తవ్వదన్నారు. ఆయా జబ్బుల బారిన పడిన ప్రజలకు చికిత్స అందించేందుకు అనుగుణంగా మన హాస్పిటల్స్ తయారు కావాలన్నారు. అందులో భాగంగానే ఎన్సీడీ క్లినిక్‌లు, కేన్సర్ డే కేర్ సెంటర్లు పెట్టుకున్నామని గుర్తు చేశారు. డయాలసిస్ పేషెంట్లు మానసికంగా, శారీరకంగా ఎంతో ఇబ్బంది పడుతుంటారని, వారికి పెన్షన్ అందించి కొంత వరకూ ఆర్థికంగా బాసటగా నిలుస్తున్నామని చెప్పారు. ప్రతి గ్రామం, ప్రతి పట్టణానికి సమీపంలోనే అవసరమైన అన్నిరకాల వైద్య సేవలు ఉచితంగా డయాలసిస్ పేషెంట్లకు అందాలన్నారు. డయాలసిస్ కోసం పదుల కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సిన పరిస్థితి, గంటల తరబడి ఎదురు చూడాల్సిన దుస్థితి ఉండకూడదన్నారు. పేషెంట్లతో పాటు ప్రయాణించి, పేషెంట్ల కుటుంబ సభ్యులు ఇబ్బంది పడే పరిస్థితి ఉండొద్దన్నారు. పేషెంట్ ఒక్కరే వెళ్లి గంటల వ్యవధిలోనే తిరిగి ఇంటికి చేరుకునేలా, ప్రతి 20, 25 కిలోమీటర్లకు ఒక డయాలసిస్ సెంటర్ ఉండాలని, ఇందుకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని హెల్త్ సెక్రటరీని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో డిస్పెన్సరీల తో పాటు, పేషెంట్ల సంఖ్య, జనాభాను కూడా పరిగణలోకి తీసుకుని ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఇప్పటికే ఉన్న సెంటర్లలో అవసరమైనచోట మిషన్ల సంఖ్యను పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొత్తగా 16 డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. వీటితో కలిపి ప్రస్తుతం 102 డయాలసిస్ సెంటర్లు ఉన్నాయి. ఈ సెంటర్లలో సుమారు 7550 మంది పేషెంట్లు డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఆరోగ్యశ్రీ కింద ప్రైవేట్ హాస్పిటళ్లలో సుమారు 5060 మందికి ఉచితంగా డయాలసిస్ సేవలు అందిస్తున్నామని అధికారులు మంత్రికి తెలిపారు.

## డిజిపి కార్యాలయంలో యోగ, ధ్యానంపై

# ముగిసిన శిక్షణా తరగతులు

**హైదరాబాద్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:** డిజిపి కార్యాలయంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది కోసం యోగ, ధ్యానంపై ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులు శనివారం నాడు ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డిజిపి జితేందర్ మాట్లాడుతూ పోలీసులు విధి నిర్వహణ అనేక సవాళ్లతో కూడుకున్నదని అన్నారు. ఇదే సమయంలో అనేక సందర్భాలలో పోలీసులు ఒత్తిడిని ఎదుర్కొనవలసిన వుంటుందని వీటిని అధిగమించడంలో యోగాతో పాటు ధ్యానం ఎంతగానో సహకరిస్తాయని ఆయన తెలిపారు. పోలీసులు విధి నిర్వహణలో ఎంత ఒత్తిడి వున్నా కొంత సమయం యోగతో పాటు ధ్యానం కోసం సమయం కేటాయించాలని ఆయన కోరారు. దీనివల్ల పోలీసులు ఆరోగ్యాన్ని కాపాడుకో వడంతో పాటు మానసికంగా మరింత దృడంగా వుండగలరని ఆయన అన్నారు. శారీరకంగా మరింత ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లేందుకు వీలు ంటుందని డిజిపి తెలిపారు. ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న విధులు నిర్వహించడం ఎంతో ముఖ్యమైన అంశంగా ఆయన చెప్పారు. యోగ, ధ్యానం వల్ల ఇవన్నీ సాధ్యమవుతాయని ఆయన తెలిపారు. ఈ తరహా శిక్షణ తరగతులు పోలీసుల దైనందిన జీవనంలో ఎంతగానో ఉపయోగపడతాయని డిజిపి తెలిపారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ శాంతి, శ్రేయస్సు, మానవతా విలువలను పెంపొందించే కార్యక్రమాలను నిర్వహిస్తుందని ఆ యన అన్నారు. వారం రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమం వల్ల పోలీసులు అనేక విషయాలను నేర్చుకున్నారని డిజిపి తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు శ్వాస సాధన, సుదర్శన క్రియ తదితర అంశాలపై చక్కటి అవగాహన ఏర్పడిందని డిజిపి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ విభాగం అదనపు డిజి అనిల్ కుమార్‌తో పాటు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

# బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు

### పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రజలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. మహిళల ఆరాధన పండుగగా, తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ ప్రత్యేకతను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి ఆడబిడ్డలంతా ఒకచోట చేరి ఆటపాటలతో ఆనందంగా జరుపుకొనే ఈ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని అన్నారు. బతుకమ్మ పండుగ మన తెలంగాణ ఆచార వ్యవహారాలకు ప్రతిబింబమని, తెలంగాణ మహిళల ఆరాధన, ఆనందానికి ఇది ఒక చిహ్నమని ఆయన పేర్కొన్నారు. ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమై సద్దుల బతుకమ్మతో ముగిసే ఈ పండుగను గ్రామీణ,పట్టణ భేదం లేకుండా అన్ని చోట్లా ఘనంగా జరుపుకోవడం మన సాంప్రదాయం బలాన్ని చాటుతోందని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. బతుకమ్మ పండుగ ద్వారా తెలంగాణ సాంప్రదాయం, సాంస్కృతిక వారసత్వాన్ని తరతరాలకు అందిస్తున్నామని, ఈ పండుగ తెలంగాణ సాంస్కృతిక వారసత్వానికి ఒక బ్రాండ్‌గా నిలిచిందని తెలిపారు.

# నేలకేసి కొట్టి చిన్నారిని చంపిన తండ్రి

### మద్యం మత్తులో దారుణం



**సూర్యాపేట, సెప్టెంబరు 20, ప్రభాతవార్త :** మద్యం మత్తులో 12 నెలల చి న్నారిని ఓ కసాయి తండ్రి నేలకేసి కొట్టి చంపాడు. ఈ దారుణ ఘటన సూర్యాపేట జిల్లాలో ఇవాళ ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని ప్రియాంక కాలనీలో జరిగిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. భార్యాభర్తలు గొడవ పడుతుండగా గట్టిగా ఏడుస్తున్న చిన్నారి భవిజ్ఞ(1)ని కన్నతండ్రి, రెండుకాళ్లు పట్టి నేలకేసి కొట్ట డంతో తలకు తీవ్రగాయాలై అపస్మారక చితికి చేరుకుంది. కొనఊపిరితో ఉన్న పాపను తల్లి, బంధువులు ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందింది. హత్య చేసి పరారైన నిందితున్ని స్థానికులు పట్టుకుని పోలీ సులకు అప్పగించారు. కన్నతండ్రి చేతుల్లో చిన్నారి మృతి చెంద డంతో బంధు వులు విలపిస్తున్న తీరు అందరినీ కలిచివేసింది. అతనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# జిఓ 68 రద్దుకు బిజెపి మద్దతు

### పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:** తెలంగాణ అవుట్‌డోర్ మీడియా ఓనర్స్ సమస్యలు జిఓ 68 రద్దుకు బిజెపి మద్దతు ఇస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పేర్కొన్నారు. శనివారం తెలంగాణ అవుట్‌డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్‌తో సమావేశమై, వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి జిఓ 68 రద్దుకు పూర్తి మద్దతు ప్రకటిస్తూ, చిన్న హోర్డింగ్ ఏజెన్సీల జీవనోపాధికి భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎన్.రాంచందర్ రావు మాట్లాడుతూ 2020లో అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం జిఓ 68ని ప్రవేశపెట్టింది. ఈ జిఓ ఫలితంగా చిన్న ఏజెన్సీల కార్యకలాపాలు రద్దు కావడంతో పాటు జిహెచ్ఎంసి ప్రాంతంలో సేవలను బహిష్కరించారు. ఈ జిఓ మూడు పెద్ద ఏజెన్సీలకే ప్రయోజనం చేకూర్చడానికి మాత్రమే రూపొందించడం తీవ్ర అన్యాయం చేయడమే అన్నారు.
చిన్న హోర్డింగ్ ఏజెన్సీలు ఇంకా పనిచేస్తున్న ఇతర మున్సిపల్ కార్పొరేషన్లలో కూడా, రాష్ట్ర ప్రభుత్వం వాటి హోర్డింగ్‌లను తొలగించడానికి ప్రయత్నిస్తుందన్నారు. దీని కారణంగా సుమారు 50,000 కుటుంబాల జీవనోపాధి ప్రభావితమవుతుందన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే జిఓ 68ని రద్దు చేయాలని అవుట్‌డోర్ మీడియా ఓనర్స్‌కు మద్దతుగా బిజెపి డిమాండ్ చేస్తుంద న్నారు. గత ఎన్నికలకు ముందు, కాంగ్రెస్ పార్టీ ఈ సమస్యను అంగీక రించి, తన మేనిఫెస్టోలో హామీ ఇచ్చిం ది. అయితే, 21 నెలలూ అధికారంలో ఉన్నప్ప టికీ, ఈ సమస్యను పరిష్కరించలేదు. హోర్డింగ్ పరిశ్రమపై అధికార పార్టీ గుత్తాధిప త్యాన్ని ఆపాలన్నారు. పరిశ్రమపై ఆధారపడిన కుటుంబాలకు జీవనోపాధి కోల్పోకుండా భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.



# గిరిజన తెగలకు సమన్యాయమే ప్రభుత్వం లక్ష్యం

### మాజీ ఎంపి రవీందర్‌నాయక్

**హైదరాబాద్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:** గిరిజన తెగలకు సమన్యాయం చేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని మాజీ ఎంపీ రవీందర్ నాయక్ అన్నారు. గాంధీ భవన్‌లో మాట్లాడుతూ ఇందిరా పార్కు దగ్గర ధర్నా చేసిన గిరిజనులు తెలుసుకోవాల్సిన అంశం ఏమిటంటే తెలంగాణలో 10 శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నని తెలిపారు.
కొన్ని తెగలకు అన్యాయం జరిగితే ఖచ్చితంగా కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తుందని తెలిపారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నారనీ గిరిజనులు ఆరు గ్యారంటీలను సద్వినియోగం చేసుకుం టున్నారని తెలిపారు. సమైక్యాంధ్ర ప్రదేశ్ లో గిరిజనులకు 6శాతం రిజర్వేషన్లున్నవని రేవంత్ ముఖ్యమంత్రి అయ్యాక గిరిజనుల కష్టాలను సోనియాగాంధీ గుర్తించింది10 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని నిర్ధేశించారని అది ఇక్కడ ఆచరిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అమలు చేస్తుండని చెప్పారు.

# రామగుండం థర్మల్ పవర్‌కు ఎనర్జీ ఎఫిషియన్సీ అవార్డు

**హైదరాబాద్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని రామగుండం నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ)కు ప్రతిష్టాత్మక కాన్ఫ డరేషన్‌ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) ఎక్స లెంట్ ఎనర్జీ ఎఫిషియెన్సీ ప్లాంట్ అవార్డును గెలుచుకుంది. ఇంధన సామర్థ్యం, పర్యావరణ నిర్వహణ, కార్యాచరణ విశ్వసనీయతలో దాని సమర్థతను గుర్తిసూ ఈ అవార్డుకు ఎంపిక చేసింది. దీంతో రామగుండంలోని నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ ఐదవసారి ఎక్సలెంట్ ఎనర్జీ ఎఫిషియెన్సీ ప్లాంట్ అవార్డును గెలుచుకుంది. ఈ ప్లాంట్ స్థిరమైన మరియు వినూత్న పద్ధతులకు ప్రమాణాలను నిర్దేశిస్తూనే ఉంది. ఈ మేరకు హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో జరిగిన కార్యక్రమంలో అవార్డును ప్రదానం చేశారు. ఎన్టీపీసీ రామగుండం తరపున అధికా రులు వంశీ కృష్ణ, సతీష్, సచిన్ బైవార్ ఈ అవార్డును అందుకున్నారు. ఇంధన సామర్థ్యంలో రామగుండం ఎన్‌టిపిసి ప్రమాణాలను నెలకొల్పుతూనే ఎన్టీపీసీ ఇడి చందన్‌కుమార్ ఉంటుందన్నారు.

# అత్యాధునిక టెక్నాలజీతో పామాయిల్ ఫ్యాక్టరీ

## ట్రయల్ రన్ విజయవంతం

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:** దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టినట్టు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్రంలోని సిద్దిపేట జిల్లా నర్మేట్టలో ఆయిల్ ఫెడ్ 300 కోట్లతో నిర్మాణం చేసిన పామాయిల్ ఫ్యాక్టరీని శనివారం పరిశీలించిన అనంతరం ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం దీర్ఘకాలిక లక్ష్యంతో దీని నిర్మాణం చేపట్టారన్నారు. త్వరలోనే దీన్ని సీఎం చేతుల మీదుగా ప్రారంభించడం జరుగుతుందని చెప్పారు. ఆయిల్ ఫామ్ సాగు తో దీర్ఘకాలిక లాభాలు ఉంటాయని, అంతర పంటల సాగుతో అదనపు లాభాలు రైతులకు లభిస్తాయని వెల్లడించారు. రాష్ట్రం ఆర్థిక భారం పడిన సరే రైతులకు లాభం జరగాలనే ఉద్దేశ్యంతో నిర్మాణం పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఇక్కడ కాయ నుంచే కాకుండా, విత్తనాల నుంచి కూడా ఆయిల్ తీసే విధానం కూడా ఉందన్నారు. ఫ్యాక్టరీకి కావలసిన విద్యుత్‌ను ఇందులో వెలువడే వ్యర్థాలతో తయారు చేస్తారని తెలిపారు. రైతులకు ట్రాన్స్ పోర్టు చార్జీలు చెల్లింపులో జరుగుతున్న జాప్యాన్ని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు సకాలంలో ఎరువులు వాడాలని సూచించారు. వీటిల్లో అంతర పంటగా కోకో, జాజి, మెకడామియం, మునగ లాంటి వాటిని వేయడం వల్ల రైతులకు అదనపు లాభం చేకూరుతుందన్నారు. ప్రస్తుతం రూ.19,107 ఉన్న ధర, త్వరలో రూ.20 వేలుగా అవ్వాలని చెప్పారు. గెల సైజు పెద్దగా, ఆకు సైజు చిన్నగా ఉండేలా మేలురకం మొక్కలని ఎంత ఖర్చు అయిన రైతులకి అందించి సాగు, దిగుబడి పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు.

# అచ్చంపేట లిఫ్ట్ ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఆగదు

### అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ

**హైదరాబాద్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:** అచ్చంపేట లిఫ్ట్‌ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రాజెక్టు కట్టి తీరుతామని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ తెలి పారు. గాంధీభవన్‌లో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ 2023 ఎన్నికల నోటిఫికేషన్ ముందు రోజు అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్ అడ్మినిస్ట్రేషన్ సాంక్షన్ తెచ్చారనీ మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడిన మాటలు పూర్తిగా అవాస్తవం అని ఆయన అన్నారు. నేను గెలిచాక పనులు మొదలు పెడితే నిరంజన్ రెడ్డి కోర్టుకు వెళ్లి పనులు ఆపారని ఇప్పుడు ఆ ప్రాజెక్టు వద్దు అంటున్నారని ఆయన అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం లో పాలమూరు జిల్లాకు ఏమి చేయలేదనీపాలమూరు రంగారెడ్డి ప్రారంభించింది మేమే అని ఆయన ప్రకటించారు. బిఆర్ఎస్ హాయంలో ఒక్లీ కాళేశ్వరం కట్టి కులేశ్వరం చేశారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రానికి ఆంధ్రప్రాం తం ముఖ్యమంత్రులు వంద రూపాయలు నష్టం చేస్తే కెసిఆర్ తెలంగాణ కు వెయ్యి రూపాయలు నష్టం చేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై అక్కసు వెళ్లగక్కడం కోసంగత పది సంవత్సరాలలో అక్కమాదేవి టూరిజం క్లేవ్స్ ను పట్టించుకోలేదని విమర్శించారు. వనపర్తి ఎమ్మెల్యే మెఘారెడ్డి మాట్లాడుతూ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో, పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్‌ను మట్టి కరిపించిన మగాడు రేవంత్‌రెడ్డి అని వర్ణించారు. గ్రూప్-1 కు 3కోట్లు డబ్బులు తీసుకున్నారని కెటిఆర్ ఆరోపణలపై అభ్యర్థుల తల్లి దండ్రులు స్పందించి కేసు పెట్టారని అన్నారు. ఇప్పటికైన కెటిఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 2023 ఎన్నికల్లో బిఆర్ఎస్ ను కర్రు కాల్చి వాత పెట్టిన ఇంకా బుద్ధి రాలేదని అన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు లో నీళ్ల ఎత్తుకోవడానికి ప్రజలు అందరూ చెంబులు, బకెట్లు, బిందెలు తెచ్చుకోమని కెసిఆర్ అన్నడుఒక్క మోటారు స్టార్ట్ చేశారు అది కూడా ఆగిపోయింది అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరురంగారెడ్డి కి 6868 కోట్లు సాంక్షన్ చేశారని గుర్తుచేశారు. పాలమూరు బిడ్డగా రేవంత్ రెడ్డి ప్రాజెక్టును పూర్తి చేస్తారనిజోస్యం చెప్పారు. నెట్టెం పాడు, బీమా ప్రాజెక్టు లు కాంగ్రెస్ హాయాంలో ప్రారంభమైనవి అయితే బిఆర్ఎస్ వాళ్లు వాళ్ల ఖాతాలో వేసుకోవాలని చూస్తున్నారని అన్నారు.

## బతుకమ్మ యంగ్ ఫిల్మ్‌మేకర్స్ ఛాలెంజ్‌లో

# సృజనాత్మకతను ప్రపంచానికి చాటండి



పోటీల పోస్టర్, బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితర నిర్వాహక సిబ్బంది

### యువకళాకారులకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పిలుపు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), సెప్టెంబరు 20, ప్రభాతవార్త :** రాష్ట్రవ్యాప్తంగా యువ కళాకారులు తమలోని సృజనాత్మకతను ప్రపంచానికి చాటడానికి మహత్తర అవకాశమే బతుకమ్మ యంగ్ ఫిల్మ్‌మేకర్స్ ఛాలెంజ్ పోటీలన్న రాష్ట్ర సినిమాటోగ్రఫీ, రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ పోటీల్లో అధిక సంఖ్యలో యువత పాల్గొని ప్రతిభను కనబర్చండని పిలుపు నిచ్చారు. ఈ మేరకు రాష్ట్ర సినిమాటోగ్రఫీశాఖ ఆధ్వర్యంలో ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బతుకమ్మ యంగ్ ఫిల్మ్‌మేకర్స్ ఛాలెంజ్ పోటీల బ్రోచర్, పోస్టర్‌లను మంత్రి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఎఫ్‌డిసి ఛైర్మన్ దిల్‌రాజ్‌ను మంత్రి అభినందించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజాప్రభు త్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు, యువకళాకారుల ప్రతిభ వెలుగులోకి తెచ్చేం దుకు ఈ పోటీలు సరైన వేదిక కానుందన్న ఆశాభావాన్ని వ్యక్తపరిచారు.
ప్రజాప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ (మహిళలకు ఉచిత బస్సు, మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ తదితరాలు), తెలం గాణ చరిత్ర, సంస్కృతి, పండుగలు, కళారూపాలపై షార్ట్‌ఫిలిమ్స్, పాటల పోటీలు ఉంటాయని, షార్ట్‌ఫిలిమ్స్ నిడివి 3 నిముషాలకు, పాటల వ్యవధి 5 నిముషాలకు మించి ఉండకూడదని వివరించి పోటీలకు సంబం ధించిన అర్హతలు వివరించారు. ఎంట్రీలను వాట్సాప్ నంబరు 8125834009 పం పాలని, తుది గడువు సెప్టెంబరు 30, 2025 అని స్పష్టం చేశారు. నిర్దేశిత గడువులోగా వచ్చిన ఎంట్రీలను నిపుణులతో కూడిన జ్యూరీ వీక్షించి వివిధ కేటగిరీలలో ఎంపికలు పూర్తి చేస్తుందని నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో ఎంపికైన థీమ్స్‌కు ప్రథమ బహుమతి 3లక్షలు, ద్వితీయ బహుమతి 2లక్షలు; తృతీయ బహుమతి లక్ష; కన్సొలేషన్ బహుమతి 20వేలు అయిదుగురికి ఇస్తారని, నగదుతోపాటు విజేతలందరికీ ప్రశంసాపత్రం, జ్ఞాపిక ప్రదానం చేస్తారని పేర్కొన్నారు.

# ఉద్యోగుల జీతాల్లో కోత

### సంక్షేమ గురుకులాల్లో కట్

### ఇప్పటికే హైడ్రా సిబ్బంది జేబుకు కత్తెర

### రాష్ట్ర ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:** పండుగల వేళ ప్రభుత్వ ఉద్యోగులకు జీతాల పెంపు, బోనస్ వంటి శుభవార్తలు ఉంటాయి. కానీ రాష్ట్రంలోలో మాత్రం విచిత్రం జరుగుతోంది. జీతాలు పెంచడం కాకపోగా వేతనాల్లో కోత విధించడం గమనార్హం. జేబు నింపే పని చేయాల్సి ఉండగా జేబుకు కత్తెర వేస్తోంది. ఇప్పటికే హైడ్రా సిబ్బంది జీతాల్లో రాష్ట్ర కోత వేసింది. తాజాగా మైనార్టీ సంక్షేమ గురుకులాల ఉపాధ్యాయులు, సిబ్బంది జీతాలను భారీ కట్ చేసింది. ఈ మేరకు వేతనాలను సవరిస్తూ తాజాగా రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ వ్యవహారం తెలంగాణలో సంచలనం రేపుతోంది. సంక్షేమ శాఖ గురుకులాల్లోని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైం ఉద్యోగులు వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్‌పై పోరాటం కొనసాగుతోంది. ఆందోళన చేపడుతున్నారనే సాకుతో ఏకంగా వారి వేతనాలను ప్రభుత్వం తగ్గించింది. జూనియర్ అధ్యాపకుడికి (జేఎల్)కు రూ.35 వేల జీతం ఉండగా, సర్కార్ దాన్ని రూ.23,400కు తగ్గించింది. అంటే రూ.11,600 వేతనాన్ని కోత వేసింది. పీజీటీలకు రూ.31,395 నుంచి రూ.18,200కు, టీజీటీలకు రూ.28,660 నుంచి రూ.18,200కు తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది.
పెండింగ్ జీతాలు విడుదల చేయాలని కోరిన ఉద్యోగుల జీతాల్లో కోత వేసింది. తగ్గించిన జీతాలు చూస్తే ఉన్నతాధికారుల వద్ద డ్రైవర్లుగా పనిచేస్తున్నవారి కంటే చాలా తక్కువ ఉండడం గమనార్హం. ఔట్‌సోర్సింగ్ విభాగంలో సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, కుక్‌లు, కంప్యూటర్ టీచర్లు, పీడీలు, పీఈటీలు తదితర సిబ్బంది జీతాలను కూడా భారీగా తగ్గించింది. కాగా తెలంగాణ మైనార్టీ గురుకుల సొసైటీలో 204 గురుకులాలు ఉన్నాయి. వాటిలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో దాదాపు 3,756 మందిని నియమించుకునేందుకు ప్రభుత్వం అనుమతులు జారీ చేసింది. వీటిలో టీచింగ్ విభాగంలో ప్రిన్సిపాల్, జూనియర్ లెక్చరర్ (జేఎల్), టీజీటీ, పీజీటీ పోస్టులు ఉన్నాయి. గతంలో జేఎల్‌కు రూ.35 వేలు, పీజీటీ, టీజీటీలకు రూ.27 వేల వేతనం చెల్లించేవారు. కేసీఆర్ ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బందికి 30 శాతం పీఆర్సీని వర్తింపజేసింది. కానీ ఆ జీతాలను తగ్గించడం వివాదంగా మారింది.

## ఎంబిబిఎస్, బిడిఎస్ కౌన్సెలింగ్‌లో బిసి, ఎస్సీ, ఎస్టీలకు

# రిజర్వేషన్ల అమలులో అన్యాయం

### ఉపముఖ్యమంత్రి భట్టి దృష్టికి

### ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త :** ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లు కౌన్సిలింగ్‌లో బిసి, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల అమలులో అక్రమాలు జరుగు తున్నాయని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు శనివారం బిసి సంఘాల నేతలు నీల వెంకటేష్, మనికంఠ, అనంతయ్య, రవి కుమార్ యాదవ్, అర వింద్, శ్రీనివాస్, రాజేందర్, సతీష్, శివ యాదవ్, నరేష్ గౌడ్ తిరుపతి, వంశీ, రామ చందర్ తదితరులతో కలిసి భట్టి విక్రమార్క తో మాట్లాడి వినతి పత్రం అందజేశారు. మెరిట్‌లో వచ్చి ఓపెన్ కాంపిటేషన్‌లో వచ్చిన అభ్యర్థులను రిజర్వేషన్లు చేర్చి ఈ వర్గాలకు రావలసిన కోటాను తగ్గిస్తున్నారని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం జిఎం నం. 500ను 2004లో జారీచేసి అమలుచేశారు. 2021 నుంచి జీవోను పక్కకు కొత్త జీవో 144 తెచ్చి కాలేజీ ఆప్షన్ పేరు మీద ఈ వర్గాలకు అన్యాయం చేస్తున్నారని కృష్ణయ్య భట్టి దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం హెల్త్ యూని వర్సిటీ అధికారులు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 550 జీవోను అమలు చేస్తున్నట్లు నటిస్తూ తూట్లు పొడుస్తున్నారు. 18 నెలలుగా ఎస్సీ ఎస్టీ బిసి హాస్టళ్ళ మెస్ బిల్లులు, 28 నెలలుగా హాస్టల్ అద్దె చెల్లించడం లేదని, వెంటనే అద్దె భవనాల బిల్లులు మంజూరు చేయాలని కృష్ణయ్య కోరారు. స్పందించిన డిప్యూటీసిఎం భట్టి మెస్ బిల్లులు, హాస్టల్ అద్దెబిల్లులు వారం రోజుల్లో చెల్లిస్తామని, రిజర్వేషన్లు అమలు అక్రమాలు సరిదిద్దే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



విద్యార్థుల సమస్యలపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపి కృష్ణయ్య

## ఆడబిడ్డలకు సిఎం 'బతుకమ్మ' శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 20:** తెలంగాణ ఆడబిడ్డలందరికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధిస్తూ మహిళలు అత్యంత వైభవంగా నిర్వహించుకునే గొప్ప పండుగ బతుకమ్మ అని అన్నారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయలకు ఆడపడుచుల ఔన్నత్యానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ఆడపడుచులందరూ కలిసి సంతోషంగా జరుపుకోవాలని సీఎం ఆకాంక్షించారు. తెలంగాణ సామూహిక జీవన విధానానికి, కష్టసుఖాలను కలిసి పంచుకునే ప్రజల ఐక్యతకు ఈ పండుగ నిదర్శనం అని అన్నారు. ఎంగిలిపూల నుంచి సద్దుల వరకూ తొమ్మిది రోజులు బతుకమ్మ ఆట పాటలతో అందరూ వైభవంగా ఈ పండుగను జరుపుకోవాలన్నారు. రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని, అందరూ ఆనందంగా ఆరోగ్యంగా ఉండాలని గౌరమ్మను సీఎం ప్రార్థించారు.

### ప్రజలకు కెసిఆర్ బతుకమ్మ శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 20:** తెలంగాణ అస్తిత్వానికీ, సాంస్కృతిక జీవనానికి బతుకమ్మ తర తరాల ప్రతీకగా నిలిచిందని, పూలను దేవతగా కొలిచే బతుకమ్మ పండుగ, ప్రపంచ సంస్కృతీ సాంప్రదాయాల్లో తెలంగాణ ప్రత్యేకతను చాటుతున్నదనీ,. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలిపారు. ఆదివారం నుండి ప్రారంభమవుతున్న ఎంగిలి పూల బతుకమ్మ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఎంగిలి పూలతో ప్రారంభమై సద్దులతో ముగిసే తొమ్మిది రోజుల బతుకమ్మ పండుగ, పల్లెలు పట్టణాలో.. మహిళలు పిల్లా పాపలతో ప్రత్యేక సాంస్కృతిక సందడి నెలకొంటుందని కేసీఆర్ తెలిపారు. సబ్బండ వర్గాల భాగస్వామ్యంతో, నాటి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో, తెలంగాణ అస్తిత్వ ఆకాంక్షలకు బతుకమ్మ ప్రధాన సాంస్కృతిక వేదికగా నిలిచిందని కేసీఆర్ గుర్తు చేసుకున్నారు.

### పూల పండుగ శుభాకాంక్షలు: మంత్రి పొన్నం

**హైదరాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** పల్లెకు కొత్త అందాన్ని తీసుకొచ్చే పూల పండుగ బతుకమ్మ పండుగ అని.. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి ఆడబిడ్డలంతా ఓచోట చేరి ఆటపాటలతో ఆనందంగా జరుపుకొనే తెలంగాణ సాంస్కృతిక ప్రతీక బతుకమ్మ సందర్భంగా తెలంగాణ ఆడపడుచులందరికీ బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమై.. సద్దుల బతుకమ్మతో ముగిసే పండగను ఆడబిడ్డలంత ఒక దగ్గరికి చేరి పిల్లాపాపలతో కుటుంబ సభ్యులంతా ఆనందోత్సాహాల మధ్య ఆటపాటలతో ప్రజల జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు.

### సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక..

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:** తెలంగాణ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక బతుకమ్మ పండుగ అని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం నుంచి బతుకమ్మ పండుగ మొదలవుతున్న సందర్భంగా తెలంగాణ ఆడబిడ్డలందరికీ మంత్రి 'ఎంగిలిపూల' బతుకమ్మ శుభాకాంక్షలు మంత్రి తెలిపారు. 'ఎంగిలి పూల' బతుకమ్మతో మొదలై 'సద్దుల బతుకమ్మ' వరకు తీరొక్క పూలతో ప్రకృతినే దైవంగా పూజించే గొప్ప పండుగ అని తెలిపారు. తరతరాలుగా మహిళా సామూహిక శక్తికి, ఐక్యతకు దర్పణం బతుకమ్మ పండుగనీ, సాయుధ రైతాంగ పోరాటంలో, రాష్ట్ర సాధన కోసం సాగిన సాంస్కృతిక ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజల అస్తిత్వ ఆకాంక్షలకు వేదికగా నిలిచిందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళల అభివృద్ధి కోసం ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు.

# తొమ్మిది రోజుల 'బంగారు బతుకమ్మ'

## నేటి నుంచి సంబురాలు ఆరంభం

## 30న సద్దుల బతుకమ్మతో ముగింపు



**హైదరాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని మహిళలు జరుపుకునే పూల పండుగ బతుకమ్మ. తొమ్మిది రోజులపాటు రోజుకొక్క తీరుగా పండుగను జరుపు కుంటారు. మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మతో ప్రారంభమై.. తొమ్మిదవ రోజున సద్దుల బతుకమ్మతో పూల పండుగను పూర్తి చేస్తారు. తెలంగాణ మహిళలు జరుపుకునే పూల పండుగ బతుకమ్మ.. ప్రతి సంవత్సరం భాద్రపద అమావాస్య (మహాలయ అమావాస్య), పెత్ర అమావాస్య(సెప్టెంబర్ 21)తో ప్రారంభమై తొమ్మిది రోజుల పాటు గౌరీదేవిని అత్యంత భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తూ పండుగను కొనసాగిస్తారు. ఈ పండుగలో వివిధ రకాల పూలను ఏర్చి, గౌరమ్మను పూజించి, ఆటపాటలతో ప్రకృతిని ఆరాధిస్తారు. చివరగా "సద్దుల బతుకమ్మ"తో ఈ పండుగ ముగుస్తుంది. బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి, గౌరీదేవిని పూజిస్తారు. ఈ పండుగ ప్రకృతిని, ముఖ్యంగా మహిళలను గౌరవించే ఒక రూపం. నేడు(సెప్టెంబర్ 21) పెత్ర అమావాస్య రోజు నుంచి తెలంగాణలో బతుకమ్మ పండుగ ప్రారంభమవుతుంది. సెప్టెంబర్ 30వ తేదీ వరకు గౌరీ దేవిని రోజుకోక రూపంలో 9 రోజుల పాటు 9 రూపాల్లో పూజిస్తారు.

అమ్మవారికి నైవేద్యంగా పితృ పక్షం మహాలయ అమావాస్య రోజున బతుకమ్మ మొదటి రోజు వేడుక జరుపుకుంటారు. ఈ రోజున చాలా మంది తమ పెద్దలను, పూర్వీకులను గుర్తు చేసుకుంటూ ధార్మిక కార్యక్రమాలు నిర్వహించి, ఆ తర్వాత భోజనం చేసి బతుకమ్మను తయారు చేస్తారు. ఈ ఎంగిలి పూల బతుకమ్మ పండుగలో భాగంగా మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మగా అమ్మవారిని ఆరాధిస్తారు.

బతుకమ్మ రోజున గౌరీ దేవికి సమర్పించే నైవేద్యం ప్రత్యేకంగా తయారు చేస్తారు. ఈ నైవేద్యంలో నువ్వులు, బియ్యం పిండి, నూకలు కలిపి, తులసి ఆకులు, వక్కలు వంటివి నైవేద్యంగా గౌరీ దేవి అమ్మవారికి సమర్పిస్తారు.

### తొమ్మిది రోజులు తొమ్మిది పేర్లు

మొదటి రోజు బతుకమ్మను ఎంగిలిపూల బతుకమ్మ అంటారు. రెండో రోజు అటుకుల బతుకమ్మ.మూడో రోజు ముద్దపప్పు బతుకమ్మ. నాలుగోరోజు నానబియ్యం బతుకమ్మ. అయిదో రోజు అట్ల బతుకమ్మ. ఆరో రోజు అలిగిన బతుకమ్మ అంటారు. ఆరోజు అమ్మవారు అలకలో ఉంటుందని నమ్మి, బతుకమ్మ ఆట ఆడరు. ఏడోరోజు వేపకాయల బతుకమ్మగా ప్రసిద్ధి. సకినాల పిండిని వేపకాయల్లాచేసి నైవేద్యంగా పెట్టటం వల్ల ఆ పేరు వచ్చింది. ఎనిమిదో రోజు వెన్నముద్దల బతుకమ్మ అని పిలుస్తారు. దేవేరికి వెన్నతో తయారుచేసిన నువ్వుండలను నైవేద్యంగా సమర్పిస్తారు.

తొమ్మిదోరోజు సద్దుల బతుకమ్మ అంటారు. ఆరోజు మహిళలంతా సాంప్రదాయ పద్ధతులతో ముస్తాబై బతుకమ్మ పండుగను చాలా ఉత్సాహంగా జరుపుకుంటారు. ఇలా అమ్మవారికి సమర్పించే నైవేద్యాన్ని బట్టి ఆరోజు బతుకమ్మను పిలవటం అలవాటు. తొమ్మిది రోజులూ ముగిశాక .. పోయిరా బతుకమ్మ పోయిరావమ్మా.. మల్లొచ్చె యాడాది తిరిగి రావమ్మా అని వీడ్కోలు పలుకుతూ సద్దుల బతుకమ్మ పండుగను జరుపుకుంటారు.

### ఆరంభ వేడుకలకు మంత్రులు జూపల్లి, కొండా సురేఖ, సీతక్క

#### మహిళలకు చిన్న బతుకమ్మ వేడుకల శుభాకాంక్షలు: మంత్రి సురేఖ

**హైదరాబాద్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:** ఆడబిడ్డల ఆత్మగౌరవ అడ్డ... ఓరుగల్లు గడ్డ మీద నుంచి బతుకమ్మ సంబురాలు షురూ కానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నిర్వ హించనున్న బతుకమ్మ వేడుకలు వరంగల్ పట్టణంలోని వెయ్యి స్తంభాల గుడిలో ప్రారంభం కానున్నాయి. అయితే, ఆరంభ వేడుకల్లో రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, ధనసరి అనసూయ సీతక్క పాల్గొననున్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర మహిళలకు చిన్న బతుకమ్మ వేడుకల శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం ఈ ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు. సకల జనులు, సబ్బండ వర్ణాలు కలిసి ఐక్యత స్ఫూర్తిని చాటేలా రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు రూపొం దిందన్నారు. చారిత్రక ప్రదేశాలు, ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, వారసత్వ కట్టడాలు, పర్యా టక ప్రాంతాల్లో తొమ్మిది రోజులపాటు బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నహాలు చేసిందని మంత్రి కొండా సురేఖ తెలిపారు.

# అనుమానంతో భార్య గొంతు కోసి హత్య

## నిందితుడు పరార్

## గాలిస్తున్న పోలీసు బృందాలు

**హైదరాబాద్ (కుషాయిగూడ), సెప్టెంబరు 20, ప్రభాతవార్త:** భార్యపై అనుమానంతో రాత్రి నిద్రపోతున్న సమయంలో కత్తితో ఆమె గొంతు కోసి కిరాతకంగా హత్య చేసి పారి పోయిన ఓ భర్త ఉదంతం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో సంచలనం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాధికా చౌరస్తా అనుపురం వద్దనున్న ఓ భవనంలో మంజుల (35)అనే మహిళను ఆమె భర్త బోడ శంకర్ (48)శుక్రవారం అర్ధరాత్రి ఆమె నిద్రిస్తున్న సమయంలో గొంతుకోసి హత్య చేసి పారిపోయాడు. నిందితుడు యాదాద్రి జిల్లా అడ్డగూడూరు ప్రాంతానికి చెందిన బోడ బుచ్చయ్య కుమారుడు బోడ శంకర్ (48) మొదటి భార్యను వదిలేసి 20 సంవత్సరాల క్రితం మంజులను వివాహమాడి జీవనోపాధి కోసం ముంబై వలస వెళ్లాడు. బోడ శంకర్, మంజులకు కెవైన్, ప్రిన్స్ ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇదిలా ఉండగా భార్య మంజులపై అనుమానంతో భర్త శంకర్ ప్రతినిత్యం గొడవ పడుతూ వస్తున్నాడు. ఈ మధ్య గొడవలు తీవ్రమై భార్యను చంపే ప్రయత్నం చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో మంజుల కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాధిక చౌరస్తాలో నివాసముంటున్న తన అక్క రాణి వద్దకు ఈనెల 14న వచ్చింది. నిందితుడు సైతం ఈ నెల 19 శుక్రవారం తన భార్య ఉన్న నివాసానికి తన చిన్నకుమారుడు ఫ్రెండ్స్‌ను తీసుకొని చేరుకున్నాడు. ఈ క్రమంలో మృతురాలి అక్క, బావ, అన్న భిక్షపతి, తమ్ముడు నగేష్ పంచాయతీ పెట్టి ఇకపై గొడవలు జరగకుండా ఉండేలా నచ్చజెప్పారు. అదేరోజు రాత్రి 11:30 గంటలకు నిందితుడు బోడ శంకర్ నిద్రలో ఉన్న భార్య గొంతునులిమి కత్తితో గొంతుకోసి దారుణంగా హత్యచేశాడు. తర్వాత నిందితుడు అక్కడి నుండి పారిపోయాడు. ఈ ఘటనలో మంజుల అక్కడి కక్కడే మృతి చెందింది. మృతురాలి అన్న భిక్షపతి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని శవాన్ని ఆసుపత్రికి తరలించారు. నిందితుడు శంకర్‌ను పట్టుకోవడానికి పోలీసులు సిబ్బంది నాలుగు బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.



భర్త చేతిలో హత్య గురైన మంజుల



విచారణకు హాజరైన గాదరి కిషోర్, చిత్రంలో దాసోజు శ్రవణ్ తదితరులు

## విచారణకు హాజరైన బిఆర్ఎస్ నేత గాదరి కిషోర్

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), సెప్టెంబరు 20, ప్రభాతవార్త:** సీఎం రమేష్‌పై అనుచిత వ్యాక్యలు చేసిన కేసులో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ శనివారం జూబ్లీహిల్స్ పోలీసుల ముందు విచారణకు హాజరయ్యారు. దాదాపు అరగంటకుపైగా ఆయనను పోలీసు అధికారులు విచారించి ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేశారు. విచారణ అనంతరం ఆయన మాట్లాడుతూ తమ నాయకుడు కేటీఆర్‌పై చేసిన వ్యాక్యలను ఖండిస్తూ తాను మాట్లాడానని అన్నారు. తనపై కుట్రపూరితంగా కేసు నమోదు చేశారని అన్నారు. తాను తాటాకు చప్పుళ్లకు భయపడనని, పార్టీ కోసం, ప్రజల కోసం పనిచేస్తానన్నారు. సీఎం రమేష్ రాజకీయాలు మానుకొని, దందాలు చేసుకోవాలంటూ వ్యాక్యానించారు. తాను చట్టాలను గౌరవించి విచారణకు హాజరయ్యానని, పోలీసులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పినట్లు తెలిపారు. ఆయనతోపాటు బిఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, గెల్లు శ్రీనివాస్‌లతోపాటు పలువురు నాయకులు పోలీస్‌స్టేషన్ వద్దకు వచ్చి పెద్దఎత్తున నినాదాలు చేశారు.

# ఎయిర్‌పోర్టులో భారీగా హైడ్రోపోనిక్ గంజాయి పట్టివేత

## రూ. 12 కోట్లు విలువ చేసే 12 కిలోల ప్యాకెట్ల స్వాధీనం

**రంగారెడ్డి జిల్లా సెప్టెంబరు 20, ప్రభాతవార్త:** భారీగా హైడ్రోఫోనిక్ కలుపు మొక్కల పదార్థాలను పట్టుకున్న సంఘటన శంషాబాద్ ఎయిర్ పోర్టు లో చోటుచేసుకుంది. పక్కా సమాచారంతో డిఆర్ఐ అధికారులు శంషాబాద్



ఎయిర్‌పోర్టులో పట్టుబడిన హైడ్రోపోనిక్ గంజాయి ప్యాకెట్లు

ఎయిర్‌పోర్టులో తనిఖీలు నిర్వహించగా రూ 12 కోట్లు విలువ చేసే 12 కిలోల హైడ్రోపోనిక్ కలుపు మొక్కల పదా ర్థాలను పట్టుకున్నారు. దుబాయ్ నుండి శంషాబాద్ రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ కి వచ్చిన భారతీయ ప్రయాణికురాలుపై డి ఆర్ఐ అధికారులు అను మానం రావడంతో విచా రించారు. మహిళ బ్యాగు లో ఆకుపచ్చ రంగులో కలిగిన ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అయితే అది గంజాయికి సంబం ధించిన పదార్థంగా తేలింది. బ్యాగులో నుంచి 6 కిలోల హైడ్రోపోనిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. సుమారు వీటి విలువ 12 కోట్ల రూపాయలు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని మహిళలను అరెస్ట్ చేశారు.

# ట్రంప్ ఉత్తర్వులు ఐటి కంపెనీలపై తీవ్రప్రభావం

## ముందస్తుగా అమెరికాతో సంప్రదింపులు జరపడంలో కేంద్రం విఫలం

## కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున లేఖ రాస్తా: మంత్రి శ్రీధర్‌బాబు



**హైదరాబాద్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆలోచన తీరు ఆయన ప్రియ మిత్రుడు ప్రధాని మోడీకే బాగా తెలుసని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. హెచ్1బి వీసా రుసుంను ఏటా లక్ష డాలర్లకు పెంచితే కేంద్రం ఎందుకు మౌనంగా ఉంటుందని, దీని వెనుకున్న మర్మమేమిటని ప్రశ్నించారు. శనివారం సచివాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హెచ్ - 1బి వీసా పొందే వారిలో సుమారు 72 నుంచి 73 శాతం మంది భారతీయులేనని, ఈ ప్రభావం భారత్ పైనే అధికం ఉంటుందని వివరించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత్‌కు రికార్డు స్థాయిలో 135.46 బిలియన్ డాలర్ల రెమిటెన్స్ వచ్చాయి. ఇందులో అమెరికా వాటా 27.7 శాతం. ట్రంప్ తాజా నిర్ణయంతో మనకొచ్చే రెమిటెన్స్ తగ్గిపోతాయన్నారు. ఆ ప్రభావం మన విదేశీ మారక ద్రవ్య నిల్వలపై పడుతుందని, ఈ విషయం తెలిసినా ముందస్తుగా అమెరికాతో సంప్రదింపులు జరిపి సమస్యను పరిష్కరించేందుకు కేంద్రం చొరవ చూపలేదు. కనీసం ప్రస్తుతం ఉన్న అమెరికాలో ఉన్న హెచ్ 1బి వీసాదారులకు మినహాయింపులను సాధించడం లోనూ విఫలమయ్యిందని విమర్శించారు. భారత్‌కు నష్టం చేకూర్చేలా ట్రంప్ ఇప్పటికే 50 శాతం టారిఫ్ విధించారు. ఇప్పుడేమో హెచ్ - 1బి వీసా ఫీజును పెంచారు. మన ఆర్థిక వ్యవస్థకు నష్టం జరుగుతున్నా ప్రధాని మోడీ మాత్రం స్పందించడం లేదని, పైగా ఇది మన మంచికే అంటూ వ్యాఖ్యానించడం దురదృష్ట కరం అని అన్నారు. ఇప్పటికైనా ప్రధాని మోడీ, విదేశాంగ మంత్రి మేల్కొని సమస్య పరిష్కారానికి నేరుగా అమెరికాతో చర్చించాలన్నారు. కనీసం ఇప్పటికే అక్కడున్న హెచ్ - 1బి వీసాదారులకు తాత్కాలిక మినహా యింపు కల్పించడంపై దృష్టి సారించాలి. భారతీయ ఐటి నిపుణులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి. రెమిటెన్స్‌పై ఆధారపడే కుటుంబాలు, సంస్థల పట్ల సానుకూల నిర్ణయం తీసుకోవాలి అని కోరారు. భారతదేశానికొచ్చే మొత్తం రెమిటెన్స్‌లో తెలంగాణ దేశంలో 8.1 శాతం వాటాతో నాలుగో స్థానంలో ఉందన్నారు. ట్రంప్ నిర్ణయం వల్ల అధికంగా ప్రభావం పడే రాష్ట్రాల్లో మనది ఒకటన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరపున కేంద్రం దృష్టికి తీసుకెళ్తూ ప్రత్యేకంగా లేఖ రాయనున్నట్లు తెలిపారు. రాష్ట్రాల హక్కులను హరించడంలో బిజీగా ఉన్న కేంద్రానికి మన భారతీయుల గురించి ఆలోచించే తీరిక లేదు. రాజ్యాంగం ప్రకారం భారతదేశం అంటే రాష్ట్రాల సమూహం. కానీ... కేంద్రానికి మాత్రం బిజెపి అధికారంలో ఉన్న వాటినే రాష్ట్రాలుగా పరిగణిస్తుంది. ఏ విషయంలోనూ తెలంగాణను రాష్ట్రంగా పరిగణించడం లేదు. ఇది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని వాపోయారు.

# నేడు సూర్య గ్రహణం

## రాత్రివేళ సంభవిస్తుండడంతో భారత్‌లో కనిపించని వైనం

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** ఈ యేడాది చివరి సూర్య గ్రహణం ఆదివారం సంభవించనుంది. భాద్రపద అమావాస్య (దీనిని మహాల య అమావాస్యగా కూడా పిలుస్తారు). ఈ నెల 7న భారత్ సహా అనేక దేశాలను కనువిందు చేసిన సంపూర్ణ చంద్ర గ్రహణం గురించి ప్రజలు ఇంకా మరచిపోక ముందే ఆదివారం సూర్య గ్రహణం ఏర్పడనుంది. భాద్రపద అమావాస్య రోజున సూర్య గ్రహణం ఏర్పడడం చాలా అరుదుగా జరుగుతుంటుందని ఆగమన పండితులు చెబుతున్నారు. ఈ అమావాస్య రోజున హిందువులు పితృ కర్మలు చేయడం ఆనవాయితీ. ఇదే రోజున సూర్య గ్రహణం సంభవించబోతోంది. అయితే ఈ గ్రహణం భారత్‌లో కనిపించడం లేదు. భారత కాలమానం ప్రకారం రాత్రి 10.59 గంటల నుంచి మరుసటి రోజు తెల్లవారూమున 3.23 గంటల వరకు ఈ గ్రహణం వుంటుంది. ఈ ఏడాది చివరి సూర్య గ్రహణం ఇదే కావడం గమనార్హం. దీని తరువాత 2027 ఆగస్టు రెండవ తేదీన సంపూర్ణ సూర్య గ్రహణం ఏర్పడనుంది, కాగా ఆదివారం నాటి సూర్య గ్రహణం ఆస్ట్రేలియా, న్యూజీలాండ్, అట్లాంటిక్, అంటార్కిటికా, పసిఫిక్ మహా సముద్రం ప్రాంతాలలోనే కనిపించనుంది. ఈ గ్రహణం ఉత్తర ఫల్గుణి నక్షత్రంలో ఏర్పడుతుంది. ఈ గ్రహణం భారత్‌లో కనిపించనందున సూతకాలం వుండదని, ఎవరు ఎలాంటి నియమాలను పాటించాల్సిన అవసరం లేదని ఆగమన పండితులు చెబుతున్నారు.

# రేవంత్ మళ్లీ సిఎం కావడం ఖాయం



### కాళేశ్వరం సిబిఐ విచారణకు ఇచ్చాక మౌనం వహిస్తున్న కేంద్రమంత్రులు

### కవిత బయటకు రావడం కెసిఆర్ రచించిన నాటకంలో భాగం

### తెలంగాణలో చాపకిందనీరులా విస్తరిస్తున్న బిజెపి

### మాజీ ఎంపి మధుయాష్కీ చిట్‌చాట్

**హైదరాబాద్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:** కాళేశ్వరం కెసిఆర్‌కు ఎటిఎం లాంటిదని అమిత్‌షా విమర్శలు చేశాడని, తెలంగాణ ప్రభుత్వం ఆ ప్రాజెక్టు కుంగుబాటు, అవి నీతిపై విచారణ జరుపాలని సిబిఐకి ఇచ్చాక కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండిసంజయ్‌లు సప్పుడు చేడంలేదని వారి మౌనం వెనుక ఆంతర్యమేమిటనీ మాజీ ఎంపి మధుయాష్కీ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బలహీనవర్గాల చాంఫియన్ అయిండు ఆయన మళ్ళీ ముఖ్యమంత్రి అవడం ఖాయం అని మధుయాష్కీ అన్నారు. గాంధీ భవన్‌మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ చిట్ చాట్‌లో ఆయన మాట్లాడుతూ గతంలో రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం అంశం సిబిఐ విచారణ కు ఇవ్వాలనీ, రెండు రోజుల్లో తెలుస్తామనీ కిషన్ రెడ్డి, బండి సంజయ్ అన్నారనీ గుర్తుచేశారు. కాంగ్రెస్ లోకల్ గా విచారణ చేస్తే రాజకీయ కక్ష అని ఆరోపించారని చెప్పారు. గతంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి వీరభద్ర సింగ్ కూతురు పెళ్లి జరగకుండా సిబిఐ అడ్డుకుందని వివరించారు. కవిత ఇంటి నుండి బయటకు రావడం అనేది కెసిఆర్ రచించిన నాటకమే అని అభివర్ణించారు. పార్లమెంట్ ఎన్నికల్లో జిరో సీట్లు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ కూడా పెట్టని దైన్యంతో ఉన్న బిఆర్ఎస్ అస్తిత్వం కాపాడుకోవడానికి, ఏవిధంగా అధికారంలోకి రావాలనే కుట్రల ఎత్తుగడలు కెసిఆర్ చేస్తున్నారని విమర్శించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒడి పోతామని బిఆర్ఎస్ కు భయపడుతుందని యాష్కీ అన్నారు. కవిత ఆరు నెలలకింద అన్నపైన అలిగింది, ఇప్పుడు బావ పైన మాట్లాడుతుందని అని ఆయన ఎద్దేవా చేశారు. కళింకితులు సారా కుంభకోణంలో ఇరికి న వాళ్ళు నీతులు చెప్పున్నారని కవితను విమర్శించారు. విమలక్క లాంటి వాళ్ళు పార్టీ పెడితే ఆదరిస్తారు సారా కుంభకోణం లో ఇరుక్కున్న కవిత పార్టీ పెడితే ఎవరు ఆదరించరని ఆయన జోస్యం చెప్పారు. అశోక్ నగర్ లో విమలక్క సామాజిక బతుకమ్మ పేరుతో ఆఫీసు పెడితే బలవంతంగా ఖాళీ చేయించిందని గతంను ఆయన గుర్తుచేశారు. దోచుకున్న డబ్బును దాచుకోవడానికే కవిత జాగృతి సంస్థను పెట్టిందని ఆరోపించారు. నాగార్జున ఎన్ కన్వెన్షన్ నోటీసులు ఇచ్చి రైతుల పెరుమీద జాగృతి కి డబ్బులు తీసుకుందని ఆరోపించారు. ఏఒక్క రైతుకు ఒక్క పైసా ఇవ్వలేదని మధుయాష్కీ విమర్శించారు. తర్వాత లిస్ట్ ను ఎత్తివేసింది. కనీసం తీన్మార్ మల్లన్నను ఎవరైనా నమ్ముతారు కానీచనిపోయిన రైతు కుటుంబాల డబ్బులు కాజేసిన కవిత ను ఎవరు నమ్మతారని ఆయన ప్రశ్నించారు. ఇప్పటి వరకు కవిత బలహీన వర్గాలకు ఏమి చేసిందని బలహీన వర్గాలు ఆమె వెంట ఉంటారు అని అడిగారు. పదేళ్ల అధికారం లో ఉండి బిసిలను మోసం చేసిన వాళ్ళు, ఇప్పుడు మాటలు చెబితే నమ్మరని అన్నారు. బిసి అయినంత మాత్రాన బిసి నాయకులు కాలేరు. బిసి ల కోసం నిజం గా పని చేసిన వారే నాయకులు అవుతారని అన్నారు. పది సంవత్సరాల తర్వాత ఇప్పుడు కవితకు బిసి లు గుర్తొచ్చారా...? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ఎవరి వెనకాల ఉండడు ఆయన స్ట్రేట్ పార్వర్డ్ అంటూ వ్యాఖ్యానించారు. తెలంగాణ లో బిజెపి చాపకింద నీరులాగా పెరుగుతుంది కాంగ్రెస్ కు నెక్స్ పోటీ బిజెపి తో ఉంటదని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ను ఎదుర్కోవడానికి బిజెపి కెసిఆర్ కేసులన్ని ఎత్తి వేసి ఆయనను పావులుగా వాడుకునే అవకాశం ఉందని అన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమోఘం గా పని చేస్తోండుని మధుయాష్కీ కితాబు ఇచ్చారు. నెక్స్ ముఖ్యమంత్రి ఎవరనే చర్చ అనవసరం దేశంలో బెస్ట్ సిఎం రేవంత్ రెడ్డికి పేరుంది మళ్ళీ అధికారం లోకి వస్తాం, రేవంత్ రెడ్డి మళ్ళీ ముఖ్యమంత్రి అవుతడు కలకాలం కల్వకుంట్ల కుటుంబం అధికారంలో ఉండాలని తెలంగాణ ను దోచుకుందని ఆరోపించారు. కెసిఆర్ హాయంలో అత్యధికంగా నష్టపోయింది బిసిలే, బలహీన వర్గాలకు రేవంత్ రెడ్డి ఛాంపియన్ అయిండని అన్నారు

# పాత పెన్షన్ స్కీమ్‌ను అమలు చేయాలి

## ఒపిఎస్‌ను అమలు చేస్తున్న

## జార్ఖండ్ ప్రభుత్వానికి ధన్యవాదాలు

### రాంచిలో ఎన్ఎంఒపిఎస్ భారీ బహిరంగ సభ

**హైదరాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** పాత పెన్షన్ స్కీమ్(ఒపిఎస్)ను అమలు చేస్తున్న ఝార్ఖండ్ ప్రభుత్వానికి నేషనల్ మూమెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్స్ (ఎన్ఎంఒపిఎస్) ధన్యవాదాలు తెలిపింది. ఝార్ఖండ్ ఆఫీసర్స్ టీచర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఝార్ఖండ్ సిపీఎస్ యూనియన్) ఝార్ఖండ్ సిపిఎస్ యూనియన్ విక్రాంత్ అధ్యక్షతన ఉద్యోగ ఉపాధ్యాయుల కర్మచారి సంపర్క్ మహా సమ్మేళన్ భారీ బహిరంగ సభ శనివారం రాంచి స్కూల్ గ్రౌండ్‌లో జరిగింది. సభకు ముఖ్యఅతిథిగా ఎన్ఎంఒపిఎస్ సెక్రటరీ జనరల్ స్థిత ప్రజ్ఞ, జార్ఖండ్ రెవెన్యూ శాఖ మంత్రివర్యులు దీపక్ బీరువా, ఉన్నత టెక్నికల్ విద్యాశాఖ మంత్రి సుదివ్య కుమార్, ఝార్ఖండ్ రాజ్యసభ ఎంపీ మహోవా మాజీతోపాటు ఉద్యోగ ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

జార్ఖండ్ రాష్ట్రంలో ఎన్ఎంఒపిఎస్ ఆధ్యర్యంలో కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని 2022లో రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అవలంబిస్తున్న రాష్ట్రం. ఈ సభలో ఎన్ఎంఒపిఎస్ సెక్రటరీ జనరల్ స్థిత ప్రజ్ఞ జార్ఖండ్ మంత్రివర్యులు సుదివ్య కుమార్ దీపక్ బీరువా మహో మాజీ చేతుల మీదుగా ఇటీవల రిటైర్ అయిన సిపిఎస్‌లో ఉండి పాత పెన్షన్‌లోకి మారిన ఉద్యోగులకు, పాత పెన్షన్ విధానాన్ని తీసుకుంటున్న పెన్షన్ పేమెంట్ ఆర్డర్లను ఇచ్చి మంత్రుల చేత సన్మానం చేశారు. ఈ సందర్భంగా స్థిత ప్రజ్ఞ మాట్లాడుతూ వచన్ దియాతో జాన్ బలే హీ చలిజాయే .. వచన్ న చోడే అన్న విధంగా .. ఒక్కసారి వాగ్దానం చేస్తే ప్రాణం పోయినా పర్వాలేదు కానీ మాట మాత్రం తప్పొద్దన్న విధంగా ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్ ఇదే ఎన్ఎంఒపిఎస్ సభలో వచ్చి పాత పెన్షన్ అమలు చేస్తామని మాట ఇచ్చి.. అమలు చేసి నేడు రిటైర్ అయిన సిపిఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ అమలు చేసి సన్మానించి వారికి పెన్షన్ పేమెంట్ ఆర్డర్లు ఇవ్వడం అనేది చారిత్రాత్మకమన్నారు.

### శాప్ ఫుట్‌బాల్ టోర్నీలో
# సెమీఫైనల్‌కు భారత్
### భూటాన్‌పై 1-0తో గెలుపు

**న్యూఢిల్లీ:** భూటాన్‌పై విజయంతో భారత్ శాప్ అండర్ 17 ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో సెమీఫైనల్‌కు చేరుకుంది. కొలంబోలోని రేస్‌కోర్స్ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన తమ రెండవ గ్రూప్ బి మ్యాచ్‌లో భూటాన్‌ను 1-0 తేడాతో ఓడించింది. ఈ విజయంతో, రెండు మ్యాచ్‌ల్లో ఆరు పాయింట్లతో ఉన్న భారత్ పురుషుల జట్టు ఛాంపియన్‌షిప్-2025 సెమీ ఫైనల్లో తన స్థానాన్ని పదిలం చేసుకుంది. రెండవ అర్ధభాగంలో సూపర్‌సబ్ రహాన్ అహ్మద్, 57వ నిమిషంలో మ్యాచ్ యొక్క ఏకైక గోల్ చేసి, భారత్‌కు విజయాన్ని అందించడంలో కీలకంగా వ్యవహరించాడు. అంచనాల కంటే మించి భూటాన్ దృఢంగా ఉండటంతో ఊహించిన దానికంటే బ్లూ కోల్ట్స్ గట్టి సవాలును ఎదుర్కొంది. తొలి అర్ధభాగంలో భారత్ తన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. కానీ భూటాన్ జట్టు ధీటుగా ఎదుర్కొంది. 27వ నిమిషంలో కామ్గోహావో డౌంగెల్ అద్భుతమైన వాంగ్ఖేరక్పామ్ గుస్లీబా క్రాస్ నుండి హెడర్ ద్వారా గోల్ యత్నం చేసినా అది సాధ్యం కాలేదు. కెప్టెన్ డెన్నీ సింగ్ వాంగ్‌ఖేమ్ 37వ నిమిషంలో శక్తివంతమైన క్రాస్‌ను తిప్పాడు. చివరికి 58వ నిమిషంలో ఆట మలుపు తిరిగింది. రహాన్ అహ్మద్ అప్రమత్తంగా వ్యవహరించి భారత్‌కు ఆధిక్యాన్ని అందించాడు. అంతేకాకుండా రహాన్ భూటాన్‌కు నిరంతరం ముప్పుగా నిలిచి భూటన్‌ను కట్టడి చేయడంతో భారత్ విజయం సాధించింది. తదుపరి మ్యాచ్‌లో భారత్ ఈ నెల 22, సోమవారం పాకిస్తాన్‌తో తలపడనుంది. ఈ ఆటలో గెలిచిన జట్టు గ్రూప్ బి లో అగ్రస్థానంలో ఉంటుంది.



### వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో
# ఖాళీ చేతులతో అథ్లెట్లు
### పతకం లేకుండా ముగిసిన భారత్ ప్రచారం

**న్యూఢిల్లీ:** ప్రపంచ అథ్లెటిక్స్ కప్ షిప్-2025లో భారత్ అథ్లెట్లు నిరాశపరిచారు. ఒక్క పతకం కూడా సాధించలేక ఖాళీ చేతులతో తిరిగి వచ్చారు. టోక్యోలో చివరి రోజు శనివారం జరిగిన పురుషుల 20 కి.మీ రేస్‌వాక్‌లో సెర్విన్ సెబాస్టియన్ 31వ స్థానంలో నిలిచాడు. దీంతో ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భారతదేశం ప్రచారం శనివారం ముగిసింది. గ్లోబల్ ఈవెంట్‌లో పోటీలో ఉన్న చివరి భారతీయుడు సెర్విన్, రేసును 1:23.03 సెకన్లలో ముగించాడు. ఈ ఏడాది మే లో అతని వ్యక్తిగత మరియు సీజన్ అత్యుత్తమ సమయం 1:21.14 సెకన్ల కంటే ఇది దాదాపు రెండు సెకన్లు తక్కువ. కాగా మూడు ఎడిషన్లలో భారత ట్రాక్ మరియు ఫీల్డ్ స్టార్లు ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌ల నుండి ఖాళీ చేతులతో తిరిగి రావడం ఇదే మొదటిసారి. ఈ ఛాంపియన్‌షిప్‌లో భారత్ తరపున పతకం సాధిస్తాడని ఆశించిన నీరజ్ చోప్రా పురుషుల జావెలిన్ త్రో ఫైనల్‌లో నిరాశపరిచి 8వ స్థానంలో నిలిచాడు. అలాగే ప్రస్తుత ఒలింపిక్ ఛాంపియన్ అర్షద్ నదీమ్ పోడియం వెలుపలే నిష్క్రమించాడు. సచిన్ యాదవ్ జావెలిన్ త్రో ఫైనల్‌లో 86.27 మీటర్ల వ్యక్తిగత అత్యుత్తమ దూరంతో నాల్గవ స్థానంలో నిలిచాడు. పురుషుల హైజంప్‌లో సర్వేష్ కుషారే 6వ స్థానంలో నిలిచాడు. ఫైనల్‌లో అతను 2.28 మీటర్ల ఎత్తుతో వ్యక్తిగత ఉత్తమ ప్రదర్శనను కూడా నమోదు చేశాడు. మహిళల 800 మీటర్ల పరుగులో పూజా కూడా 2:01.03 సెకన్లలో పూర్తి చేయడంతో భారత్ తరపున ఒక్క పతకాన్ని కూడా సాధించలేకపోయారు.






### నేడు రెండో
# పోరు
### రిఫరీగా మళ్లీ పైక్రాఫ్ట్
### భారత్, పాక్ మధ్య హై ఓల్టేజ్ మ్యాచ్

**న్యూఢిల్లీ:** 2025 ఆసియా కప్‌లో భారత్ వర్సెస్ పాకిస్తాన్ ఈ నెల 21న మరోసారి తలపడనున్నాయి. గ్రూప్ ఎ నుంచి సూపర్ 4 దశకు అర్హత సాధించిన భారత్, పాకిస్తాన్ హై ఓల్టేజ్ మ్యాచ్‌లో మరోసారి ఢీ కొట్టనున్నాయి. గ్రూప్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ భారత్ విజయం సాధించగా, పాకిస్తాన్ ఆడిన మూడు మ్యాచ్‌ల్లో రెండింటిలో గెలిచి, గ్రూప్ దశలో ఆడిన ఒక మ్యాచ్‌లో భారత్‌తో ఓడిపోయింది. దీంతో ఈ మ్యాచ్‌లో పుంజుకోవాలని పాక్ చూస్తుండగా, మరో విజయంతో ఫైనల్ వైపు తన స్థానాన్ని బలోపేతం చేసుకోవాలని భారత్ చూస్తోంది. ఈ నేపథ్యంలో భారత్, పాక్ మధ్య జరిగే ఈ సూపర్ ఫోర్ మ్యాచ్ ఫస్ట్ మ్యాచ్ కంటే మరింత ఉత్కంఠంగా ఉండనుంది. కాగా ఈసారి పాక్‌కు భారీ పంచ్ పడింది. ఈ టోర్నీలో భారత్ తో గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లో చోటు చేసుకున్న షేక్ హ్యాండ్ వివాదంలో పాక్ క్రికెట్ బోర్డు (పిసిబి) మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్‌ను టార్గెట్ చేసిన విషయం తెలిసిందే. టాస్ సమయంలోను, మ్యాచ్ అయిపోయాక భారత్ ఆటగాళ్లు పాక్ ప్లేయర్లకు షేక్ హాండ్ ఇవ్వలేదు. దీన్ని అవమానంగా భావించిన పిసిబి భారత్ ఆటగాళ్లను ఏమీ చేయలేక, మ్యాచ్ రిఫరీ పైక్రాఫ్ట్‌పై పడింది. భారత్ ఆటగాళ్ల పట్ల పక్షపాతంగా రిఫరీ వ్యవహరించి, క్రీడా స్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తించాడని ఆరోపించింది. ఈ విషయాన్ని హైలెట్ చేస్తూ రిఫరీ పైక్రాఫ్ట్‌ను ఆసియా కప్ నుండి తొలగించాలని డిమాండ్ చేసింది. లేకుంటే యూఏఈతో మ్యాచ్ ఆడబోమని, టోర్నీని బాయ్‌కాట్ చేస్తామని బెదిరిస్తూ ఐసీసీకి లేఖ రాసింది. దీంతో ఆసియా కప్ టోర్నీని బాయ్‌కాట్ చేయాలనుకుంటే భారీ మొత్తంలో ఫెనాల్టీగా నగదు చెల్లించాలని వార్నింగ్ పాక్‌కువార్నింగ్ ఇచ్చింది. అంతేకాకుండా భారత్, పాక్ మధ్య జరిగే మ్యాచ్‌కు మళ్లీ పైక్రాఫ్ట్‌నే రిఫరీగా నియమిస్తూ ఐసీసీ నిర్ణయం తీసుకుని పాక్‌కు గట్టి షాక్ ఇచ్చింది.

### ఒమన్‌పై గెలిచినా బౌలింగ్‌లో
# టీమిండియా ఫెయిల్
### ఆసియా కప్‌లో ముగిసిన గ్రూప్ దశ

**న్యూఢిల్లీ:** ఆసియా కప్ 2025లో టీమిండియా గ్రూప్ దశను విజయంతో ముగించింది. ఒమన్‌తో జరిగిన చివరి నామమాత్రపు మ్యాచ్‌లో టీమిండియా 21 పరుగుల తేడాతో గెలిచింది. దీంతో భారత్, పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ సూపర్ 4 దశకు చేరుకున్నాయి. ఒమన్ పై విజయంతో గ్రూప్ ఎ లో మొదటి స్థానంలో భారత్, పాకిస్తాన్ రెండవ స్థానంలో నిలిచింది. ఇక ఈ మ్యాచ్‌లో టీమిండియా గెలిచింది కానీ, ఇది టీమిండియా స్థాయి విజయం కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా బౌలింగ్‌లో టీమిండియా దారుణంగా విఫలం అయిందనే అపవాదు క్రికెట్ వర్గాల నుంచి వస్తున్నాయి. అందుకు కారణం టీమిండియా బౌలింగ్ ఎటాక్‌ను పసికూన ఒమన్ టీమిండియాను ఎంతో సమర్థవంతంగా ఎదుర్కొని కేవలం 4 వికెట్లు మాత్రమే కోల్పోయి 167 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో టీమిండియా స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రాతో పాటు వరుణ్ చక్రవర్తికి రెస్ట్ ఇచ్చారు. అయినా కూడా హార్ధిక్ పాండ్యా, అర్షదీప్ సింగ్, హర్షిత్ రాణా, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, శివమ్ దూబేతో కూడిన మంచి బౌలింగ్ లైనప్ ఉందని అంతా అనుకున్నారు. కానీ 188 పరుగుల టార్గెట్‌ను ఒమన్ ముందు ఉంచిన టీమిండియా ప్లేయర్లు పవర్ ప్లేలో ఒక్క వికెట్ కూడా తీయ్యలేకపోవడం వారి ప్రదర్శనకు అద్దం పడుతోంది. మొత్తం 20 ఓవర్లలో కేవలం 4 వికెట్లు మాత్రమే పడగొట్టగలిగారు. ఒమన్ టాపార్డర్ బ్యాటర్లు చాలా అద్భుతంగా ఆడారు. అందులో ఎలాంటి డౌట్ లేదు. కానీ, టీ20లో వరల్డ్ ఛాంపియన్‌గా ఉన్న జట్టు ఓ ఇద్దరు బౌలర్లు బుమ్రా, వరుణ్ చక్రవర్తికి రెస్ట్ ఇస్తే బౌలింగ్ ఇంత వీక్‌గా మారుతుందా అనే డౌట్ ఇప్పుడు పెద్ద చర్చనీయాంశంగా మారింది. మొత్తంగా 8 మంది బౌలర్లను కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ప్రయోగించాడు. కానీ, వారిలో కేవలం టాప్ 4 మాత్రమే ఒక్కో వికెట్ తీసుకున్నారు. ఆరుగురు బౌలర్లు 8కి పైగా ఎకానమీ నమోదు చేశారు. ఇది ఒక ఛాంపియన్ టీమ్ బౌలింగ్ ఎటాక్ లాగా అయితే అనిపించలేదని ప్రతి భారతీయ క్రికెట్ అభిమానే కాకుండా భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు సభ్యులు సైతం ఫీల్ అవుతున్నాడు. ఒమన్ లాంటి టీమ్ మనపై 4 వికెట్ల నష్టానికి 167 పరుగులు చేస్తే, పెద్ద టీమ్స్ ఎలా ఆడతాయంటూ ప్రశ్నలు వస్తున్నాయి.




### చైనా మాస్టర్స్ ఫైనల్‌కు
# సాత్విక్-చిరాగ్ జోడీ



**న్యూఢిల్లీ:** చైనా మాస్టర్స్-2025లో భారత్ పురుషుల డబుల్స్ జోడీ రాంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్-శెట్టి చిరాగ్ ఫైనల్‌కు చేరుకున్నారు. శనివారం జరిగిన మ్యాచ్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ 21-17, 21-14 తేడాతో ఆరోన్ చియా-సోహ్ వూయ్ యిక్‌లను ఓడించింది. కాగా హాంకాంగ్ ఓపెన్‌లో ఫైనల్‌కు చేరుకున్న తర్వాత, ఈ భారత్ జోడీ 41 నిమిషాల సెమీఫైనల్ పోరులో మలేషియా ద్వయాన్ని ఓడించి బిడబ్ల్యూఎఫ్ టూర్‌లో వరుసగా ఫైనల్‌కు చేరుకుంది. రాంకిరెడ్డి మరియు శెట్టి చివరిసారిగా ఈ టూర్‌లో వరుసగా ఫైనల్స్‌కు చేరారు. జనవరి 2024లో ఈ షట్లర్లు మలేషియా ఓపెన్, ఇండియా ఓపెన్‌లలో రన్నరప్‌గా నిలిచారు. మలేషియన్లను 21-12, 21-19 తేడాతో ఓడించి ప్రపంచ ఛాంపియన్‌షిప్ సెమీఫైనల్స్‌లోకి ప్రవేశించిన తర్వాత, చియాసోహ్‌పై భారత జట్టుకు ఇది ఒక నెల వ్యవధిలో రెండో విజయం. భారత జట్టు తమ రెండవ కాంస్య పతకంతో వరల్డ్స్‌లో తమ ప్రచారాన్ని ముగించింది.

### గోల్డ్‌కార్డు వీసాల జారీకి
# ట్రంప్ ఉత్తర్వులు
### పదిలక్షల డాలర్లు చెల్లిస్తే వీసా మంజూరు





**న్యూయార్క్, సెప్టెంబరు 20:** గోల్డ్ కార్డు వీసాలకు చెందిన ఎగ్జిక్యూటివ్ ఆదేశాలపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. సంపన్న విదేశీయులు అమెరికాలోకి ప్రవేశించేందుకు గోల్డ్ కార్డు స్కీమ్ బాగా పనిచేసే అవకాశాలు ఉన్నాయి. ఇదొరకరకంగా అమెరికాకు కలిసి రానున్నది. గోల్డ్ కార్డు ప్రోగ్రామ్ కింద అమెరికా వీసా కోరుకునే వ్యక్తి సుమారు పది లక్షల డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది, లేదా ఏదైనా సంస్థ నుంచి రావానుకుంటే 20 లక్షల డాలర్లు రుసుం చెల్లించాల్సి ఉంటుంది. గోల్డ్ కార్డు కోసం డబ్బులు చెల్లిస్తే, ఆ కస్టమర్ల వీసా వేగంగా యాక్సిస్‌కు వస్తుంది. దేశంలో గ్రీన్‌కార్డు పొందేందుకు కూడా మార్గం సుగమం అవుతుంది. గోల్డ్ కార్డు అద్భుతమైందని ట్రంప్ అన్నారు. గిఫ్ట్ డబ్బును తీసుకుని, పన్నులను తగ్గించనున్నట్లు చెప్పారు. దీంతో రుణభారం కూడా తగ్గుతుందన్నారు. గోల్డ్ కార్డు ద్వారా వందల బిలియన్ల డాలర్ల సొమ్ము వస్తుందని, దీని వల్ల కొన్ని కంపెనీలు తమ ఉద్యోగులను సురక్షితంగా ఉంచుకుంటుందన్నారు. ఈ కార్డు కింద దరఖాస్తు చేయాలనుకునే అభ్యర్థి నాన్‌రిఫండబుల్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తుదారుడి ప్రాసెసింగ్ ఫీజు అందిన తర్వాత వీసా జారి గురించి పనులు ప్రారంభిస్తారు. వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత ఒకవేళ ఆ అభ్యర్థికి అప్రూవ్ అయితే, ఆ వ్యక్తి పది లక్షల డాలర్లు గిఫ్ట్ ఇవ్వాల్సి ఉంటుంది. గోల్డ్ కార్డు కోసం వచ్చే నిధులన్నీ ట్రెజరీలో జమా చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఆ డబ్బును అమెరికా వాణిజ్య పరిశ్రమ అభివృద్ధికి వినియోగించనున్నారు. అమెరికా సమాజానికి ఉపయోగపడే హై వాల్యూ కస్టమర్స్‌కు గోల్డ్ కార్డు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నది. రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టగానే, గోల్డ్ కార్డుల గురించి ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. సంపన్న ఇన్వెస్టర్లు, వ్యాపారవేత్తలను ఆకర్షించేందుకు ఈ స్కీమ్‌ను రూపొందించినట్లు వైట్‌హౌజ్ తెలిపింది. గోల్డ్ కార్డులతో వచ్చే ఆదాయంతో ఇమ్మిగ్రెంట్లకు అవసరమైనఏర్పాట్లు చేయనున్నారు.

### ట్రంప్ వీసా రుసుం పెంపుతో
# ఉద్యోగులంతా వెనక్కి!
### దిగ్గజ కంపెనీల నుంచి మెయిల్స్ జారీ




**న్యూయార్క్, సెప్టెంబరు 20:** హెచ్1బీ వీసా విషయంలో ట్రంప్ తాజా నిర్ణయంతో టెక్ కంపెనీలు అప్రమత్తమయ్యాయి. మైక్రోసాఫ్ట్ , మెటా వంటి ప్రధాన ఐటీ సంస్థలు తమ ఉద్యోగులకు కీలక అడ్వైజరీ జారీ చేశాయి. హెచ్1బి వీసాదారులందరూ కనీసం 14 రోజుల పాటూ అమెరికాను విడిచి వెళ్లొద్దని సూచించాయి. ప్రస్తుతం అమెరికా వెలుపల ఉన్న ఉద్యోగులు 24 గంటల్లోపు తిరిగి యూఎస్‌కు రావాలని ఆదేశించాయి. అమెరికాలో తమ భవిష్యత్తు కోసం విదేశీ ఉద్యోగులు ఈ ఆదేశాలను పాటించాలని కోరాయి. ఈ మేరకు ఉద్యోగులకు ఆయా సంస్థలు అంతర్గత మెయిల్స్ పంపినట్లు తెలిసింది. హెచ్1బీ, హెచ్4 వీసాదారులు 24 గంటల్లోపు అంటే ఈనెల 21 లోపు ఆలస్యం చేయకుండా అమెరికాకు తిరిగి వచ్చేయాలని మెటా, మైక్రోసాఫ్ట్ సంస్థలు ఆదేశించాయి. అమెరికాలో ఉద్యోగం చేయాలనుకునే వారికి డొనాల్డ్ ట్రంప్ భారీ షాక్ ఇచ్చిన విషయం తెలిసిందే. విదేశీ నిపుణుల నియామకానికి జారీ చేసే హెచ్1బీ వీసా దరఖాస్తులపై వార్షిక రుసుంను లక్ష డాలర్లకు పెంచుతూ కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకం చేశారు. ఈ నిర్ణయంతో అమెరికా వేదికగా పనిచేస్తున్న కంపెనీలు విదేశీ నిపుణులను నియమించుకునేందుకు జారీ చేసే ఒక్కొక్క వీసాపై ఇకపై ఏడాదికి లక్ష డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది. చెల్లింపులకు కంపెనీలు సిద్ధంగా లేనట్లయితే వర్క్ వీసాపై వెళ్లేవారు ఇంటి ముఖం పట్టాల్సిందే. దీని ప్రభావం భారతీయ వృత్తి నిపుణులు, నైపుణ్యం కలిగిన చైనా కార్మికులపై ఆధారపడే టెక్ రంగంపై అధికంగా ఉండనుంది. అగ్రరాజ్యంలో మాస్టర్స్ ప్రోగ్రామ్ చేయాలనుకునే భారతీయుల ఆశలు ఆవిరయ్యే ప్రమాదం ఉన్నది. అమెరికాలో కార్యకలాపాలు సాగిస్తున్న పలు టెక్ కంపెనీలకు ట్రంప్ నిర్ణయం పెద్ద దెబ్బే అని చెప్పాలి. ఎందుకంటే భారత్‌కు చెందిన పలు దిగ్గజ సంస్థలు ఎక్కువగా హెచ్1బీ వీసాలతోనే అమెరికాలో తమ వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఈ వీసాలతోనే భారతీయుల్ని నియమించుకుంటున్నాయి. ఇందులో అమెజాన్ సంస్థ టాప్‌లో ఉంది. ఆ తర్వాత టాటా కన్సల్టెన్సీ రెండోస్థానంలో నిలిచింది. యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ డేటా ప్రకారం2024-25 ఆర్థిక సంవత్సరం జూన్ నాటికి అమెజాన్ దాదాపు 10,044 హెచ్1బీ వీసాలను ఉపయోగించింది. ఆ తర్వాత టీసీఎస్ 5,505, మైక్రోసాఫ్ట్ (5,189), మెటా (5,123), యాపిల్ (4,202), గూగుల్ (4,181), డెలాయిట్ (2,353), ఇన్ఫోసిస్ (2,004), విప్రో (1,523), టెక్ మహీంద్రా అమెరికాస్ (951), ఒరాకిల్ (2,092), అమెజాన్ వెబ్ సర్వీసెస్ (2,347), కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ (2,493), వాల్‌మార్ట్ అసోసియేట్స్ (2,390) హెచ్1బీ వీసాలను దక్కించుకున్నాయి. ఇవే కాకుండా అమెరికాకు చెందిన పలు కంపెనీలు కూడా హెచ్1బీ వీసాలతో ఎక్కువమంది భారతీయులను నియమించుకుంటున్నాయి. ఇపుడు ఈ కంపెనీలపైనా ఈ ప్రభావం ఎక్కువ ఉంటుందని అంచనావేస్తున్నాయి.



### భారత్ రుణ రేటింగ్‌ను 'ట్రిపుల్ బి ప్లస్'కు పెంచిన జపాన్ రేటింగ్ సంస్థ!

**న్యూఢిల్లీ,** సెప్టెంబరు 20: భారత దీర్ఘకాలిక సావరిన్ రుణ రేటింగ్‌ను జపాన్ రేటింగ్ సంస్థ అప్‌గ్రేడ్‌చేసింది. ట్రిపుల్ బి నుంచి తాజాగా ట్రిపుల్‌బి ప్లస్‌కు పెంచుతున్నట్లు జపాన్‌కు చెందిన రేటింగ్ ఇన్వెస్ట్‌మెంట్ ఇన్ఫర్మేషన్ (జెఆర్‌అండ్‌ఐఐ)వెల్లడించింది. దేశ ఆర్థికవ్యవస్థ భవిష్యత్ అంచనాను స్థిరంగా కొనసాగించింది. ఈ ఏడాదిలో భార త్ రేటింగ్‌ను పెంచిన మూడో రుణరేటింగ్ సంస్థగా జపాన్‌సంస్థ నిలిచింది. 2025 మే నెలలో మన రేటింగ్‌ను ట్రిపుల్‌బి మైనస్ నుంచి ట్రిపుల్‌బిగా అతిపెద్ద క్రెడిట్‌రేటింగ్ ఏజెన్సీ మార్నింగ్‌స్టార్ డిబిఆర్ మార్చింది. అమెరికాకు చెందిన ఎస్‌అండ్‌పి గత ఆగస్టులో భారత్‌రేటింగ్‌ను బిబిబిమైనస్‌నుం చి ట్రిపుల్‌బికి మార్చింది. అత్యంతశరవేగంగా అభివృద్ధిచెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటి అని రేటింగ్ పెంపులో బౌగో ళిక సానుకూలతలు, బలమైన దేశీయ గిరా కీ, అనుకూల ప్రభుత్వ విధానాలు వంటివి కలిసి వస్తున్నట్లు జపాన్‌సంస్థ వెల్లడిం చింది.పన్నురాబడుల్లో పెరుగుదల, రాయి తీల హేతుబద్ధీకరణ, జిఎస్టీ హేతుబద్ధీకరణ, నిర్వహణ సామర్థ్యం ఉన్న స్థాయిలో రుణాలు వంటివి రేటింగ్‌కు మూలం అని పేర్కొంది. ప్రభుత్వ ద్రవ్య స్థిరీకరణ పురోగతి అత్యంత మెరుగ్గా ఉందని ఆర్ఐ రేటింగ్ సంస్థ భారత్ ఆర్థిక వ్యవస్థనుప్రశంసించింది.

### వాణిజ్యం




### బ్రేక్ తీసుకున్న మహిళలకు
# 'రీస్టార్ట్ విత్ ఇన్ఫోసిస్'
### రెండో ఐటి సేవల సంస్థ బంపర్ ఆఫర్

**బెంగళూరు, సెప్టెంబరు 20:** దిగ్గజ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ మహిళా టెక్కీలకు బంపర్ ఆఫర్‌ప్రకటించింది. కుటుంబం, ఇతర బాధ్యతల కోసం కెరీర్‌కు బ్రేక్ ఇచ్చి మళ్లీ ఉద్యోగంలో చేరాలనుకునే వారికి ఆఫర్ ఇస్తోంది. ' రీస్టార్ట్ విత్ ఇన్ఫోసిస్' అనే కొత్త నియామక ప్రక్రియ ప్రారంభించింది. ఇక్కడ కనీసం 6 నెలలు ఉద్యోగ జీవితానికి బ్రేక్ తీసుకున్న మహిళలను తమ కంపెనీలోకి తీసుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రోగ్రామ్ గురించి ఇన్ఫీ ఉద్యోగులకు మెయిల్ చేసింది. అలాంటి మహిళా ఉద్యోగుల్ని రిఫర్ చేస్తేవారికి రివార్డులు అందిస్తామని ప్రకటించింది. రివార్డు గరిష్టంగా రూ. 50 వేల వరకు ఉంటుంది. ఇది ఉద్యోగుల్లో సరికొత్త జోష్ నింపింది. జేఎల్3 కి రిఫర్ చేస్తే రూ. 10 వేలు ప్రోత్సాహకం ఉంటుంది. జేఎల్4 కు రూ. 25 వేలు, జేఎల్5కి రూ. 35 వేలు, జేఎల్6 కు రూ. 50 వేల చొప్పున ప్రోత్సాహకాలు అందించనుంది. అర్హతల విషయానికి వస్తే.. ముందుగా కనీసం 2 సంవత్సరాలు పని చేసి ఉండాలి. వరుసగా 6 నెలల పాటు ఉద్యోగం నుంచి బ్రేక్ తీస్కొని ఉండాలి. టెక్ లీడ్, డెవలపర్, మేనేజర్ స్థాయిల్లో .నెట్, జావా, ఒరాకిల్, పైథాన్, సేల్స్‌ఫోర్స్ ఇలాంటి టెక్నాలజీలకు సంబంధించిన ఉద్యోగాల్ని భర్తీ చేయాలని చూస్తోంది. ఇన్ఫోసిస్ తన ఇఎస్‌జి(ఎన్విరాన్‌మెంటల్, సోషల్ అండ్ గైడెన్స్) విజన్ 2030లో భాగంగా ఉద్యోగుల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచాలని, 45 శాతానికి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం ఇన్ఫీ ఉద్యోగుల్లో మహిళల వాటా 39 శాతంగా ఉంది. ఇక్కడ కేవలం ఉద్యోగం ఇవ్వడం మాత్రమే కాదు బ్రేక్ తర్వాత తిరిగి వస్తున్న మహిళలకు నైపుణ్యాభివృద్ధి, మెంటార్‌షిప్ ట్రైనింగ్ కూడా ఇవ్వనుంది. గత ఆర్థిక సంవత్సరంలో దాదాపు 900 మంది మహిళల్ని తిరిగి ఉద్యోగాల్లో చేర్చుకుంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.